# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 19 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 164 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


15 ఏళ్లు నిండితేనే సోషల్ మీడియా: యూఏఈ



2

ఎరుపు రంగు చెవులతో అరుదైన ఏనుగు



2




## రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

హైదరాబాద్,జూన్ 18(మనం,ప్రత్యేక ప్రతినిధి) : హైదరాబాద్‌లోని రాయదుర్గంలో ఇటీవల రికార్డు ధర పలికిన అత్యంత ఖరీదైన భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) దాఖలు చేసిన పిటిషన్తో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఉత్తర్వులతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ లావాదేవీపై సందిగ్ధత నెలకొంది. రాయదుర్గం పాన్మక్తాలోని ...మిగతా 2లో

## ఎవరు అడ్డుపడ్డా.. మూసీ ప్రక్షాళన చేస్తా



## ఎవరు ఏడ్చినా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతం

- గుర్రంగూడ ఏకోపార్క్‌కు ఎన్ని నిధులైన ఇస్తం
- బీఆర్ఎస్ పార్టీ ఫ్యూచర్‌ను ప్రజలు ఎప్పుడో రద్దు చేశారు
- వనస్థలిపురంలో దేవుడి భూముల్ని కూడా కబ్జా పెట్టారు
- ప్రభుత్వ భూముల్ని కబ్జా చేస్తే వీపులు సున్నం చేస్తాం
- భూకబ్జాలతో ప్రజలకు సమస్యలు రావద్దనే హైడ్రా తెచ్చాం
- హైడ్రాను ఒక భూతంలా చూపిస్తున్నారు.. సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూన్ 18(మనం,ప్రత్యేక ప్రతినిధి) : ఎవరి ఎన్ని కుట్రలు చేసినా, ఎవరు అడ్డుపడ్డా, చివరకు ఎండ్రిన్ తాగినా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. హైదరాబాద్ లోని గుర్రంగూడ ఎకోపార్క్‌లో సీఎం గురువారం మొక్క నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. హరిత నిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటిన అనంతరం రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..మూసీ అభివృద్ధి చేస్తామంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని, గతంలో మూసీ చుట్టుపక్కల ఉంటే దోమలు నోట్లోకెళ్లేవన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలనే తాము ప్రయత్నిస్తున్నామన్నారు. ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సబర్మతి, యమునా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్ తాగినా నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అలా చెప్పిన ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవడన్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే ఫాంహౌస్‌కు పరిమితమయ్యారన్నారు. కల్వకుంట వాళ్ల కడుపు నిండా కాలకూట విషమేనని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. మూసీలో కాలుష్యం కంటే కల్వకుంట వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రజలు వాళ్లకు బుద్ధిచెప్పారన్నారు. ప్రజలు మురికిలోనే పొర్లాలని వాళ్లు భావిస్తున్నారన్నారు.నగరానికి

## రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్

- జూన్ 26 నుంచి 28 వరకు నిలిపివేత
- ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు కీలక ప్రకటన




హైదరాబాద్,జూన్ 18 (మనం, ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. సర్వర్ అప్గ్రేడేషన్, నిర్వహణ పనుల కారణంగా జూన్ 26 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా ...మిగతా 2లో

## ఇక డిజిటల్ కేబినెట్ పేపర్‌లెస్ గవర్నెన్స్‌కు శ్రీకారం

మంత్రులకు ట్యాబ్‌లను అందజేసిన శ్రీధర్‌బాబు 2



## టెలిగ్రామ్ కొత్త డార్క్ వెబ్.. నేరగాళ్లకు అడ్డా

### కేంద్రం సంచలన ఆరోపణలు

ఢిల్లీ, జూన్ 18: మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ




యాప్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సదరు మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ''ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ...మిగతా 2లో

## మన విద్యావ్యవస్థ పిల్లల్ని చిదిమేస్తోంది

### కోటా మహార్యాలీలో రాహుల్

కోటా, జూన్ 18: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం రాజస్థాన్‌లోని కోటాలో



''ఛాత్రోంకీ గూంజ్'' (విద్యార్థుల ప్రతిధ్వని) పేరుతో ఏర్పాటైన మహార్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దేశ విద్యా వ్యవస్థ పిల్లలను పీడనకు, ఒత్తిడికి గురిచేసి వారిని చిదిమేస్తోందని రాహుల్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ''ఇది దేశానికి మంచిది కాదు. విద్యార్థుల్లో నిరాశా నిస్పృహలు తలెత్తకుండా పని చేసే వ్యవస్థ కోసం మనందరం కలిసి పనిచేద్దాం'' అని రాహుల్ పిలుపునిచ్చారు. ''ఇది రాజకీయ సమావేశం కాదు. ఇది మీ కోసం ఏర్పాటైన సమావేశం. మంచి ...మిగతా 2లో

## మళ్లీ బంగాళాఖాతం జలాల్లోకి పాక్ సబ్‌మెరైన్‌లు..!


ఢిల్లీ, జూన్ 18: 1971 ఇండియా-పాక్ వార్.. బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిగిన ఈ యుద్ధంలో భారత నౌకాదళ సామర్థ్యాన్ని దాయాది కళ్లారా చూసింది. ఆ దెబ్బతో పాక్ మరోసారి బంగాళాఖాతంలోకి అడుగుపెట్టే సాహసం చేయలేదు. అలాంటిది ఇన్నేళ్ల తర్వాత మన శత్రుదేశం కన్ను మళ్లీ ఈ జలాలపై పడింది. బంగాళాఖాతంలో జలాంతర్గాములను మోహరించే ఆలోచన చేస్తోంది. పాక్ నేవీకి చెందిన సీనియర్ అధికారి వ్యాఖ్యలతో ఈ విషయం బయటపడింది.



పాకిస్థాన్ తమ నౌకాదళంలోకి కొత్తగా హంగోర్ శ్రేణి జలాంతర్గాములను చేర్చుకునే ప్రణాళికలను వేగవంతం చేసింది. చైనా నుంచి 8 హంగోర్ శ్రేణి సబ్‌మెరైన్‌ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో ఒకటి ఇటీవల చైనా నుంచి పాక్ చేతికి వచ్చింది. దానికి ఎస్కార్ట్‌గా ఉన్న ఫ్లోటిల్లా నౌక కమాండర్ కమోడోర్ ఒమర్ ఫరూఖీ మార్గమధ్యలో శ్రీలంకలో ఆగారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ''హంగోర్ శ్రేణి జలాంతర్గాములతో మా దేశ నౌకాదళ సామర్థ్యం అరేబియా సముద్రాన్ని దాటి విస్తరించనుంది. వీటితో మేం బంగాళాఖాతంలోనూ మా సైనికశక్తిని మోహరించే అవకాశం దక్కుతుంది. ఇవి గేమ్ఛేంజర్ సబ్మెరైన్లు'' అని వ్యాఖ్యానించారు. దీంతో ఈ హంగోర్ జలాంతర్గాములను పాక్ బంగాళాఖాతంలో మోహరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బంగాళాఖాతం ఏ దేశానికి ప్రాదేశిక సముద్రం కాదు. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, మలేసియా, ఇండోనేసియా, శ్రీలంక తీర దేశాలుగా ఉన్నాయి. తీర ప్రాంతం నుంచి సముద్రం లోపలికి 12 నాటికల్ మైళ్ల వరకు ప్రాదేశిక జలాలుగా ...మిగతా 2లో

## హర్మూజ్‌లో కదులుతున్న నౌకలు!

టెహ్రాన్, జూన్ 18: ఇరాన్-అమెరికా మధ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా పేర్కొనే హర్మూజ్‌కు మళ్లీ ఊపిరి పోసినట్లయ్యింది. ఆంక్షల నేపథ్యంలో




కొంతకాలంగా అక్కడ వందలాది నౌకలు చిక్కుకుపోగా.. తాజాగా పరిస్థితులు కుదుటపడడంతో తిరిగి తమ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ఆయా నౌకలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒప్పందం తక్షణమే అమల్లోకి రావడంతో కొన్ని నౌకలు ఇప్పటికే ఆ మార్గంలో బయలుదేరినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

నౌకల రాకపోకలను ట్రాకింగ్ చేసే వ్యవస్థ 'విండ్‌వార్డ్' ప్రకారం.. హర్మూజ్‌లో సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన నౌకల్లో కొన్ని గురువారం ఉదయమే తమ ప్రయాణాన్ని ప్రారంభించాయి. తొలుత చైనాతో సంబంధమున్న ఐదు నౌకలు కదలగా, యూరోపియన్ జెండాలున్న రెండు నౌకలు తర్వాత క్రమంలో వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఏడు నౌకలు కూడా గత వంద రోజులకుపైగా హర్మూజ్ సమీపంలో చిక్కుకుపోయినవేనని సమాచారం.

వీటితోపాటు మరికొన్ని నౌకలు కూడా లంగరు వేసిన ప్రదేశం నుంచి జలసంధి వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో హాంకాంగ్, జపాన్‌కు చెందిన భారీ నౌకలు ఉన్నట్లు తెలిసింది. కాల్పుల విరమణ ఒప్పందం, వ్యూహాత్మక జలమార్గాన్ని తెరవడం వంటి అంశాలపై విశ్వాసం పెరుగుతోందనడాన్ని తాజా పరిణామం సూచిస్తోందని నౌకల ట్రాకింగ్ వ్యవస్థలు అంచనా వేస్తున్నాయి. అయితే, హర్మూజ్‌లో పూర్తిగా సాధారణ పరిస్థితులు నెలకొనడం అనేది శాంతి ఒప్పందం అమలుపై ఇరుపక్షాల నిబద్ధతపైనే ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## స్టాక్ మార్కెట్లు దూసుకుపోతున్నాయి



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 2

## అది సిగ్గుచేటు

### ఐరోపా మిత్రదేశాలపై అమెరికా ఫైర్!

వాషింగ్టన్, జూన్ 18: ఐరోపాలోని నాటో మిత్రదేశాలపై అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఐరోపాలోని స్థావరాలను వినియోగించుకునేందుకు అమెరికాను అనుమతించలేదని మండిపడ్డారు. తద్వారా అనేకమంది అమెరికన్ల ప్రాణాలను ప్రమాదంలో పడేశాయని ఆరోపించారు. ఇది చాలా సిగ్గుచేటు అని విమర్శించారు. బ్రస్సెల్స్ వేదికగా నాటోపై



సభ్యదేశాల రక్షణశాఖ మంత్రులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఈ క్రమంలోనే ఐరోపాలోని అమెరికా దళాలపై ఆరు నెలల రివ్యూ ప్రోగ్రామ్ను హెగ్సెత్ ప్రకటించారు. ఐరోపా దేశాలు తమ సొంత భద్రతకు ఎంత వేగంగా చర్యలు తీసుకుంటాయనే దానిపై రివ్యూ ఫలితం ఆధారపడి ఉంటుందన్నారు. ''మేం సీరియస్‌గా సమీక్ష చేస్తాం. ఐరోపా రక్షణకు అక్కడి దేశాలే ప్రాథమిక బాధ్యత వహించడానికి ముందుకు వచ్చేలా చూడటానికే ఈ ప్రోగ్రామ్ను రూపొందించాం'' అని తెలిపారు. హర్మూజ్ను తెరిపించేందుకు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన విజ్ఞప్తిని ఐరోపా దేశాలు పట్టించుకోలేదు. దాంతో ఆగ్రహానికి గురైన ఆయన.. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని పలుమార్లు ప్రకటించారు. నాటో కూటమికి అందిస్తోన్న సాయాన్ని కత్తిరించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు చేస్తోంది. ఐరోపాలో నాటో కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచిన విమానాలు, యుద్ధనౌకలను తగ్గించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

## రష్యాలో ప్రయాణికుల విమానం గల్లంతు

### సురక్షితంగా లాండింగ్



వాషింగ్టన్, జూన్ 18: రష్యా లో 125 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఒక్కసారిగా గల్లంతైంది. దీనికి ముందు విమానం నుంచి అత్యవసర సంకేతాలు వచ్చాయి. అయితే, కొద్దిసేపటికే విమానం సోచీ విమానాశ్రయంలో ఎమర్జెన్సీగా ల్యాండ్ అయ్యింది. వివరాల్లోకి వెళితే.. బుధవారం సాయంత్రం స్మార్టావియా సంస్థకు చెందిన 734-800 బోయింగ్ విమానం సోచి నుంచి అర్ఖంగెల్స్‌కు బయలుదేరింది. నల్లసముద్రం మీదుగా వెళ్తుండగా.. విమానం నుంచి ఒక్కసారిగా అత్యవసర సంకేతాలు వచ్చాయి. ఆ వెంటనే విమానానికి రాడార్ నుంచి సంకేతాలు తెగిపోయాయి. విమానం అదృశ్యమైన కొద్దిసేపటికే తిరిగి కన్పించగా.. సోచీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటన సమయంలో విమానంలో 125 మంది ప్రయాణికులతో పాటు ఐదుగురు విమానయాన సిబ్బంది ఉన్నారు. వీరంతా సురక్షితంగా ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని రష్యన్ మీడియా పేర్కొంది. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానాల్లో వారి గమ్యస్థానాలకు తరలించనున్నట్లు వెల్లడించింది. సాంకేతిక నిపుణులు ఈ ఘటనకు గల కారణాలను పరిశీలిస్తున్నారని తెలిపింది. విమానం ఇంజిన్లో సాంకేతిక లోపం తలెత్తడంతోనే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే ఇలా ఏదైనా విమానానికి రాడార్ నుంచి సంకేతాలు తెగిపోతే అది ఎక్కడోచోట కూలిపోవడం తప్ప, తిరిగి సురక్షితంగా ల్యాండ్ కావడం అరుదు. ఈ సంఘటనతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# 15 ఏళ్లు నిండితేనే సోషల్ మీడియా: యూఏఈ

**అబుదాబి, జూన్ 18:** సామాజిక మాధ్యమాలు పిల్లలపై దుష్ప్రభావం చూపుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతోన్న నేపథ్యంలో సోషల్ మీడియా కట్టడికి పలు దేశాలు కొత్త చట్టాలు తీసుకొస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలో అరబ్ దేశం యూఏఈ కూడా చేరింది. సామాజిక మాధ్యమ వేదికల వినియోగానికి కనీస వయసును 15 ఏళ్లుగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆమోదించింది. దీంతో ఈ తరహా నిబంధన తీసుకొచ్చిన తొలి అరబ్ దేశంగా యూఏఈ నిలిచింది. కొత్త నిబంధనల ప్రకారం.. 15 ఏళ్ల లోపు చిన్నారులు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఖాతాలను తెరిచేందుకు అనుమతి ఉండదు. అంతేకాదు.. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోని కొన్ని రకాల ఫీచర్లపై వీరికి యాక్సెస్ కల్పించకూడదు. వయసు సంబంధిత కంటెంట్ ఆంక్షలు, స్క్రీన్ టైమ్, యాప్ వినియోగ సమయంపై పరిమితి వంటి రూల్స్‌ను ఆయా ప్లాట్‌ఫామ్‌లు తీసుకురావాల్సి ఉంటుంది. సోషల్ మీడియాతో పిల్లలకు పొంచి ఉన్న ముప్పును తప్పించడంతో పాటు ఆరోగ్యకరమైన డిజిటల్ వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నిబంధనలు తీసుకొచ్చినట్లు యూఏఈ ప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా ప్లాట్‌ఫామ్‌లలో మార్పులు చేసేందుకు సోషల్ మీడియా కంపెనీలకు యూఏఈ 12 నెలల గడువు విధించింది. దశల వారీగా ఈ రూల్స్ను అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపింది. 2024 నాటి గణాంకాల ప్రకారం.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పిల్లలు సగటున రోజుకు 3 గంటల పాటు సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నారు. చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ తీసుకొచ్చిన తొలి దేశంగా ఆస్ట్రేలియా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత యూకే, మలేసియా లాంటి దేశాలు కూడా ఈ తరహా నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చాయి.

## ఎరుపు రంగు చెవులతో అరుదైన ఏనుగు

**డెహ్రాడూన్, జూన్ 18:** ఉత్తరాఖండ్‌లోని కార్బెట్ టైగర్ రిజర్వ్లో అరుదైన మగ ఏనుగు పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఎరుపు రంగు చెవులను కలిగి ఉండటంతో అది 'రెడ్ ఇయర్స్'గా ప్రసిద్ధి చెందింది. టైగర్ రిజర్వ్‌లోని ఢిఖాలా, జిర్నా జోన్లలో ఈ అరుదైన గజరాజు ఇటీవల సందర్శకులకు దర్శనమిచ్చింది. చర్మంలో ఆ భాగంలో రక్తనాళాలు కనిపించడం వల్ల వీటికి సహజంగా ఎరుపు రంగు వస్తుందని వన్యప్రాణి నిపుణులు చెబుతున్నారు.

## స్టాక్ మార్కెట్లు దూసుకుపోతున్నాయి

**వాషింగ్టన్, జూన్ 18:** అమెరికా-ఇరాన్ ఒప్పందంపై సంతకాలు పూర్తయిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా స్పందించారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండదని మరోసారి స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్లు దూసుకెళ్తున్నాయని, చమురు ధరలు తగ్గుతున్నాయని అన్నారు. ఈ మేరకు తన 'ట్రూత్ సోషల్'లో పోస్టులు పెట్టారు. ''చమురు ప్రవహిస్తోంది, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండదు, ప్రపంచం సురక్షితంగా ఉంటుంది. స్టాక్ మార్కెట్లు దూసుకుపోతున్నాయి, ఉపాధి అవకాశాలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. ధరలు తగ్గుతున్నాయి. మన దేశం మునుపటి కంటే బలంగా, సురక్షితంగా ఉంది'' అని ట్రంప్ పోస్టు చేశారు. దీనికి కొన్ని గంటల ముందు సామాజిక మాధ్యమంలో ఇవే అంశాలను ప్రస్తావిస్తూ.. ఇరాన్ విషయంలో తాను కఠినంగా వ్యవహరించలేదని భావించే వాళ్లు స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిని తాకుతుండటాన్ని గమనించాలన్నారు.

## ఇక డిజిటల్ కేబినెట్
# పేపర్‌లెస్ గవర్నెన్స్‌కు శ్రీకారం

**హైదరాబాద్, మనంప్రతినిధి:** రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాలు ఇక కొత్తరూపం సంతరించుకోనున్నాయి. గురువారం డిజిటల్ కేబినెట్‌కు శ్రీకారం చుట్టారు. పేపర్‌లెస్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో పాటు మంత్రులందరికీ మంత్రి శ్రీధర్‌బాబు స్పెషల్ ట్యాబ్‌లను అందజేశారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాలను పేపర్ లెస్‌గా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

## రాయదుర్గం భూముల
# వేలంపై హైకోర్టు స్టే

(మొదటి పేజీ తరువాయి)

నాలెడ్జ్ సిటీ పరిధిలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఈ-వేలం వేయడాన్ని సవాలు చేస్తూ ఎస్బీఐ కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. సుమారు 5 ఎకరాల భూమికి సంబంధించిన ఈ వివాదంలో మూడు వారాల పాటు వేలం,తదనంతర ప్రక్రియలను నిలిపివేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు టీజీఐఐసీ, ఎస్బీఐతో పాటు వేలంలో భూమిని దక్కించుకున్న గౌరా వెంచర్స్కు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. వివాదంలో ఉన్న 5 ఎకరాల భూమిని 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు కేటాయించిందని, దీని కోసం అప్పట్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్బీహెచ్) రూ. 13.33 కోట్లు చెల్లించిందని ఎస్బీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం కేటాయింపులను రద్దు చేయగా, దానిపై న్యాయపోరాటం కొనసాగుతున్నప్పటికీ టీజీఐఐసీ వేలం నిర్వహించడం సరికాదని వాదించింది. ఈ కేసులో తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. శాఖ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన సాంకేతిక పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మూడు రోజుల వ్యవధిలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్, కార్యాలయ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ స్థాయి సర్వర్ అప్గ్రేడేషన్ చేపడుతున్నామని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. ఈ అప్గ్రేడేషన్ పూర్తయిన తర్వాత సేవల భద్రత, వేగం, పనితీరు మరింత మెరుగుపడుతాయని తెలిపారు. భవిష్యత్తులో వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రజలు, రిజిస్ట్రేషన్ సేవలు వినియోగించుకునే వారు ముందస్తుగా తమ పనులను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు.అత్యవసర రిజిస్ట్రేషన్ అవసరాలు ఉన్నవారు జూన్ 26కు ముందుగానే పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 29 నుంచి అన్ని రిజిస్ట్రేషన్ సేవలను యథావిధిగా పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువస్తామని ఐజీ తెలిపారు.

# మన విద్యావ్యవస్థ పిల్లల్ని చిదిమేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తు కోసం పోరాటం సాగిస్తున్న యువజనుల కోసం ఏర్పాటు చేసిన సమావేశం. విద్యార్థులు ప్రతిరోజు ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి చర్చించడమే దీని ఉద్దేశం'' అని ఆయన పేర్కొన్నారు. పరిచయ వాక్యాలు పూర్తయ్యాక రాహుల్ ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలను వేదికపైకి పిలిచి వారితో మాట్లాడారు. కోటాలో నిర్వహించిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమం తాము దేశ వ్యాప్తంగా నిర్వహించినున్న సమావేశాల పరంపరలో మొదటిదని కాంగ్రెస్ పేర్కొంది. వైద్య విద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్తో పాటు జేఈఈ తదితర పోటీ పరీక్షల్లో పాల్గొనే 1.2 లక్షల మంది విద్యార్థులు కోటాలోని వివిధ సంస్థల్లో కోచింగ్ పొందుతున్నారు. రాహుల్‌గాంధీ ఈ మహార్యాలీ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలను గురించి, కోచింగ్‌పై వారు వెచ్చిస్తున్న మొత్తాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

# ఎవరు అడ్డుపడ్డా.. మూసీ ప్రక్షాళన చేస్త

(మొదటి పేజీ తరువాయి)

గుండెకాయ లాంటి మూసీ నదిని పునరుజ్జీవనం (ప్రక్షాళన) చేద్దామని తాము చూస్తుంటే, కొందరు రాజకీయ స్వార్థం కోసం దానికి అడ్డుపడుతున్నారని సీఎం ధ్వజమెత్తారు.గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో అభివృద్ధి పనులని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూముల రక్షణ, కబ్జాల నిరోధమే లక్ష్యంగా పనిచేస్తున్న 'హైడ్రా'పై సీఎం మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు కావాలనే హైడ్రాను ఒక భూతంలా చూపిస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హైడ్రా ఎప్పుడూ కూడా పేద ప్రజల జోలికి వెళ్లదని, కేవలం ప్రభుత్వ ఆస్తులను మింగేసే పెద్ద పెద్ద దీనిని తీసుకొచ్చామని సీఎం స్పష్టం చేశారు. కబ్జా కోరులు చివరకు వనస్థలిపురంలో దేవుడికి చెందిన భూములను సైతం వదలకుండా కబ్జాలు చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే వీపులు సున్నం చేస్తాం అని ఆయన గట్టిగా హెచ్చరించారు. భూకబ్జాల వల్ల భవిష్యత్తులో సామాన్య ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకూడదనే ఉద్దేశంతోనే తమ ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దించిందని తెలిపారు.

ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీతో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాలు విపరీతమైన కాలుష్య కోరల్లో చిక్కుకుని ఊపిరాడక ఇబ్బంది పడుతున్నాయని సీఎం గుర్తుచేశారు. రేపటి రోజున మన హైదరాబాద్ నగరానికి కూడా అలాంటి దారుణమైన పరిస్థితి రాకూడదనే ముందుచూపుతోనే తాము పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని , పచ్చదనాన్ని ప్రోత్సహిస్తున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. నగరాన్ని కాలుష్య రహితంగా, సురక్షితంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్లో ఓడిపోయానని సీఎం చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజిగిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని గుర్తు చేశారు. తనను ఓడించాలని కొందరు కుట్రలు పన్నారని, .ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను ఎల్‌బీ నగర్ ప్రజలు గెలిపించారని సీఎం ప్రస్తావించారు. ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం పేర్కొన్నారు. ఎల్బీనగర్ ప్రాంతంలో 424 ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా నిజామాబాద్, కొత్తగూడెం, హనుమకొండ, మెదక్, మహబూబ్‌నగర్ , ములుగు, నారాయణపేట, భూపాలపల్లి, సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో రూ.17. 66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, వన్యప్రాణి సంరక్షణ, జూ ఆధునీకరణ, నివాస భవనాలు, పర్యావరణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. గుర్రంగూడ ఎకో పార్కును కూడా కబ్జా చేయాలని చూశారని, కానీ తాము పెద్ద పెద్ద లాయర్లను పెట్టి పోరాడి మరి 424 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెప్పారు.



# టెలిగ్రామ్ కొత్త డార్క్ వెబ్.. నేరగాళ్లకు అడ్డా

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేకపోతున్నారు'' అని కేంద్రం తమ అఫిడవిట్లో ఆరోపించింది.

ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది.

హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మాధ్యమంలో పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్లు, కాపీరైట్ కంటెంట్ కూడా ప్రసారమవుతున్న విషయాన్ని కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్వర్క్లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

# ఈ నెల 21న నీట్ రీ-ఎగ్జామ్

- హాల్ టికెట్ చూపిస్తే?
  టీజీఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.. మంత్రి పొన్నం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** నీట్ (యూజీ) రీ-ఎగ్జామినేషన్‌కు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఓ శుభవార్తను అందించింది. పరీక్ష రోజైన జూన్ 21న టీజీఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. పరీక్షకు వెళ్లే అభ్యర్థులు తమ హాల్ టికెట్ చూపించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వంటి నగరాల్లోని పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఉచిత ప్రయాణానికి ఆదేశాలు జారీ చేశారని మంత్రి వివరించారు. ఇటీవల నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. ఈ తరుణంలో విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఇప్పటికే పొరుగున ఉండే అక్కడి ప్రభుత్వం ఏపీ సైతం ఏపీఎస్ఆర్‌టీసీ బస్సుల్లో నీట్ అభ్యర్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. పంజాబ్, ఢిల్లీ, హర్యానా, ఒడిశా వంటి ఇతర రాష్ట్రాలు కూడా విద్యార్థుల కోసం ఇలాంటి ఏర్పాట్లు చేశాయి. ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులకు ప్రయాణ ఖర్చులు తగ్గడమే కాకుండా, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునే వీలు కలుగుతుంది.

# దేశంలోనే తొలి వర్సిటీగా ఓయూ రికార్డు



- ఉస్మానియా యూనివర్సిటీకి అరుదైన గౌరవం..
- తొలిసారిగా దేశంలోకెల్లా ఒకేసారి ఓయూకి 4 ఐఎస్ఓ సర్టిఫికెట్లు
- వర్సిటీ 109 ఏళ్ల చరిత్రలో ఇది ఒక కీలక ఘట్టమన్న వీసీ ప్రొఫెసర్ కుమార్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) దేశ ఉన్నత విద్యా రంగంలో చారిత్రాత్మక ఘనత సాధించింది. దేశంలోనే తొలిసారిగా ఒకేసారి నాలుగు అంతర్జాతీయ ఐఎస్ఓ (ఐఎస్ఓ) సర్టిఫికెట్లను అందుకున్న ఏకైక విశ్వవిద్యాలయంగా రికార్డు సృష్టించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఈ ప్రతిష్ఠాత్మక ధ్రువపత్రాలను వర్సిటీకి అందజేసింది. విద్యాసంస్థల నిర్వహణ, పర్యావరణం, ఇంధనం, ఆహార భద్రత వంటి కీలక రంగాల్లో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. యూనివర్సిటీ సెనేట్ హాల్లో జరిగిన కార్యక్రమంలో బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సదరన్ రీజియన్) సందీప్ కుమార్ కనోజియా ఈ సర్టిఫికెట్లను వీసీకి అందజేశారు.

**ఓయూ సాధి(లబి)ంచిన 4 ఐఎస్ఓ సర్టిఫికేషను...**

ఐఎస్ఓ 21001:2018: విద్యా సంస్థల నిర్వహణ వ్యవస్థలకు సంబంధించినది. ఇది బోధన, అకడమిక్ పరిపాలనలో నాణ్యతా ప్రమాణాలను నిర్ధారిస్తుంది.

ఐఎస్ఓ 14001:2015: పర్యావరణ నిర్వహణ వ్యవస్థలకు చెందినది. క్యాంపస్లో పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలకు ఈ గుర్తింపు లభించింది.

ఐఎస్ఓ 50001:2018: ఇంధన నిర్వహణ వ్యవస్థలకు సంబంధించినది. విద్యుత్ వాడకంలో సామర్థ్యం, ఇంధన పొదుపు చర్యలకు ఈ ధ్రువీకరణ ఇచ్చారు.

ఐఎస్ఓ 22000:2018: ఆహార భద్రత నిర్వహణ వ్యవస్థలకు చెందినది. క్యాంపస్‌లోని హాస్టళ్లు, క్యాంటీన్లలో విద్యార్థులకు అందించే ఆహారంలో భద్రతా ప్రమాణాలకు ఈ సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా సందీప్ కుమార్ కనోజియా మాట్లాడుతూ.. ఈ ఘనత సాధించడం అభినందనీయమని, అయితే ఈ ప్రమాణాలను నిలబెట్టుకోవడమే అసలైన సవాల్ అని అన్నారు. 'ఈ సర్టిఫికెట్లు సాధించడం ఒక ముఖ్యమైన విజయం అని అన్నారు. కానీ, నాణ్యతా ప్రయాణంలో ఇది గమ్యం కాదు?.. కేవలం ఆరంభం మాత్రమే. ఈ ప్రమాణాలను నిరంతరం కొనసాగిస్తూ, మెరుగుపరుచుకోవడంలోనే అసలైన విజయం ఉంది' అని ఆయన స్పష్టం చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొళుగరమ్ మాట్లాడుతూ... వర్సిటీ 109 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఇది ఒక ముఖ్యమైన ఘట్టమని అభివర్ణించారు. 'మేము గత విజయాలపైనే ఆగిపోము. అంతర్జాతీయ ప్రమాణాలను స్వీకరించడం ద్వారా భవిష్యత్ సవాళ్లను, ప్రపంచ స్థాయి అంచనాలను అందుకునేందుకు ఉస్మానియాను సిద్ధం చేస్తున్నాం. విద్యార్థులు, సమాజ అవసరాలను తీర్చడమే మా లక్ష్యం' అని ఆయన తెలిపారు. ఈ విజయం దేశంలోని ఇతర ఉన్నత విద్యాసంస్థలకు పాలన, నాణ్యత నిర్వహణలో ఒక బెంచ్ మార్క్‌గా నిలుస్తుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేశ్ రెడ్డి అన్నారు. ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌తో పాటు వివిధ అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు సమష్టిగా కృషి చేయడం వల్లే అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ గుర్తింపు సాధ్యమైందని వర్సిటీ అధికారులు వివరించారు. ఈ ధ్రువీకరణతో అకడమిక్ పరిపాలన, పర్యావరణ హితం, ఇంధన సామర్థ్యం, ఆహార భద్రత వంటి అంశాల్లో ఓయూ తన నిబద్ధతను చాటుకుంది అని పలువురు ప్రొఫెసర్లు, మేధావులు కొనియాడారు.

# నిరుద్యోగులకు శుభవార్త

- టీజీపీఎస్సీ మరో నోటిఫికేషన్..

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణలో ఉద్యోగాల కోసం చూస్తున్న వారికి టీజీపీఎస్సీ శుభవార్త చెప్పింది. పాఠశాల విద్యా శాఖ పరిధిలో ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. డైట్ కాలేజీల్లో సీనియర్ లెక్చరర్స్, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 24 నుంచి వచ్చే నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. మొత్తం 86 పోస్టులను భర్తీ చేయడానికి ఈ నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసింది.

ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ).. కీలక చర్యలు చేపట్టింది. లెక్చరర్ పోస్టులు పలు సబ్జెక్టుల వారీగా ఉన్నాయని ప్రకటించింది. ఈ పోస్టులకు అర్హులుగా ఉన్న అభ్యర్థులు.. ఈనెల 24వ తేదీ నుంచి జులై 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని టీజీపీఎస్సీ కీలక సూచనలు చేసింది. అయితే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఓటీఆర్ (వన్ టైమ్ రిజిస్ట్రేషన్) అప్‌డేట్ ఉండాలని తేల్చి చెప్పింది.

ఇక ఈ ఏడాది నవంబర్‌లో ఈ సీనియర్ లెక్చరర్స్, లెక్చరర్స్ పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షను నిర్వహించే అవకాశం ఉన్నట్లు టీజీపీఎస్సీ వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ పోస్టుల కోసం ధరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీస వయసు 18




ఏళ్లు కాగా.. గరిష్ఠ వయో పరిమితిని 44 ఏళ్లుగా టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే ఈ వయసును 2026 జులై 1వ తేదీ నాటికి లెక్కించనున్నట్లు తెలిపింది. అదే సమయంలో రూల్స్ ప్రకారం.. పలు కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుందని స్పష్టం చేసింది. లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి జోన్ల వారీగా పోస్టుల ఖాళీలతోపాటు.. వయో పరిమితి.. వేతనం.. పరీక్ష సిలబస్ వంటి పూర్తి వివరాలు.. నోటిఫికేషన్, దరఖాస్తు విధానం సహా అన్ని విషయాలు తెలుసుకునేందుకు టీజీపీఎస్సీ అధికారిక వెబ్ సైట్‌లో చూడవచ్చని తెలిపింది. ఏదైనా ఇబ్బందులు, సహాయం కోసం వెబ్ సైట్‌లో ఉన్న ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి.. సందేహాలు నివృత్తి చేసుకోవాలని హితవు పలికింది.

ఇక నుంచి వరుసగా ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని ఇటీవలె టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కీలక ప్రకటన చేసిన నేపథ్యంలో ఒకదాని తర్వాత ఒకటి నోటిఫికేషన్లను జారీ చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే పలు శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కొన్ని నోటిఫికేషన్లను విడుదల చేసిన టీజీపీఎస్సీ.. తాజాగా తెలంగాణలో నిరుద్యోగులకు తీపి కబురు చెప్పింది. తాజాగా పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉన్న డైట్ కళాశాలల్లో ఖాళీల భర్తీకి సంబంధించి కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ కాలేజీల్లో సీనియర్ లెక్చరర్స్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేసేందుకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. 86 ఖాళీలకు నోటిఫికేషన్ జారీ చేసిన టీజీపీఎస్సీ.. అందులో సీనియర్ లెక్చరర్ పోస్టులు 23.. మిగిలిన 63

# మళ్లీ బంగాళాఖాతం జలాల్లోకి పాక్ సబ్‌మెరైన్‌లు..!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తిస్తారు. 200 నాటికల్ మైళ్ల వరకు ఎక్స్క్లూజివ్ ఎకనామిక్ జోన్ ఉంటుంది. ఆ సరిహద్దులు దాటితే అంతర్జాతీయ జలాలే. అక్కడ ఏ దేశ సైనిక నౌకలైనా స్వేచ్ఛగా సంచరించవచ్చు. భారత్కు ఇది వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం. తూర్పు నావెల్ కమాండ్ ఇక్కడే ఉంటుంది. మన దేశ అణు జలాంతర్గాములు విశాఖ కేంద్రంగానే రూపొందుతాయి. అంతేకాదు.. మన జలాంతర్గాములను నిలిపి ఉంచే 'ఐఎన్ఎస్ వర్ష' కూడా ఇక్కడే ఉంది. గతంలో విశాఖలో పాక్ గూఢచారులను అరెస్ట్ చేసిన ఘటనలూ ఉన్నాయి.

కీలకమైన కమ్యూనికేషన్ లైన్లు ఉన్నాయి. బంగ్లా సహా పలు దేశాలతో వాణిజ్యానికి ఇదే కీలక మార్గం. వాస్తవానికి భారత నౌకాదళ బలం ముందు పాక్ నేవీ ఎందుకూ కొరగాదు. మన దేశం వద్ద శక్తిమంతమైన విమాన వాహక నౌకలు, అణు జలాంతర్గాములు ఉండగా.. ఇలాంటి వాటికోసం దాయాది చైనా మీదే ఆధారపడుతోంది. మన నౌకాదళ సామర్థ్యాలను కూడా ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూనే ఉన్నాం. పాక్ నేవీకి చైనా తయారీ టైప్054ఏ/పీ ఫ్రిగేట్లు, తుర్కియే నిర్మిత మిల్జెమ్ కార్వెట్లే ఆధారం. అందువల్ల ఇప్పుడు కొత్త హంగోర్ శ్రేణి జలాంతర్గాములతో బంగాళాఖాతంలో పరిస్థితులను పాక్ మార్చేసే అవకాశం లేదు. అయితే, ఇక్కడ దాయాది మోహరింపులు ఎప్పటికైనా భారత్కు చికాకు తెప్పించేవే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి కాలంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ మైత్రి బలపడుతోంది. ఇలాంటి సమయంలో బంగాళాఖాతంపై పాక్ ఆశలు బయటపడటం ప్రాధాన్యం సంతరించుకుంది. 1971 యుద్ధం తర్వాత ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు తెగిపోయిన సంగతి తెలిసిందే. అయితే, 2024లో బంగ్లాలో షేక్ హసీనా సర్కారు కుప్పకూలిన తర్వాత.. పాక్ ఆ దేశానికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోంది. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు మొదలవడం, ద్వైపాక్షిక వాణిజ్యం పెరగడం, సైనిక సహకారం బలోపేతం చేసుకోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. కరాచీ, ఛట్టోగ్రామ్ మధ్య తొలిసారి నేరుగా సముద్రమార్గంలో వాణిజ్యం కూడా మొదలైంది. ఇక, గతేడాది నవంబరులో పాక్ యుద్ధ నౌక పీఎన్ఎస్ సైఫ్ నాలుగురోజుల పాటు ఛట్టోగ్రామ్ తీరంలో మోహరించడం గమనార్హం.

ఈ జలాంతర్గామిని చైనా అభివృద్ధి చేసింది. ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ టెక్నాలజీతో దీన్ని రూపొందించారు. సాధారణ డీజిల్-ఎలక్ట్రికల్ సబ్‌మెరైన్లతో పోలిస్తే ఇది సుదీర్ఘకాలం పాటు నీటి లోపల ఉండగలదు. దీంతో ఈ జలాంతర్గామిని గుర్తించి, ట్రాక్ చేయడం అంత సులభం కాదు. 1971 తర్వాత అరేబియా సముద్రానికే పరిమితమైన పాక్.. తమ నౌకాదళ సామర్థ్యాన్ని మరింత విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే అధునాతన ఆయుధాలను సమీకరించుకుంటోంది. మొత్తంగా 8 హంగోర్ శ్రేణి సబ్‌మెరైన్లను దాయాది తమ నేవీలోకి చేర్చుకుంటోంది.

బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిగిన ఆ యుద్ధం సమయంలో పాకిస్థాన్కు చెందిన పీఎన్ఎస్ హంగోర్.. టోర్పిడోతో దాడి చేసి భారత్కు చెందిన ఐఎన్ఎస్ ఖుక్రీని ముంచేసింది. భారత్కు స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఓ యుద్ధ నౌక మునిగిపోవడం అదే తొలిసారి. అయితే, ఈ ఘటన యుద్ధం ఫలితాన్ని మార్చలేకపోయింది. దీనితర్వాత భారత నేవీ పాక్కు ఎరవేసి దాని యుద్ధనౌక పీఎన్ఎస్ ఘాజీని పేల్చేసింది. భారత దళాల సామర్థ్యం ముందు నిలవలేక పాక్ 13 రోజులకే తోక ముడిచింది. ఆ యుద్ధం తర్వాత బంగాళాఖాతంలో మళ్లీ పాక్ నేవీ కన్పించలేదు.



# రైతు పక్షపాత ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలి

## ఈ రెండున్నరేళ్ల కాలంలోనే 66,038 రైతు కుటుంబాలకు 3301.90 కోట్ల రైతుబీమా చెల్లింపు

## ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం ప్రీమియం ను చెల్లించాం: మంత్రి

## పథకాలను నిలిపివేసిన చరిత్ర గత ప్రభుత్వానిది.. పునరుద్ధరిస్తున్న ఘనత మాది

హైదరాబాద్, జూన్ 18 మనం న్యూస్ ప్రతినిధి: రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. రైతు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు.

గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ధి పొందాయని మంత్రి తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు.

2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# నీట్-యూజీ 2026 పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి



సంగారెడ్డి జూన్ 18 మనం న్యూస్ ప్రతినిధి: జూన్ 21, ఆదివారం జరగనున్న నీట్-యూజీ 2026 పరీక్షను జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్, ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా అధికారులతో, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల - సంగారెడ్డి-1, జేఎన్టీయూ - 2 కేంద్రాలు, కేంద్రీయ విద్యాలయం (ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ) - 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), సంగారెడ్డి - 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి - 1, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల - 1, ప్రభుత్వ మహిళల జూనియర్ కళాశాల - 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) పటాన్చెరు - 1. మొత్తం =9 కేంద్రాలలో 2,924 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు.

మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్ష దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, రవాణా వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష సీసీటీవీ కెమెరాల నిఘాలో నిర్వహించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఎలక్ట్రానిక్ సిగ్నల్స్ అందకుండా జామర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మాట్లాడుతూ, నీట్-యూజీ పరీక్ష సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు సేవలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్-163 బీఎన్ఎస్ఎస్ (సెక్షన్-144 సీఆర్పీసీ) అమలులో ఉంటుందని, గుంపులుగా తిరగడం, అనవసరంగా గుమికూడడం నిషేధమని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని, నిర్ణీత సమయం అనంతరం పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయబడ తాయని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎన్టీఏ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, అనుమతించిన వస్తువులు మాత్రమే వెంట తీసుకురావాలని సూచించారు. నీట్-యూజీ 2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేం దుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు.

# అక్షర అభ్యాసంలో గర్భిణీలకు శ్రీమంత కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్



మహాదేవపూర్ జూన్ 18 మనం న్యూస్ః మహాదేవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి కేంద్రంలోని మూడవ సెంటర్ మరియు ఎనిమిదవ సెంటర్లో చిన్నారులకు అక్షరాభ్యాసం గర్భిణీలకు శ్రీమంతం మరియు బడిబాట కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ అంగన్వాడి కేంద్రంలో కొత్తగా నమోదు అయిన చిన్నారులకు అక్షరాభ్యాసం ఈ సందర్భంగా గర్భిణులకు బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు చిన్నారులకు శారీరక మానసిక వికాసానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని వివరించారు.

అలాగే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంలో తల్లిదండ్రులు ప్రత్యేకత శ్రద్ధ చూపాలని సూచించారుఅంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు సమగ్ర అభివృద్ధికి ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేస్తాయని సర్పంచ్ హసీనా భాను తెలిపారు చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రారంభ విద్య పై దృష్టి పెట్టడం అవసరమని వారు పేర్కొన్నారు కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ హసినాబాను ఐసిడిఎస్ సిడిపిఓ రాధిక రెడ్డి సూపర్వైజర్ ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ వార్డ్ సభ్యులు గడ్డం స్వామి కొండపల్లి రాములు ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు.

# తప్పిపోయిన వృద్ధురాలిని గుర్తించిన ఎస్సై

- కుటుంబ సభ్యులకు అప్పగింత

దుగ్గొండి.జూన్ 18 మనం న్యూస్ః దుగ్గొండి మండలంలోని గుడ్లేలుగులపల్లి గ్రామానికి చెందిన మత్తె ఐలమ్మ అనే వృద్ధ మహిళ జూన్ 16వ తేదీ మంగళవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు ఎస్సై రావుల రణధీర్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ లో ఉన్నట్లు గుర్తించిన ఎస్సై వృద్ధ మహిళ మత్తె ఐలమ్మను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- జర్నలిస్టల అరెస్ట్ అప్రజాస్వామ్యం
- సిద్దిపేట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహ్మద్ ఖుద్రత్ అలీ

హుస్నాబాద్,జూన్ 18 మనం న్యూస్ః ప్రజాస్వామ్యంలో ప్రజల నిరసన, ఆందోళన, సమ్మె హక్కులు అత్యంత ప్రాథమికమైనవి. వాటిని నియంత్రించవచ్చు కానీ నిర్మూలించలేరని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మహ్మద్ ఖుద్రత్ అలీ అన్నారు. ఈ సందర్బంగా హుస్నాబాద్ లో మాట్లాడుతూ గురువారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా గన్ పార్క్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి స్టేషన్లకు తరలించడం అప్రజాస్వామ్యం అన్నారు.కేంద్ర ప్రభుత్వం నిరసనోద్యమాలపై అధ్యయనం చేసి వాటి నివారణకు చర్యలు చేపట్టాలనే ఆలోచన ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పోకడలు విమర్శలకు తావిస్తుంది. స్వాతంత్ర్యం తర్వాత కార్మిక హక్కులు, భూపరిమితి చట్టాలు, ఆదివాసీ హక్కులు వంటి అనేక ప్రజా ప్రయోజన చట్టాలు ప్రజా ఉద్యమాల ఫలితంగానే వచ్చాయి. ఇటీవల రైతు ఉద్యమం, మహిళా హక్కుల పోరాటాలు కూడా ప్రభుత్వాలను నిర్ణయాలు మార్చుకునేలా చేశాయి.ప్రజల స్వరాన్ని అణచివేయడం, నిరసనలను దేశ భద్రత సమస్యగా చిత్రీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. నిరసన హక్కు లేకుండా ప్రజాస్వామ్యం అర్థం కోల్పోతుంది. ప్రజల గొంతుకను మూయించడం కాదు,వారి సమస్యలను వినడం, పరిష్కరించడం ప్రభుత్వాల బాధ్యత. నిరసన ప్రజాస్వామ్యానికి శ్వాస. దాన్ని నేరంగా చూస్తే ప్రజాస్వామ్యం పతనమవుతుంది.



ఇప్పటికైనా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క జర్నలిస్టుకు పెన్షన్ ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్లో 100 కోట్లు కేటాయించాలని ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని,అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిడేషన్ కార్డులు,ఇంటి స్థలంతో పాటు ఇండ్లు మంజూరు చేయాలని, ప్రవేట్ పాఠశాలల్లో వంద శాతం ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు

మహాదేవపూర్ జూన్ 18మనం న్యూస్ః మహాదేవపూర్ మండలంలోని చంద్రుపల్లి గ్రామ పంచాయతీకి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీపథకంఎంజీఎంఆర్ఈజీఎస్ కింద మొత్తం రూ.25 లక్షల నిధులు మంజూరుచేయడం జరిగింది. ఇందులో కొత్త జీపీ బిల్లింగ్కురూ.20 లక్షలు,సీసీరోడ్లు నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించారు. ఈ నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులుదుద్దిళ్ళ శ్రీధర్ బాబుకి చంద్రుపల్లి సర్పంచ్గు ర్సింగ బాపు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు,బలహీనవర్గాలఅభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యంఇస్తూప్రజలకు న్యాయం చేస్తున్నదని అన్నారు. గ్రామీణాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల పెంపు దిశగాఈ నిధులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడ ంలో కీలక పాత్ర పోషించిన స్థానిక సర్పంచ్ గుర్సింగ బాపును గ్రామస్తులు అభినందించారు. గ్రామంలోని మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజల అవసరాలను గుర్తించి చర్యలు తీసుకోవడం పట్ల ఆయనపై ప్రశంసలు కురిపించారు.

# హరిత తెలంగాణ కోసం మహా సంకల్పం

## గుర్రంగూడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవానికి శ్రీకారం

- 16.06 కోట్ల మొక్కలతో పచ్చని తెలంగాణ నిర్మాణం
- భవిష్యత్ తరాలకు హరిత వారసత్వం అందించడమే లక్ష్యం



సిద్దిపేట రిపోర్టర్, జూన్18 మనం న్యూస్ః వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లాలోని గుర్రంగూడ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రాష్ట్రవ్యాప్తంగా 16 కోట్ల మొక్కలను ఈ సంవత్సరంలో నాటాలని టార్గెట్ గా పెట్టుకోవాలని నిర్ణయించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములై వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంత దోహదం చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో నిర్దేశించిన 20 లక్షల మొక్కలను నాటేందుకు అటవీ శాఖ మరియు ఇతర శాఖల సమన్వయంతో నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయడం జరిగిందని వాటిని నాటి సంరక్షించే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. మొక్కలు నాటే ఈ బృహత్తర కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలం మర్పడగా తేజోవనం అర్బన్ పార్క్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్, జిల్లా ఆటశాఖ అధికారి పద్మజరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, జిల్లా అధికారులతో కలిసి డిజిటల్ తెరపై వీక్షించిన జిల్లా కలెక్టర్ కే. హేమావతి విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు.

# తెలంగాణా రైతాంగానికి తీపి కబురు

- 30 నుంచి రైతు భరోసా చెల్లింపులు
- ఏడు సన్నరకాలకు బోనస్ కొనసాగింపు
- మధిరలో భారీ రైతు సమ్మేళనానికి ఏర్పాట్లు
- రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్రం పై ఒత్తిడి
- డిజిటల్ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

హైదరాబాద్, మనంప్రతినిధిః ఖరీఫ్ సీజన్కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని జూన్ 30న ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించే భారీ రైతు సమ్మేళ నం ద్వారా అధికారికంగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.ఖమ్మం జిల్లా మధిరలో బహిరంగ సభను నిర్వహించి, అదే వేదిక నుంచి తెలంగాణ వ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులను నేరుగా జమ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలోముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన అనధికారిక మంత్రివర్గ సమావేశంలో వ్యవసాయం, రైతు సంక్షేమం, ఎరువుల లభ్యత, పంటల కొనుగోలు, హైదరాబాద్ మెట్రో విస్తరణ, పరిపాలనా సంస్కరణలకు సంబంధించి తీసుకున్న కీలక నిర్ణయాలను సమావేశం అనంతరం సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,దలసరి అనసూయసితక్క లతోకలిసి పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న బోనస్ను ఏడు సన్నరకాల వరి వంగడాలకు కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మార్కెట్ డిమాండ్, వినియోగదారుల అభిరుచులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బోనస్ బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 వరి వంగడాలకు మాత్రమే వర్తిస్తుందని వివరించారు. ఈ వంగడాలు రాష్ట్రంలో సాగవుతున్న సన్నబియ్యం పంటలో దాదాపు 83 శాతం వాటాను కలిగి ఉండటమే కాకుండా ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ వెలుపల కూడా మంచి మార్కెట్ డిమాండ్ కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు ఎరువుల కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చినా, గత కొన్ని నెలలుగా ఆ మేరకు సరఫరా జరగలేదని తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణకు ఇప్పటివరకు మరింత అధిక స్థాయిలో ఎరువుల నిల్వలు అందాల్సి ఉందన్నారు. అలాగే రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్)లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అధిక భాగాన్ని తెలంగాణ రైతులకు కేటాయించాలని ప్రభుత్వం డిమాండ్ చేసింది. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న ఎరువులను రాష్ట్ర రైతులకు అందించడం ద్వారా రవాణా వ్యయాలు తగ్గడంతో పాటు వ్యవసాయ సీజన్లో ఎరువుల కొరతను నివారించవచ్చని మంత్రులు అభిప్రాయపడ్డారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటం, మధ్య మధ్యలో పొడి వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తొలి వర్షాలు పడగానే విత్తనాలు వేయడానికి తొందరపడవద్దని ప్రభుత్వం సూచించింది.



వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, నేలలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని కోరింది. సాధారణంగా మొలకెత్తడానికి, పంట ప్రారంభ వృద్ధికి కనీసం 7 మిల్లీమీటర్ల చొప్పున రెండు దఫాల వర్షపాతం అవసరమవుతుందని పేర్కొంది. వర్షాలు పడగానే తొందరపడి విత్తనాలు వేస్తే, అనంతరం పొడి వాతావరణం ఏర్పడిన పక్షంలో పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సీ) ద్వారా ప్రతిపాదించిన రుణానికి వెంటనే ఆమోదం తెలపాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కూడా హైదరాబాద్ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి, ప్రజల రవాణా అవసరాలను తీర్చడానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్యాబినెట్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక ట్యాబ్లను అందించినట్లు చెప్పారు. కాగిత రహిత పరిపాలనను ప్రోత్సహించడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం ఈ నిర్ణయ లక్ష్యమని వివరించారు.

ఇకపై క్యాబినెట్ నోట్లు, అజెండాలు, ఇతర అధికారిక పత్రాలు ఎక్కువగా డిజిటల్ రూపంలోనే నిర్వహించబడతాయని, దీంతో కాగిత వినియోగం తగ్గడంతో పాటు నిర్ణయ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. రాబోయే నీట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది విద్యార్థులు 2,008 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు అంచనా. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యార్థులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే ఈ నిర్ణయ లక్ష్యమని పేర్కొంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ ఉపసంఘంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, సీతక్క సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేసి, తెలంగాణపై పడే ఆర్థిక భారం ఎంత ఉంటుందో అంచనా వేసి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సిఫారసులు చేయనుందని తెలిపారు.

కొన్ని ప్రతిపాదిత మార్పులు గ్రామీణ ఉపాధి అవకాశాలను తగ్గించే ప్రమాదం ఉండటంతో పాటు రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపే అవకాశం ఉందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఉపసంఘం అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించి త్వరలోనే నివేదిక సమర్పించనుంది. ఇటీవలి యాసంగి సీజన్లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం దేశంలోనే ఈ సీజన్లో ఏ రాష్ట్రం సాధించని ఘనత అని పేర్కొన్నారు. దేశ ఆహార ధాన్య నిల్వలకు తెలంగాణ ప్రధాన సహకార రాష్ట్రంగా అవతరించిందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను రైతుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటల వ్యవధిలోనే నేరుగా జమ చేయడం ద్వారా పారదర్శకతను, రైతుల ఆర్థిక భద్రతను ప్రభుత్వం నిర్ధారించిందన్నారు.

తాజా కొనుగోలు సీజన్లోనే సుమారు రూ.18,000 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత వ్యవసాయ చక్రంలో మొత్తం రూ.38,000-39,000 కోట్ల వరకు రైతులకు చెల్లింపులు జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో కొనుగోలు కార్యకలాపాల ద్వారా రైతులకు దాదాపు రూ.1 లక్ష కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని, ఇదే సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో సుమారు రూ.1.30 లక్షల కోట్లు చెల్లించబడినట్లు వివరించారు. కేంద్ర కొనుగోలు విధానంపై ఆందోళన తెలంగాణలో పండుతున్న పంటలను కేంద్ర సంస్థలు తగిన స్థాయిలో కొనుగోలు చేయకపోవడంపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా, సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేసినప్పటికీ, కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) వ్యవస్థలో కేంద్ర సంస్థలు ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు చేయడం లేదని పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్సీఐ) ద్వారా ధాన్యం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి, నాఫెడ్ ద్వారా ఇతర పంటలను కొనుగోలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం తన రాజ్యాంగ, విధానపరమైన బాధ్యతలను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. పంటల కొనుగోలు అంశంపై కేంద్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు తెలంగాణకు చెందిన మంత్రులు, ఎంపీలు త్వరలోనే న్యూఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలవనున్నట్లు తెలిపారు.

## భువినొదిలిన క్షణం

గుక్కపట్టిన కన్నపేగు
కుప్పకూలిన నినుగన్నవారు
ఆశ్చర్యంలో బంధువర్గం
ఎలా ? ఎందుకు ? ఎప్పుడు ?
ప్రశ్నల వర్షంలో నీ పరివారం
వాట్స్ అప్ స్టేటస్లో నీ నేస్తాల
ప్రేమ సుగంధపు వెల్లువలు

అప్పటివరకు ఇన్ని బంధాల
చిక్కుముడుల్లో వున్న నువ్వు
నిద్రావస్థలో లీనమైపోతావ్
నీ చుట్టూ వున్నా నలుగురు
నిన్ను బాడీ బాడీ అని సంబోధిస్తూ
నడిరోడ్డుమీదకి తీసుకొస్తారు
కన్నీటితో కొందరు, మౌనంతో కొందరు,
బాధను వెళ్లగక్కుతూ వుంటారు

వీధంతా జనసందోహంతో నిండిపోతుంది
ఎలా భువినొదిలావో తెలియక
ప్రవచనకర్తల్లా గుంపుగా కూర్చొని
ప్రసంగాలు అల్లుకుపోతూ వుంటారు
తెలిసి కొందరు చెబుతుంటే
తెలియకకొందరు వెకిలిగా, వెటకారంగా
పదబంధనాల్లో ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంటారు

తదుపరి నిన్ను పూలవర్షంతో గర్వంగా
నలుగురు మోస్తూ తీసుకెళ్తూ ఉంటే
నిన్నటివరకు నిన్ను పలకరిస్తూ నవ్విన ఆమె
తలుపు టక్కున వేసుకుంటుంది
ఎందుకంటే నువ్విప్పుడు శవం
నీపై చల్లిన పూరేకులు అమంగళమైనవి
మీ ఇంటికొస్తే ఆమెకు అంటు మరి

సాహితీకర్తలైతే చక్కని పదాలతో
భావకవితలల్లుతూ విశ్లేషిస్తూ ఫేసుబుక్స్ లో
పోస్ట్స్ పెడుతూ వుంటారు
మీ వీధి చివరలో నీ ఫోటో గాలికి
అటు ఇటు ఊగుతూ వెళ్లేపోయే వారికి
నిన్ను గుర్తు చేస్తూ ఉంటుంది.
నువ్వు భువినొదిలిన క్షణం నిదానంగా
మరుగున పడిపోతుంది
గోడమీద జ్ఞాపకంలా
మదిలో నిన్ను చెరగని ముద్రగా
లిఖించుకున్నవారు మాత్రం
తలుస్తూ కుమిలిపోతూ
జన జీవన స్రవంతిలో
కలవలేక, కలిసినట్టు
నటిస్తూ బ్రతికేస్తుంటారు

**- వాసి జ్యోత్స్న**
9866843005

## రుబా

రాతిరి ఒంటరి
మనసు తుంటరి
ఏది జంటమరి
ఓ తారక మిటారి
నీతులు వినిపించవు
దృశ్యాలు కనిపించవు
పెదాల నిశ్శబ్ద దరువు
మనసుకు పెద్ద బరువు

**- రేడియమ్**
9291527757

# ఎల్‌నినో నీడలో దేశీయ వ్యవసాయం



భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్ల మంది ప్రజల జీవనాధారానికి వ్యవసాయ రంగమే వెన్నెముక అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశీయ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాల జూదంగానే సాగుతోంది. దేశం మొత్తం మీద ఏడాది పొడవునా కురిసే వార్షిక వర్షపాతంలో సింహభాగం, అనగా దాదాపు 75 శాతం వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ వరకు విస్తరించే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. అందువల్లనే, భారతీయ రైతాంగానికి అత్యంత కీలకమైన ఖరీఫ్ (వర్షాకాలం) పంటల విజయా పజయాలు పూర్తిగా ఈ వర్షాల పంపిణీపైనే ఆధారపడి ఉంటాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్) ప్రభావాలు మరియు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' వంటి తీవ్ర సముద్ర వాతావరణ పరిస్థితులు రుతుపవనాల గమనాన్ని తీవ్రంగా గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీని ఫలితంగా ఒకే ఏడాదిలో కొన్ని ప్రాంతాల్లో మేఘమథనంతో కూడిన అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో చుక్క నీరు లేని అనావృష్టి ఏర్పడి వర్షపాత పంపిణీలో తీవ్రమైన ప్రాంతీయ అసమతుల్యత చోటు చేసుకుంటోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో కాలం చెల్లిన సంప్రదాయ సాగు విధానాలను పక్కనబెట్టి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలోనూ, సాగు నిర్వహణలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకు రావలసిన చారిత్రక అవసరం నేడు రైతాంగంపై ఉంది.

శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తే, ఎల్‌నినో అనేది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని సూచించే ఒక సంక్లిష్ట వాతావరణ ప్రక్రియ. స్పానిష్ భాషలో 'చిన్న బాలుడు' లేదా 'ఏసుక్రీస్తు శిశువు' అని పిలవబడే ఈ దృగ్విషయం, ప్రపంచవ్యాప్త వాతావరణ నమూనాలను తలకిందులు చేసే శక్తిని కలిగి ఉంది. పసిఫిక్ సముద్రంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వాతావరణ పీడన వ్యవస్థల్లో మార్పులు వచ్చి, భారత దేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవన గాలులు బలహీన పడతాయి. భారత వాతావరణ శాఖ గత వందేళ్ల చారిత్రక గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదైన భయంకరమైన కరవు సంవత్సరాలలో అత్యధిక భాగం ఎల్‌నినో ప్రభావంతో కూడుకున్నవేనని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, 2002 వ సంవత్సరంలో ఎల్‌నినో కారణంగా దేశంలో 19 శాతం వర్షపాత లోటు ఏర్పడి అపార పంట నష్టం సంభవించింది. అలాగే 2009లో గత నాలుగు దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరవు నమోదైంది. ఆ తర్వాత 2015 మరియు ఇటీవలి 2023 సంవత్సరాలలో సైతం ఎల్‌నినో దేశవ్యాప్త వర్షపాతంలో భారీ లోటును మిగిల్చింది, తద్వారా జలాశయాలలో నీటి మట్టాలు పడిపోయి, భూగర్భ జలాధారాలు అడుగంటి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయింది.

సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షాలు వారాల తరబడి ఆలస్యమవడం లేదా ప్రారంభంలో కురిసి ఆ తర్వాత సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడటం సర్వసాధారణం. జూన్, జూలై నెలల్లో కురిసే తొలి వర్షాలను నమ్మి రైతులు తొందరపడి విత్తనాలు చల్లితే, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో నేలలోనే విత్తనాలు మాడిపోయి మొలకెత్తని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది రైతులకు పెట్టుబడి నష్టాన్ని మిగల్చడమే కాకుండా, మళ్లీ విత్తవలసిన దుస్థితికి దారితీస్తుంది. ఇటువంటి అనిశ్చిత సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రాథమిక సూచన ఏమిటంటే, రైతులు తొందరపాటు పడకుండా తమ ప్రాంతంలో కనీసం 75 నుండి 100 మిల్లీమీటర్ల వరకు స్థిరమైన మరియు తగినంత వర్షపాతం నమోదై, భూమి లోపలి పొరల వరకు తేమ చేరినట్లు నిర్ధారించుకున్న తర్వాతే ప్రధాన పంటల విత్తన ప్రక్రియను ప్రారంభించాలి. ఒకవేళ కాలం గడుస్తున్నా వర్షాలు పడకపోతే, సుదీర్ఘ కాల పరిమితి గల పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి. ఇందుకోసం ఆయా రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వశాఖలు రూపొందించే 'ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను' నిరంతరం గమనిస్తూ అమలు చేయాలి.

సాధారణ వాతావరణ పరిస్థితుల్లో జూన్ మాసంలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశెనగ, వరి వంటి సాంప్రదాయ ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంటుంది. అయితే వర్షాలు జూలై మొదటి వారం వరకు ఆలస్యమైతే, రైతులు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. ఎక్కువ నీరు, ఎక్కువ కాలం తీసుకునే రకాలకు బదులుగా స్వల్పకాలిక మొక్కజొన్న రకాలు, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు లేదా నువ్వులు వంటి నూనెగింజల పంటల వైపు మళ్లడం ఎంతో శ్రేయస్కరం. ఒకవేళ వర్షాభావం మరింత తీవ్రమై జూలై రెండో పక్షం లేదా ఆగస్టు వరకు కూడా తగినంత వర్షపాతం లేకపోతే, అసలు సంప్రదాయ పంటల ఆలోచనే పక్కనబెట్టి జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగుకు శ్రీకారం చుట్టాలి. ఈ తృణ ధాన్యాలు అత్యంత తక్కువ నీటి లభ్యతతో, కరవు పరిస్థితులను సైతం తట్టుకుని అద్భుతంగా పెరుగుతాయి. పైగా ప్రస్తుత కాలంలో ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడం వల్ల మార్కెట్లో ఈ చిరుధాన్యాలకు మరియు పప్పుధాన్యాలకు అత్యధిక డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటం రైతులకు అదనపు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది.

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఖరీఫ్ సీజన్ అనగానే అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేయడం కనిపిస్తుంది. పత్తి లాభదాయక పంట అయినప్పటికీ, దానికి ప్రారంభ దశలోనూ, పూత,కాత దశల్లోనూ సమతుల్యమైన తేమ అవసరం. ఎల్‌నినో సృష్టించే వర్షాభావ పరిస్థితుల్లో పత్తి మొక్కల పెరుగుదల క్షీణించి, దిగుబడులు దారుణంగా పడిపోతాయి. కాబట్టి, వాతావరణం అనుకూలించనప్పుడు పత్తి సాగు విస్తీర్ణాన్ని ఐచ్ఛికంగా తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా అంతర పంటల పద్ధతిలో కంది, పెసర, మినుము వంటి లెగ్యూమినేస్ (నత్రజనిని స్థిరపరిచే) పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా, ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా పెట్టుబడిని రాబట్టుకునే వీలుంటుంది.

ఇక తెలుగు ప్రజల ప్రధాన ఆహార పంట అయిన వరి సాగు విషయానికి వస్తే, నీటి వినియోగంపై పెను మార్పులు రావాల్సి ఉంది. ఎకరానికి వేల లీటర్ల నీరు అవసరమయ్యే సంప్రదాయ వరద నీటి పద్ధతి వరి సాగుకు ఎల్‌నినో కాలంలో స్వస్తి చెప్పక తప్పదు. సుదీర్ఘ కాలపరిమితి గల వరి రకాల స్థానంలో 120 రోజుల లోపు పండే స్వల్పకాలిక మరియు నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. అలాగే, సాంప్రదాయ పద్ధతిలో నారు పోసి, నీరు నిలగట్టి నాట్లు వేసే విధానానికి స్వస్తి పలికి, 'నేరుగా విత్తే వరి పద్ధతి' లేదా 'శ్రీ వరి విధానం' వంటి అధునాతన నీటి పొదుపు సాంకేతికతలను అవలంబించాలి. ఈ ఆధునిక పద్ధతుల ద్వారా సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడి తగ్గకపోగా, నీటి వినియోగాన్ని 25 నుండి ఏకంగా 40 శాతం వరకు ఆదా చేయవచ్చు. నీటి లభ్యత తక్కువగా ఉన్న తరుణంలో ప్రతి నీటి బొట్టును అమృతంగా భావించి పొదుపుగా వాడుకోవడమే వ్యవసాయాన్ని నిలబెడుతుంది.

పంటల ఎంపిక ఎంత ముఖ్యమో, పడిన వర్షపు నీటిని భూమిలో ఇంకించి, నేల తేమను సంరక్షించుకోవడం అంతకంటే ముఖ్యం. వేసవి లోతైన దుక్కులు చేయడం వల్ల వర్షపు నీరు త్వరగా భూమిలోకి ఇంకుతుంది. పొలం చుట్టూ గట్లను బలోపేతం చేయడం, వాలుకు అడ్డంగా కాంటూర్ బండ్లు (గట్లు) ఏర్పాటు చేయడం వల్ల వర్షపు నీరు వృధాగా కొట్టుకుపోకుండా ఆ పొలంలోనే నిలిచి భూగర్భ జలమట్టాన్ని పెంచుతుంది. పంట వ్యర్థాలను, ఆకులను నేలపై పరచడం (మల్చింగ్ పద్ధతి) ద్వారా సూర్యరశ్మి నేరుగా నేలపై పడకుండా నిరోధించవచ్చు, తద్వారా భూమిలోని తేమ ఆవిరి కాకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. ప్రతి గ్రామంలోనూ, పొలాల్లోనూ ఫార్మ్ పాండ్లు (పంట సంజీవని కుంటలు), చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా అత్యవసర సమయాల్లో పంటలను కాపాడుకోవడానికి అవసరమైన రక్షక తడులను అందించే వీలు కలుగుతుంది.

ఈ విపత్కర వాతావరణాన్ని తట్టుకోవడంలో విత్తన శుద్ధి కీలక పాత్ర పోషిస్తుంది. కరవును, తెగుళ్లను తట్టుకునే ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే సేకరించి, విత్తే ముందు తగిన శిలీంధ్రనాశకాలు లేదా జీవ నియంత్రణ కారకాలతో విత్తన శుద్ధి చేయడం వల్ల మొలక శాతం పెరగడమే కాకుండా, ప్రారంభ దశలో వచ్చే వ్యాధుల నుండి మొక్కలకు రక్షణ లభిస్తుంది. అలాగే, ఎల్‌నినో సమయాల్లో విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల మొక్కలు మరింత త్వరగా ఎండిపోయే ప్రమాదం ఉంది. అందుకే, ముందస్తుగా నేల పరీక్షలు నిర్వహించి, భూమిలో ఉన్న పోషకాల లభ్యతను బట్టి శాస్త్రీయంగా అవసరమైన మోతాదులోనే ఎరువులను, సేంద్రీయ మరియు ద్రవ రూప ఎరువులను (లిక్విడ్ ఫెర్టిలైజర్స్) సూక్ష్మ నీటి పారుదల (డ్రిప్ లేదా స్ప్రింక్లర్) పద్ధతుల ద్వారా అందించాలి.

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడించడం అత్యంత ఆవశ్యకమైన అంశం. భారత వాతావరణ శాఖ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు ఉపగ్రహ సమాచారం ఆధారంగా నిరంతరం అందిస్తున్న జిల్లా,మండల స్థాయి స్వల్పకాలిక, మధ్యకాలిక వాతావరణ సూచనలను రైతులు గమనిస్తూ ఉండాలి. మొబైల్ యాప్ల ద్వారా అందుతున్న ఐదు రోజుల ముందస్తు వాతావరణ అంచనాల ఆధారంగా విత్తడం, ఎరువులు వేయడం, పురుగు మందుల పిచికారీ వంటి సాగు పనులను ప్రణాళిక చేసుకోవడం ద్వారా అనవసరపు ఖర్చులను, వాతావరణ నష్టాలను అధిగమిం చవచ్చు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రకృతి వైపరీత్యాల తీవ్రత వల్ల పంట నష్టం సంభవిస్తే రైతులు ఆర్థికంగా చితికి పోకుండా ఉండేందుకు 'వ్యవసాయ బీమా పథకాలు' ఒక అద్భుతమైన రక్షణ కవచంలా పనిచేస్తాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి ప్రభుత్వ పంట బీమా పథకాలలో అర్హులైన రైతులందరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. వ్యక్తిగత సాగు వ్యయాలను తగ్గించుకోవడానికి, చిన్న, సన్నకారు రైతులు గ్రూపులుగా ఏర్పడి 'రైతు ఉత్పత్తిదారుల సంఘాలు' లేదా సహకార సంఘాల ద్వారా ఉమ్మడిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం మరియు యంత్రాలను అద్దెకు తీసుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చు. దళారీల వ్యవస్థను దాటి ఉమ్మడి మార్కెటింగ్ సదుపాయాల ద్వారా తమ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను సాధించుకోవచ్చు.

ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను మరియు పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంతకంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాల సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పన తోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయ కేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచగలదనడంలో ఎటువంటి సందేహం లేదు.

**- రామ కిష్టయ్యా సంగన భట్ల**
9440595494

# యూరియా యాప్ - నిరక్షరాస్య రైతుల గోస



వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెడుతున్నాయి. ఈ క్రమంలో ఎరువుల పంపిణీలో పారదర్శకత తీసుకురావడం, అక్రమ నిల్వలు మరియు బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడం లక్ష్యంగా యూరియా విక్రయాలను డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నారు. యాప్ ఆధారిత వ్యవస్థ ద్వారా రైతుల వివరాలను నమోదు చేసి యూరియా విక్రయాలు చేపడుతున్నారు. అయితే ఈ విధానం లక్ష్యం మంచిదైనా, నిరక్షరాస్య రైతులకు మాత్రం అనేక ఇబ్బందులను తెచ్చిపెడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.




గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక మంది రైతులు చదువుకోలేదు. కొందరు సంతకం చేయలేని పరిస్థితిలో కూడా ఉన్నారు. అలాంటి రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం, యాప్ నిర్వహణ, డిజిటల్ లావాదేవీలు వంటి అంశాలు కొత్తగా, క్లిష్టంగా అనిపిస్తున్నాయి. యూరియా కొనుగోలు సమయంలో ఆధార్ నంబర్ నమోదు చేయడం, మొబైల్ నంబర్ ధృవీకరణ, యాప్లో వివరాలు నమోదు చేయడం వంటి ప్రక్రియలు వారికి పెద్ద సవాలుగా మారుతున్నాయి.

ప్రస్తుతం చాలా గ్రామాలలో రైతులు యూరియా కొనుగోలు కోసం ఎరువుల దుకాణాలకు వెళ్లినప్పుడు యాప్‌లో నమోదు తప్పనిసరి అవుతోంది. యాప్ సక్రమంగా పనిచేయకపోతే లేదా ఇంటర్నెట్ సమస్యలు ఎదురైతే రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వ్యవసాయ పనులు సీజన్‌కు అనుగుణంగా సమయానికి జరగాలి. విత్తనాలు వేసిన తర్వాత లేదా పంట ఎదుగుదల దశలో యూరియా అవసరమైన సమయంలో అందుబాటులో లేకపోతే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో యాప్ సాంకేతిక సమస్యలు రైతులకు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

నిరక్షరాస్య రైతులలో చాలామందికి స్మార్ట్‌ఫోన్‌లు కూడా లేవు. ఉన్నవారిలో చాలామంది కేవలం ఫోన్ కాల్స్ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఓపెన్ చేయడం, అవసరమైన వివరాలు నమోదు చేయడం వంటి పనులు వారికి తెలియవు. దీంతో వారు ఇతరుల సహాయం కోరాల్సి వస్తోంది. కొన్నిసార్లు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల రైతుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం కూడా ఉంది. వృద్ధ రైతుల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. జీవితాంతం సంప్రదాయ వ్యవసాయం చేసిన వారు ఒక్కసారిగా డిజిటల్ వ్యవస్థలకు అలవాటు పడలేరు. వయస్సు కారణంగా కొత్త సాంకేతికతను నేర్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రభుత్వం రైతులకు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన యాప్, వృద్ధ మరియు నిరక్షరాస్య రైతులకు భారంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయితే యూరియా యాప్‌నకు కొన్ని సానుకూల అంశాలు కూడా ఉన్నాయి. ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుంది. నిజమైన రైతులకు యూరియా అందే అవకాశం ఉంటుంది. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలను కొంతవరకు నియంత్రించవచ్చు. రైతుల కొనుగోలు వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కావడం వల్ల భవిష్యత్తులో పథకాల అమలుకు కూడా ఉపయోగపడుతుంది. కానీ ఈ ప్రయోజనాలు రైతులందరికీ చేరాలంటే వ్యవస్థ మరింత సులభంగా ఉండాలి. ప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టడమే కాకుండా రైతులకు అవసరమైన శిక్షణ కూడా అందించాలి. గ్రామ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యాప్ వినియోగంపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు వేదికలు, వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా రైతులకు ప్రాయోగిక శిక్షణ కల్పించాలి. ప్రతి గ్రామంలో డిజిటల్ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఉచిత సహాయం అందించాలి.

అలాగే యాప్తో పాటు ప్రత్యామ్నాయ విధానాన్ని కూడా కొనసాగించడం అవసరం. సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు రైతులు ఇబ్బంది పడకుండా ఆఫ్లైన్ విధానంలో కూడా యూరియా కొనుగోలు చేసే అవకాశం కల్పించాలి. ముఖ్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి. రైతు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాల ఆధారంగా ఎరువులు పొందే వెసులుబాటు ఉండాలి.

డిజిటల్ ఇండియా లక్ష్యాల సాధనలో భాగంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రోత్సహించడం అవసరమే. కానీ సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు సౌలభ్యం కల్పించాలి గానీ ఇబ్బందులకు కారణం కాకూడదు. గ్రామీణ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని విధానాలను రూపొందించాలి. ముఖ్యంగా నిరక్షరాస్య రైతుల సమస్యలను అర్థం చేసుకుని వారికి అనుకూలంగా వ్యవస్థను సరళీకృతం చేయాలి. వేసవికాలంలో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాలు పర్యటించి గ్రామంలో ఉన్న రైతలందరిని కలిసి వారికి ఎంత వ్యవసాయ భూమిఉంది, వారికి ఎంత యూరియా అవసరమంటుంది, ఏ పంటలు వేయ తలుచుకున్నారు లాంటి వివరాలన్నీ సేకరించి దళారి వ్యవస్థకు స్వస్తి పలికి ఆయా గ్రామాలకు కావలసిన నాణ్యమైన విత్తనాలను యూరియాను, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఎరువులదుకాణ యజమానుల ద్వారా నేరుగా రైతు ఇంటి దగ్గర అందించేలా ప్రణాళిక ఏర్పాటు చేస్తే ఎలాంటి గందరగోళం ఉండదు. యాప్ కంటే కూడా ఇది మేలైన మార్గం అవుతుంది.

**- బూర్గుపల్లి కృష్ణ యాదవ్**
9866170384

# నేలల్ని ఎడారులుగా మార్చుతున్నామా !



నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించ బడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపీ ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించిపోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది.



భూ క్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోతపడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది. నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 17 జూన్ రోజున ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినోత్సవం పాటించాలని 1994లో ఐరాస తీర్మానించడం, 1995 నుంచి పాటించడం జరుగుతున్నది. 2026 ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం ఇతివృత్తంగా రేంజ్‌ల్యాండ్స్‌ను గుర్తించండి. గౌరవించండి. పునరుద్ధరించండి అనబడే అంశాన్ని తీసుకొని కొలంబియాలో సమావేశం నిర్వహిస్తున్నారు.

ప్రకృతికి పునాది సారవంతమైన నేల. ఇలాంటి ఆరోగ్యకర భూములను మానవ, ప్రకృతి ప్రమేయాలతో నిస్సారం, నిర్వీర్యం చేయ డం జరుగుతోంది. ఇలాంటి నేల క్షీణత మరి కొంత కాలం కొనసాగితే శాశ్వతంగా పనికి రాని ఎడారులుగా మారి పోతాయని గమనించాలి. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి.

ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో హరిత విప్లవం రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలిమన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. అవగాహన లేమి, అశాస్త్రీయ సాగు పద్ధతులతో సారవంతమైన నేలలు నిస్సారమై ఎడారి భూములుగా మారడాన్ని నేల ఎడారీకరణ అంటారు. ఎడారీరకణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది.

అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రక మైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి.

నేల ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలిమన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది.

వ్యవసాయ నేలలకు సారం అందించని యెడల క్రమంగా శుష్క భూములుగా మారుతూ దిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్ధతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి. మానవ కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలను అందించడానికి సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. నేల సారాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, మట్టి మర్యాదను గౌరవిస్తూ, మట్టిలోంచి మాణిక్యాలను పండిద్దాం.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

– ఎడిటర్

# దిశా సమావేశంలో కేంద్ర పథకాలపై సమీక్ష



**వరంగల్, జూన్ 18(మనంన్యూస్):** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగంపై వరంగల్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్లో గురువారం కలెక్టర్ డా. సత్య శారద అధ్యక్షతన జరిగిన సమావేశానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కె.ఆర్. నాగరాజు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ గారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో లోతట్టు కాలనీలను ముంపు కు గురికాకుండా చూడాలని వారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన సమీక్ష ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు దిశ నిర్దేశం చేయాలని చూసి ఉంచారు.ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ గారు మాట్లాడుతూ వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంట మార్పిడి పంటలు వేసేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వారు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ నేల సారాన్ని కాపాడేందుకు రైతులు సహజ సేంద్రియ పద్ధతిలో వైపుకు ప్రోత్సహించాలని వారన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి పాఠశాలల్లో పరిశుభ్రత తో పాటు మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా వర్కర్స్ ను ఏర్పాటు చేసి కార్పొరేట్లేవల్లో విద్య అందించేందుకు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. వరంగల్ అభివృద్ధికి నిధుల కేటాయింపులలో సంబంధిత శాఖల అధికారులు డిపిఆర్ తయారు చేసే క్రమం త్వరగా చేసి నివేదికలు సమర్పించినట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల కేటాయింపులో మా వంతు వరంగల్ ను అభివృద్ధి లోకి తీసుకురావడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు అన్నారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ ఎంజీఎంలో నాణ్యమైన వైద్యం అందించినందుకు కృషి చేయాలని డాక్టర్స్ ప్రైవేటుకు ప్రాధాన్యతిస్తూ ఎంజీఎం ను పట్టించుకోవడంలేదని ఇట్టి విషయంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్ని పరీక్షలు ఎంజీఎం లోనే నిర్వహించేలా వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమైన అంత యూరియా మాత్రమే సరఫరా చేయాలని అధిక రసాయనాల వినియోగం వల్ల పంటల్లో రసాయన అవశేషాలు పేరుకుపోయి ప్రజల ఆరోగ్యంపై దుష్పరిణామాలను సూచిస్తాయాన్ని రైతులకు రసాయనాల వాడుకలో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా వారి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నర్సంపేట మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మి, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ శ్రీ పాలకుర్తి సారంగపాణి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరయ్యారు. వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు గారు మాట్లాడుతూ విద్యా వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉండేలా డాక్టర్లకు ఉదయం సాయంత్రం ఫేస్ రికగ్నైసేడ్ ఆప్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాజ కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ ఈ దిశ మీటింగ్ ప్రజా ప్రతినిధులు సూచించిన అంశాల ను పరిగణలోకి తీసుకుని పూర్తి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి డిఆర్డిఓ నాగ పద్మజ, వరంగల్,నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సమిష్టి కృషితోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం




● జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల జూన్ 18(మనం ప్రతినిధి):** మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును, సమాజ శ్రేయస్సును తీవ్రంగా దెబ్బతీస్తున్న నేపథ్యంలో వాటి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న యాంటీ డ్రగ్స్ 3కే రన్ పోస్టర్ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్క శాఖ లేదా సంస్థ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని అన్ని వర్గాల సమిష్టి కృషితోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని, ఈ దిశగా ఐఎంఏ జగిత్యాల చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో యాంటీ డ్రగ్స్ 3కే రన్లో పాల్గొని మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.లీవ్ స్ట్రాంగ్ - స్టే ఫ్రీ- సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో నిర్వహించనున్న ఈ యాంటీ డ్రగ్స్ 3కే రన్ యువతలో ఆరోగ్యకర జీవనశైలిపై చైతన్యం కల్పించడంతో పాటు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన పెంపొందించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డా. గుడూరి హేమంత్, కార్యదర్శి డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డా. కోటగిరి సుధీర్ కుమార్, డా. గడ్డం వేణుగోపాల్ రెడ్డి, చింతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వృద్ధురాలిని గుర్తించిన ఎస్ఐ



● కుటుంబ సభ్యులకు అప్పగింత

**దుగ్గొండి, జూన్ 18 మనం న్యూస్:** దుగ్గొండి మండలంలోని గుడ్లెలుగులపల్లి గ్రామానికి చెందిన మత్తె ఐలమ్మ అనే వృద్ధ మహిళ జూన్ 16వ తేదీ మంగళవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ లో ఉన్నట్లు గుర్తించిన ఎస్ఐ వృద్ధ మహిళ మత్తె ఐలమ్మను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

## ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

● తెలంగాణ ఉద్యమ కేసులో కోర్టుకు హాజరైన జోరిక రమేష్



**హనుమకొండ, జూన్ 18(మనంన్యూస్):** తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన కేసులో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా 3వ ఎంఎం కోర్టులో తెలంగాణ ఉద్యమ నేతలు హాజరయ్యారు. 2014 జూన్ 1వ తేదీన హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో సుబేదారి పోలీస్ స్టేషన్లో సీసీ నెం. 3814/2022 కేసు నమోదైంది. ఈ కేసులో ట్రయల్ రన్లో భాగంగా గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏ 1 జోరిక రమేష్, ఏ 2 బోడ డిన్న, ఏ 3 చాగంటి రమేష్లు న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను 2026 జులై 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. ఉద్యమకారుల పక్షాన లీగల్ సెల్ న్యాయవాదులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాళ్ళపల్లి జనార్దన్ గౌడ్, గుర్రాల వినోద్, చందు తదితరులు వకాల్తా పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోరిక రమేష్ మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులపై ఉన్న 99 శాతానికి పైగా కేసులను ఎత్తివేశారని గుర్తుచేశారు. కేవలం కొన్ని కేసులు మాత్రమే సాంకేతిక కారణాలతో పెండింగ్లో ఉన్నాయన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమ కేసులు ఎత్తివేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు పెండింగ్లో ఉన్న అన్ని కేసులను తక్షణమే ఎత్తివేయాలని జోరిక రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల, జూన్ - 18(మనం ప్రతినిధి ):** పానీ పూరి తిని అస్వస్థతకు గురైన పిల్లలు, పెద్దలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పానీపూరి తిని దాదాపు 30 మంది పిల్లలు, తొమ్మిది మంది పెద్దలు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు ఈ సందర్భంగా వారిని గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరామర్శించారు వారందరినీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా వివరాలు సేకరించారు. వీరిలో 8 మంది డిశ్చార్జ్ అయ్యారని వైద్యులు తెలిపారు. మిగతా వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. స్థానికంగా చికిత్స పొందుతున్న అందరి ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారని ఎప్పటికప్పుడు వివరాలు చేరవేస్తున్నారు వెల్లడించారు. ప్రజారోగ్య సంరక్షణకు ప్రజా ప్రభుత్వం అధిష్టామైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు శాఖల ఆధ్వర్యంలో అన్ని ఆహారపదార్థాలు విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తామని వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలందరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పానీపూరి విక్రయించి పలువురు అస్వస్థతకు కారణమైన నిర్వాహకుడీ పై ఇప్పటికి కేసు నమోదు చేశామని ఆయనపై చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పిల్లలందరూ త్వరగా కోలుకుంటున్నారని త్వరలోనే పాఠశాలలకు తిరిగి వెళ్తారని పేర్కొన్నారు. ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సిబ్బందిని ప్రభుత్వ విప్ అభినందించారు. జిల్లాలో గత రబీ సీజన్ కంటే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అనుకూల పరిస్థితులతో జిల్లాలో దాన్యం దిగుబడి గతంలో కంటే చాలా పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## భారీ వర్షాలు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**సూర్యాపేట, జూన్ 18 (మనం ప్రతినిధి):** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. విపత్తు నిర్వహణ, సహాయక చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి శాఖ తమ బాధ్యతలను గుర్తించి, ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గత అనుభవాలు, జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ముందస్తు ప్రణాళికతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాల పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించలని, అదే విధంగా మండల స్థాయిలో రెవెన్యూ విభాగం తరపున తహశీల్దార్లు, డీపీఓలు, ఇతర అధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే కాలనీలను, ఎక్కువ ఇళ్లు దెబ్బతినే అవకాశం ఉన్న ఏరియాలను ముందుగానే ఐడెంటిఫై చేయాలని సూచించారు. వరద బాధితులను తరలించేందుకు వీలుగా ప్రతి గ్రామంలోనూ ఎత్తైన ప్రాంతంలో ఉన్న కమ్యూనిటీ హాళ్లు, రీహ్యాబిలిటేషన్ సెంటర్లు, రైతు వేదికలను గుర్తించాలని, అక్కడికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం, ప్రాథమిక వసతులు, నీరు, విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవకుండా డీవాటరింగ్ పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, సహాయక చర్యల కోసం పోలీసు శాఖ సమన్వయం తీసుకోవాలని, విపత్తుల సమయంలో అగ్నిమాపక శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని వారితో పాటు ఎస్డిఆర్ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటాయని వివరించారు. రెస్క్యూ ఆపరేషన్లకు అవసరమైన రోప్స్, కట్టర్స్, లైఫ్ జాకెట్లు వంటి సామగ్రిని అందుబాటులో ఉంచాలని, అవసరమైతే తక్షణమే ప్రొక్యూర్మెంట్ చేసుకోవాలని ఫైర్ డిపార్ట్ మెంట్ను కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాలు వరుసగా కురిసినప్పుడు పాత, శిథిలావస్థకు చేరిన ఇళ్లు, గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని, గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు అలాంటి భవనాలను గుర్తించి, అత్యవసర సమయాల్లో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. చెరువులకు గండ్లు పడే అవకాశం ఉన్నందున వాటి కిందున్న ముంపు గ్రామాలను ముందే గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయాల్లో అధికారులందరూ ఒకరికొకరు అందుబాటులో ఉండేలా కమ్యూనికేషన్ బుక్లెట్ రూపొందించాలని అన్నారు. విపత్తు నిర్వహణలో భాగంగా అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో ముందస్తుగా మాక్ ఎక్సర్సైజ్ కండక్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసు నిందితుడికి 20 సంవతరాల జైలు శిక్ష, 20,000 జరిమానా

● బాధితురాలికి 10లక్షల నష్ట పరిహారం



**ములుగు,జూన్ 18మనం ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో గురువారం విచారణలో న్యాయస్థానం అత్యంత కీలక తీర్పును ప్రకటించారు. 2023లో కమలాపురం గ్రామానికి చెందిన కన్నెబోయిన సమ్మయ్య పై మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 35/2023 కేసులో నిందితుడు పోక్సో కేసులో దోషిగా తేలగా న్యాయమూర్తి ఎస్విపి సూర్య చంద్రకళ నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 20,000 జరిమానా విధిస్తూ యూ/ఎస్ 235(2) సీఆర్పీసి ప్రకారం తీర్పు ప్రకటించారు. కేసు విచారణలో దర్యాప్తు అధికారిగాఉన్న దర్యాప్తు అధికారి సిరిశెట్టి సంకీర్త్, కోర్ట్ మానిటరింగ్ ఆఫీసర్ డిఎస్పి కిషోర్ కుమార్, కోర్ట్ లైసనింగ్ అధికారి ఎస్ఐ నాగరాజు, కోర్ట్ సిడిఓ మౌనిక లను ఎస్పి అభినందించారు. మైనర్ పిల్లలపై నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని భాధితులకు న్యాయం కల్పించడానికి పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ ఉంటుందని ఇలాంటి నేరాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు



**గజ్వేల్, జూన్ 18(మనంన్యూస్):** గజ్వేల్ మండలంలోని బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ నర్సింలు కుమార్తె రాజేశ్వరి మృతి చెందిది. ఈ విషయం తెలుసుకొన్నా గజ్వేల్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రిపోర్టర్ నర్సింలు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. అనంతరం నర్సింలు కుటుంబ సభ్యులను ధైర్యంగా ఉండాలని చెప్పి మనోధైర్యాన్ని కల్పించారు. యువత ఆవేశపూరితమైన నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోత విధించవద్దు అన్నారు. వారి వెంట గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, గ్రామ సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ బాపురెడ్డి తదితరులు ఉన్నారు

## వన మహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలి



● జిల్లా కలెక్టర్, సీపీ

**సిద్దిపేట జూన్ 18; మనం ప్రతినిధి:** మొక్కలు నాటే కార్యక్రమం మానవాళి భవిష్యత్తు ప్రధానమైనదని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి వ్యక్తి తన వంతు కర్తవ్యం నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కే హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రశ్మి పెరుమాళ్ పేర్కొన్నారు. కొండపాక మండలం మర్పడగ తేజో వనం అర్బన్ పార్కులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. చెట్లు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తాయని మొక్కలు నాటి వనాలను సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం 20 లక్షల మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని అటవీశాఖ, ఇతర శాఖ సమన్వయంతో సిద్ధంగా నర్సరీలలో ఉన్న మొక్కలను నాటి సంరక్షించే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి పద్మజారాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ ప్రారంభమైన ప్రజలకు తప్పని ఇబ్బందులు

● రోడ్డుపైనే పార్కు చేస్తున్న బస్సులు

● డిపో మేనేజర్ నిర్లక్ష్యానికి నిదర్శనం

● ఇక్కట్ల పాలవుతున్న జనాలు దుకాణదారులు



**గజ్వేల్, జూన్ 18 మనం న్యూస్:** గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్ ప్రారంభమై అప్పటికి కూడా బస్సులు రోడ్డుపైనే ఆపడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దీనితో ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరికి ఆక్సిడెంట్ అవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎండాకాలం కావడంతో బస్టాండ్ లో నిలబడడానికి నీడ లేడనే ఉద్దేశంతో అధికారులు బస్టాండును పూర్తి చేసి ప్రయాణికులకు అనుకూలంగా ఉండే విధంగా చేసినప్పటికీ కూడా స్థానిక డిపో మేనేజర్ దీనిని నివారించడంలో పూర్తిగా విఫలమైనట్లు ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి. బస్టాండ్ లోపటికి వెళ్లాల్సిన బస్సులు రోడ్డుపైనే ఆపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారని చాలామంది ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపైనే బస్సులు ఆపడంతో ప్రయాణికులకు కూర్చోవడానికి స్థలం లేక ఎండలో ఎంతో ఇబ్బందికరంగా మారడంతో చాలా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ లోపలికి బస్సులు వెళ్లకుండా లోపలే పార్కు చేయడంతో బస్టాండ్ ఖాళీగా ఉండడం బయట బస్సులన్నీ అడ్డదిడ్డంగా ఉండడంతో వేరే వాహనదారులు రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారింది. బస్సులను సక్రమంగా బస్టాండ్ లోకి వెళ్ళే విధంగా చేసే ప్రయత్నం ఏది కూడా చేయకపోవడం చాలా బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపో మేనేజర్ సైతం ఈ విషయాన్ని చూసి కూడా చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. బస్టాండ్ లోకి బస్సులు వెళ్లే విధంగా డిపో మేనేజర్ చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది ఆ స్థలంలో ఒక అధికారి నియమించి బస్సులన్నీ బస్టాండ్ లోపటికి వెళ్లి బయటకు వచ్చేలా చూడవలసిన బాధ్యత స్థానిక డిపో మేనేజర్ పైన ఉన్నది కానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇందిరాపార్క్ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు ప్రతిరోజు రద్దీగా ఉండడం కనిపిస్తుంది ఈ రద్దీని తగ్గించాలని ఉద్దేశంతోనే బస్టాండును ఏర్పాటు చేయగా డిపో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

### ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం

బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్కు ప్రతిరోజు తీవ్ర అంతరాయం గా మారింది. బస్సులన్నీ రోడ్డుకు ఇరువైపులా పార్కు చేయడంతో వాహనదారుల రాకపోకులకు పాదచారులకు కూడా చాలా ఇబ్బందికరంగా మారింది రోడ్డు దాటుతుంటే ఏమవుతుందో అన్న భయంతోనే పాదచారులు ఆందోళనకు గురవుతున్నారు. డిపో మేనేజర్ చర్యతీసుకుని బస్సులను బస్టాండ్ లోనే ఆపించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని అలాగే ట్రాఫిక్ సిబ్బంది కూడా ఉదయం పూట సాయంత్రం పూట అక్కడ ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆశ భావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## షిప్టింగ్, డీటీసీపీ లేఔట్ పర్మిషన్ లేకుండానే కొనసాగిస్తున్న రిపల్స్ విద్యాసంస్థ



**బిచ్కుంద, జూన్ 18 ( మనం న్యూస్):** షిఫ్టింగ్, డీటీసీపీ లేఔట్ పర్మిషన్ లేకుండానే కొనసాగిస్తున్న రిపల్స్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని బిచ్కుంద మున్సిపల్ కమిషనర్ కి విద్యార్థి సంఘాలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఎన్. బాలరాజ్ మాట్లాడుతూ., గత కొన్ని సంవత్సరాల నుండి బిచ్కుంద మండల కేంద్రంలో రిపల్స్ విద్యాసంస్థ నిర్వహణ కొనసాగుతుందని, ఈ విద్య సంస్థ గతంలో బిచ్కుంద టౌన్ లో ఒక అద్దె బిల్డింగ్ లో నిర్వహించడం జరిగిందని, ఆ తరువాత కందర్పల్లి గ్రామ పంచాయి పరిధిలోని ఒక పంట పొలంలో రేకులతో రూమ్ లు నిర్మాణం చేపట్టి అక్కడ విద్యాసంస్థను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కానీ అక్కడ ఉన్న విద్యాసంస్థ యొక్క ల్యాండ్ మొత్తానికి డీటీసీపీ మరియు లేఔట్ మరియు సిప్టింగ్ పరిమిషన్ లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీనవలను భవిష్యత్ లో విద్యాసంస్థకు ఏదైనా సమస్య వస్తే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉంటుందని అన్నారు. ఏ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని ఈ సంస్థ యాజమాన్యంతో మాట్లాడి ఆ స్థలాన్ని లీగలైజడ్ చేయాలని, లేదంటే ఆ విద్యాసంస్థను మూసివేయాలని ఈ సందర్భంగా కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీయస్యఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్. బాల్ రాజ్, టీవీస్పీ జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్, యంఎస్యఫ్ జిల్లా అధ్యక్షులు మెక్కా సాయిలు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో జగిత్యాల ప్రజలు సుభిక్షంగా ఉండాలి



● చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్

**జగిత్యాల జూన్ 18(మనం న్యూస్):** జగిత్యాల పట్టణంలోని 33వ వార్డులో నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవములో భాగముగా బోనం ఎత్తుకున్నారు. తదుపరి పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ప్రార్థించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. పెద్దమ్మ తల్లి కటాక్షంతో పట్టణం అభివృద్ధి చెందుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పంబాల సుజాత రాము, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంతోషమే మనందరి సంతోషం



రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా యూరియా సరఫరా చేయాలి
ఇన్ఫో బజార్ క్రిమిసంహారక మందుల దుకాణంలో యూరియా పంపిణీ ప్రక్రియ పరిశీలన
యూరియా బుకింగ్ యాప్ అమలుపై కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆకస్మిక తనిఖీ

**ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 18 (మనం బ్యూరో):** రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ జిల్లాలో గురువారం నుంచి అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో, ఆ యాప్ అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్కర్నూల్ మున్సిపల్ పరిధిలోని దేశిటిక్యాల కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న ఇన్ఫో బజార్ క్రిమిసంహారక మందుల దుకాణాన్ని సందర్శించి యూరియా నిల్వలు, పంపిణీ విధానం, యాప్ వినియోగం, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా ఆరా తీశారు. దుకాణానికి చేరుకున్న కలెక్టర్ ముందుగా క్రిమిసంహారక మందుల దుకాణానికి సంబంధించిన లైసెన్సులను పరిశీలించారు. లైసెన్సులు చెల్లుబాటులో ఉన్నాయా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తున్నారా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న స్టాక్, రైతులకు పంపిణీ చేసిన పరిమాణం, భవిష్యత్తు అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయా అనే విషయాలపై నిర్వాహకులను ప్రశ్నించారు. యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు చేసుకున్న బుకింగ్ల ఆధారంగా పంపిణీ ఎలా జరుగుతోందో ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కలెక్టర్ ప్రత్యేక ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా చందుబట్ల గ్రామానికి చెందిన రైతు బిల్లాకంటి రామకృష్ణారావు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని యూరియా తీసుకెళ్లేందుకు దుకాణానికి వచ్చారు. నాలుగు ఎకరాల 26 గుంటల వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న పంటలకు అవసరమైన యూరియాను పొందేందుకు వచ్చిన రైతుకు దుకాణం సిబ్బంది ఎలాంటి విధానంలో యూరియాను అందజేస్తున్నారో కలెక్టర్ స్వయంగా గమనించారు. రైతుతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ యాప్ వినియోగ అనుభవాన్ని తెలుసుకున్నారు. యాప్లో నమోదు చేసుకోవడం, యూరియా బుకింగ్ చేయడం, టోకెన్ పొందడం, దుకాణం వద్ద ఎరువు స్వీకరించడం వంటి ప్రక్రియల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయా, సిబ్బంది సహకారం ఎలా ఉంది, యూరియా అందుకోవడంలో ఆలస్యం జరిగిందా వంటి అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు పొందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా యాప్లో నమోదైన డిజిటల్ స్టాక్ వివరాలు, దుకాణంలో వాస్తవంగా ఉన్న నిల్వల మధ్య సరిపోలికను కూడా కలెక్టర్ పరిశీలించారు. రైతులకు పంపిణీ చేసిన యూరియా బస్తాలను మినహాయించిన తర్వాత మిగిలిన నిల్వలు ఆన్లైన్ పోర్టల్లో సరిగ్గా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తనిఖీ చేశారు. స్టాక్ వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. ప్రతి పంపిణీని వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని దుకాణ నిర్వాహకులకు ఆదేశించారు.


రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని యూరియా బుకింగ్ యాప్ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా రైతులు తమ అవసరానికి అనుగుణంగా ముందుగానే యూరియాను బుక్ చేసుకుని సమయానికి పొందే అవకాశం కలుగుతుందని సూచించారు.

యాప్ అమలుతో యూరియా పంపిణీలో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిల్వలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ సాధ్యమవుతుందని, రైతులు దుకాణాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. రైతులకు స్నేహపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు.

జిల్లా యంత్రాంగం యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తుందన్నారు. ఎక్కడైనా రైతులకు ఇబ్బందులు తలెత్తినట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా జరిగేలా అధికారులు, ఎరువుల విక్రయదారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, నాగర్ కర్నూల్ డివిజన్ వ్యవసాయ అధికారి పూర్ణచంద్రారెడ్డి, ఏవో శివ ఇతర అధికారులతో పాటు తదితరులు ఉన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి





**మేడ్చల్, జూన్ 18(మనంప్రతినిధి):** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరిపల్లి లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీని కరీంనగర్ నుండి హైదరాబాద్ వైపు వస్తున్న కారు డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది.. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి... మృతుడు చంద్రశేఖర్ కుటుంబం కరీంనగర్ జిల్లాలోని కొండగట్టు దర్శనం చేసుకొని వస్తుండగా అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అప్పటివరకు సరదాగా గడిపిన ఈ కుటుంబం హైదరాబాద్ కు వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురారి పల్లి వద్ద కారు డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం మొత్తం నుజ్జునుజ్జు కాగా కారు నడుపుతున్న చంద్రశేఖర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య రేఖ, చిన్న కుమారుడు నిహాల్ కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వీరిద్దరు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పెద్ద కొడుకు లోహిత్ గాయాలతో బతికి బయటపడ్డాడు. గోదావరిఖని నుండి హైదరాబాద్ కు వస్తున్నది ఈ కుటుంబం. మధ్యలో కొండగట్టుకు వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకొని హైదరాబాద్ కు బయలుదేరారు . బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు.

## ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదలకు చొరవ చూపాలి



- ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన నిరుద్యోగ అభ్యర్థులు

**నిజామాబాద్ రూరల్, జూన్ 18 (మనం న్యూస్):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పలువురు నిరుద్యోగ యువకులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి తమ సమస్యలను వివరించారు. ప్రస్తుతం ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడకపోవడంతో వేలాది మంది నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో సుమారు 20 వేల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రూప్స్, డీఎస్సీతో పాటు ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి దశలవారీగా నోటిఫికేషన్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి మాట్లాడుతూ., కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నియామక పత్రాలు అందజేయడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో నిరుద్యోగ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్లు మంజూరైనా పంపిణీలో జాప్యం



**కామారెడ్డి, జూన్ 18 (మనం న్యూస్)** కామారెడ్డి నియోజకవర్గం లోని పాల్వంచ మండలంలోని పలు గ్రామాల్లో వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిఆర్ఎస్ పార్టీ పాల్వంచ మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మి ఆరోపించారు. గురువారం మంథని దేవునిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీని సందర్శించిన ఆమె స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ., వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో మంజూరైన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులకు అందజేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రామంలో సరైన రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీ వాసులు తమ సమస్యలను వివరించి, ప్రభుత్వం వెంటనే మంజూరైన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను అందజేయాలని, మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

- కొత్త కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- పాలిటెక్నిక్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 18 (మనం బ్యూరో):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తీసుకున్న వివిధ కోర్సులు, వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగారు. వివిధ ల్యాబ్ లను సందర్శించి విద్యార్థులకు అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. అవసరమైన సెమినార్లు నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని అక్కడి అధ్యాపకులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గద్వాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉండగా ఈ సంవత్సరం నూతనంగా సైబర్ ఫిజికల్ సిస్టం సెక్యూరిటీ కోర్స్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పాలిసెట్ కౌన్సిలింగ్ సందర్భంగా ఇప్పటికే వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు కొత్త కోర్సులోకి మారేందుకు అవకాశం ఉందన్నారు. ఇటీవల పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు కూడా ఈ కళాశాలలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా అవకాశం ఉంటుందన్నారు. వడ్డేపల్లి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి కళాశాలలో చేరిన విద్యార్థులు గద్వాలలోని పలు వసతి గృహాల్లో ఉన్నందున వారు కళాశాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా బస్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలోని గద్వాల మండలానికి చెందిన కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కొత్త విద్యార్థుల అడ్మిషన్స్ గురించి అడిగి, నిబంధనల ప్రకారం విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు రోజులవుతున్న విద్యార్థులు పూర్తిస్థాయిలో విద్యాలయానికి రాకపోవడమేమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. మెనూ ప్రకారం భోజనం వండించాలని అక్కడి ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కస్తూర్బా విద్యాలయ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈ పర్యటనలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి జ్యోతి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారిని గోపీలత, తదితరులున్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

రసీదుల్లో ఇష్టానుసారం నిబంధనల ముద్రణపై కలెక్టర్ ఆగ్రహం
ప్రభుత్వం సూచించిన వరి వంగడాలనే విక్రయించాలి
విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 18 (మనం బ్యూరో):** గడువు ముగిసిన, విడిగా ఉండే, నకిలీ విత్తనాలను రైతులకు అంటగడితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, సంబంధిత డీలర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. గురువారం గద్వాలలోని పాత బస్టాండ్ లో పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. వానాకాలం 2026 సీజన్ కు సంబంధించి వ్యవసాయ శాఖ సూచించిన ఎనిమిది రకాల వరి వంగడాలను మాత్రమే రైతులు సాగు చేయాల్సి ఉన్నందున డీలర్లు వాటిని మాత్రమే విక్రయించాలన్నారు. బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, డబ్ల్యు జిఎల్ 962, డబ్ల్యూజిఎల్ 44, జేజిఎల్ 1798, జైశ్రీరామ్, హెచ్ఎంటి (సోనా) రకాలకు మాత్రమే ప్రభుత్వం ఈ ఏడాది బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు నానో యూరియాను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి పెస్టిసైడ్, సీడ్స్ దుకాణాల వద్ద స్టాక్ బోర్డ్ లు తప్పనిసరిగా ఏర్పాటు చేసి అందులో సమగ్ర వివరాలను పొందుపరచాలన్నారు. ఆయా రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దుకాణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుపుకోవాలని డీలర్లకు సూచించారు. పలువురు డీలర్లు రైతులకు ఇచ్చే రసీదుల్లో ఇష్టానుసారం సొంతంగా నిబంధనలను ముద్రించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత డీలర్లకు నోటీసులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని ప్రధాన రహదారుల్లో, ముఖ్యమైన కూడళ్లలో ఇష్టానుసారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే ప్రకటనల బోర్డులను తక్షణమే తొలగించాలన్నారు. ఫ్లెక్సీల కారణంగా ఇబ్బందులు ఉన్నందున వెంటనే తీసివేయించాలని మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ కు సూచించారు. ఈ కార్యక్రమ పర్యటనలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయ అధికారి ప్రతాప్ కుమార్, టెక్నికల్ ఏవోలు చంద్రశేఖర్, భవాని తదితరులున్నారు.

## ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం ముందుకెళ్తుంది

వెల్దండ మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన
మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, బీసీ బాలుర వసతి గృహం పరిశీలన
అభివృద్ధి పనులపై అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు
నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

**ఉమ్మడి మహబూబ్ నగర్, (వెల్దండ) జూన్ 18 (మనం బ్యూరో):** ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. గురువారం కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, వెల్దండ గ్రామాలలో జిల్లా కలెక్టర్ పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను సందర్శించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనుల స్థితిగతులు, ప్రభుత్వ సహాయం అందుతున్న తీరు, ఎదురవుతున్న సమస్యల గురించి కలెక్టర్ ఆరా తీశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిర్మాణాలను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ చేరవేయడం అధికారుల బాధ్యతని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేసి లబ్ధిదారులకు సకాలంలో గృహ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా వెల్దండ గ్రామానికి చెందిన ఉడుత సుమాతమ్మ భర్త ఉడుత జంగయ్య దివ్యాంగుడని, ఆయనకు సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్ జిల్లా కలెక్టర్ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధన మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తదనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరాలు, భద్రతను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.



ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ, వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో చంద్రుడు నాయక్, వెల్దండ సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్, పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల అనూష, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఆరోగ్య భద్రత, పరిశుభ్రత కల్పించాలి





**ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 18 (మనం బ్యూరో):** విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. గురువారం ధరూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించి పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని దగ్గరుండి ఆరా తీశారు. విద్యార్థినులకు పోషకాహారంతో కూడిన, నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అలాగే విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జనరల్ ఆసుపత్రి వైద్య పరికరాల కొనుగోలుకు రూ.2.68 కోట్ల నిధులు

- అవసరాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశంలో కీలక నిర్ణయాలు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 18 (మనం బ్యూరో):** నాగర్కర్నూల్ జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాగర్కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తొలి సమీక్ష సమావేశం గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రి ప్రస్తుత పరిస్థితి, రోగుల రద్దీ, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వివిధ విభాగాల్లో అవసరమైన ఆధునిక పరికరాల ఏర్పాట్లపై కమిటీ కన్వీనర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి పూర్తిస్థాయి వివరాలను కమిటీకి వివరించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.2 కోట్ల 68 లక్షల 79 వేల 383 రూపాయలను మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఆసుపత్రికి అత్యవసరంగా అవసరమైన వైద్య పరికరాలు, నిర్ధారణ యంత్రాలు, రోగుల చికిత్సకు ఉపయోగపడే ఆధునిక ఎక్విప్మెంట్ను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. నిధుల వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా, ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి సూచించారు. ప్రతి విభాగం నుంచి అవసరాల జాబితాను సేకరించి, సాంకేతిక నివేదికలతో కూడిన సమగ్ర ప్రతిపాదనలను అత్యవసరంగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్య సదుపాయాలు జిల్లా కేంద్రంలోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా అత్యవసర వైద్యం, నిర్ధారణ సేవలు, ప్రసూతి వైద్యం, శస్త్రచికిత్సలు, ఐసీయూ సేవల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలన్నారు. వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మందులు, పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి అంబులెన్స్ లేదని కలెక్టర్ దృష్టికి సూపరింటెండెంట్ తీసుకొని రాగా, రెడ్క్రాస్ ఆధ్వర్యంలో ఉన్న అంబులెన్స్ను ఆసుపత్రికి అందజేయాలని వాటి మరమ్మత్తులకు జిల్లా కలెక్టర్ నేరుగా నిధులు అందజేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి ఉషారాణి, జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ దావూద్ సులేమాన్, డాక్టర్లు శంకర్, సుప్రియ, రఘు, హరిత, సాయిబాబు, రాధాకృష్ణ, కవిత, పోతుల శిరీష, కృష్ణ, రామకృష్ణ , అభివృద్ధి కమిటీ సభ్యులు, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ రవి నాయక్, వివిధ విభాగాల వైద్యాధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి పరిపాలనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం



దమ్మపేట, జూన్ 18(మనం న్యూస్): ఈ నెల 30వ తేదీన రైతు భరోసా నిధుల విడుదలకు తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయంమని, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి దమ్మపేట మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రైతు కష్టానికి గుర్తింపు అని, వ్యవసాయానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందని, ప్రతి రైతు కుటుంబానికి భరోసాను మాటల్లో కాదు చేతల్లో ప్రజా ప్రభుత్వం చూపిస్తోందని అన్నారు. రైతు సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని అన్నారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది అనే సంకల్పంతో ముందుకు సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.

# భవిష్యత్‌కు ఏది 'భరోసా'

- రాజయ్య నగర్‌లో లేని ప్రభుత్వం బడి
- నేటి దాకా గ్రామస్తుడే అనదికారికంగా పాఠశాల నిర్వహణ
- విద్యార్థులకు ఆటో ఏర్పాటు చేస్తామంటున్న ఉపాధ్యాయులు
- గ్రామస్తులు ఒప్పిస్తే మెరుగైన విద్య
- బడి ఏర్పాటు చెయ్యాలని ఐటిడిఏకు ఆదివాసీల వినతి



చర్ల, జూన్ 18(మనం న్యూస్): గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఏర్పాటు చేయించి చదువులను తమ దగ్గరకు తీసుకువచ్చే ప్రయత్నం చేసినా ఆదివాసీలకు అది నెరవేరని కలగానే మిగిలింది. ఇతర ప్రాంతాలలోని పాఠశాలలకు తమ పిల్లలను పంపించబోమని, గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలని అంత వరకు తామే సొంతంగా పాఠశాల నిర్వహించుకుంటాలని భీష్మించారు. అయినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో అక్కడి విద్యార్థుల భవిష్యత్ కు భరోసా లేకుండా పోయింది. ప్రస్తుతం గ్రామస్తుల ఆద్వర్యంలో అనధికారికంగా పాఠశాల నిర్వహిస్తుండటంతో వారి చదువులకు విలువలేకుండా పోగా రెండేళ్ల విలువైన విద్యా సంవత్సరాన్ని కోల్పోయారు.

చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ క్రాంతిపురం, రాజయ్యనగర్ లు జంటగ్రామాలు. వీరు రెండు దశాబ్దాల క్రితం ఛత్తీస్గడ్ నుండి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. రెండు గ్రామాలలో కలపి 60 కుటుంబాలు, 3 వందలకు పైగా జనాభా నివసిస్తోంది. రెండు గ్రామాలలో కలిపి 40 కి పైగా బడిఈడు పిల్లలు ఉన్నారు. అయినా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేదు. దీంతో అనేకమంది చదువులను మధ్యలోనే నిలిపివేయగా మరి కొంతమంది చర్లలోని వివిద వసతి గృహాలలో ఉంచి చదువుకుంటున్నారు. ఇందులో 23 మంది 1 నుండి 5 వ తరగతి చదివే వారున్నారు. వీరంతా గతంలో సుబ్బంపేట, సుందరయ్య కాలని గ్రామాలలోని పాఠశాలలో విద్యనభ్యసించేవారు. రెండేళ్ల క్రితం గ్రామ సమీపంలోని ప్రదాన రహదారిపై ఇసుక లారీ ఢీకొనడంతో చర్లలోని ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్దులు మృతిచెందారు. తీవ్ర భయాందోళనకు గురయిన గ్రామస్తులు తమ పిల్లలను చదువులను మాన్పించి గ్రామంలోనే ఒక ఇంటి దగ్గర సొంతంగా పాఠశాలను నిర్వహించడం ప్రారంభించారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని అంత వరకు తామే తమ పిల్లలకు చదువులు చెప్పుకుంటాలని తెగేసి చెప్పారు. ప్రభుత్వం గిరిజనుల మొరను ఆలకించలేదు. భీష్మించుకు కూర్చున్న గిరిజనులు సొంతంగా రేకుల షెడ్డును నిర్మించి తమ సొంత ఖర్చులతో 10 వ తరగతి చదివిన యువతిని ఉపాధ్యాయురాలిగా నియమించుకొని చదువులను చెప్పించడం ప్రారంభించారు. పాఠశాలకు ప్రభుత్వం అనుమతి లేకపోవడంతో ఇక్కడ చదువుతున్న 23 మంది విద్యార్థుల భవిష్యత్ అందకారంగా మారింది. గత రెండేల్లుగా ఇక్కడి విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోతున్నా ఏ అధికారి పట్టించుకున్న పాపానపోలేదు. ఆదివాసీ గ్రామం కావడంతో అక్కడ ఐటిడిఏ అదికారులే పాఠశాలను ఏర్పాటు చేయాలన్న తలంపుతో విద్యాశాఖ వీరి సమస్యను పట్టించుకోలేదు. ఇలా రెండేళ్ల విలువైన కాలాన్ని ఇక్కడి విద్యార్దులు నష్టపోయారు. అయినా ఐటిడిఏ, విద్యాశాఖ అదికారులకు చీమకుట్టినట్లయినా లేదు. ఎట్టకేలకు చర్ల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాద్యాయుడు హరిప్రసాద్, సుబ్బంపేట ప్రాదమికోన్నత పాఠశాల ప్రదానోపాద్యాయురాలు ఝాన్సీ రాణి, సర్పంచ్ కాక సత్యనారాయణ, సిఆర్పి నరేష్ లు గురువారం రాజయ్యనగర్ గ్రామానికి చేరుకొని గ్రామ పెద్ద రేగ ఆంద్రయ్యను కలసి గ్రామానికి చెందిన విద్యార్దులను సుబ్బంపేట పాఠశాలకు పంపించమని అభ్యర్దించారు. విద్యార్దుల విలువైన కాలాన్ని వృదా చేయవద్దని అభ్యర్దించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ముగిసే వరకు గ్రామం నుండి విద్యార్దులను ఆటోల ద్వారా తరలిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో స్పందించిన ఆంద్రయ్య గ్రామంలో ఐటిడిఏ పాఠశాల ఏర్పాటుకు అదికారులు కృషిచేయాలని విజ్ఞప్తి చేసారు. అంతవరకు గ్రామస్తులందరితో చర్చించిన అనంతరం పాఠశాలకు విద్యార్దులను పంపుతామని సానుకూలంగా స్పందించడంతో రెండేల్లుగా సాగుతున్న ఉత్కంఠతకు తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామస్తులు సైతం పట్టుదలకు పోకుండా విద్యార్థులను పాఠశాలకు పంపి వారి బంగారు భవిష్యత్ కు పునాది వేయాలని పలువురు కోరుతున్నారు.

# అదుపులోకి నలుగురు వేటగాళ్లు

## నాటు తుపాకీ, ఆరు తూటాలు స్వాధీనం



దమ్మపేట,జూన్ 18 (మనం న్యూస్): దమ్మపేట మండలం గండుగులపల్లి బీట్ పరిధిలో అనుమానాస్పదంగా వేటకు వచ్చిన నలుగురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బీట్ ఆఫీసర్ భవాని సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నిందితులు చిలకా వెంకటేష్, కేసరి శివాజీ గణేష్, దుంప నితిన్, దార బోయిన నాగేశ్వరరావు పారిపోతుండగా పట్టుకున్నారు. రెండు బైకులు, నాటు తుపాకి, ఆరు తూటాలు, టార్చ్ లైట్, బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురిని అరెస్టు చేసి వైల్ యాక్ట్ కేసు నమోదు చేశారు.

# ఏఎన్ఎంలకు సబ్ సెంటర్ల కేటాయింపు కౌన్సిలింగ్

## డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్

### సీనియారిటీ ఆధారంగానే కేటాయింపు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 (మనంప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జి ఓ ఎంఎస్ నం: 38 ప్రకారం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా, జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించబడిన 54 మంది మహిళ ఆరోగ్య కార్యకర్తలకు (ఎఎన్ఎం) పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి ఆయా ఆరోగ్య ఉప కేంద్రాలు కేటాయించినట్లు జిల్లా వైద్య డి ఎం అండ్ హెచ్ ఓ తుకారామ్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో ఎఎన్ఎంల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండి తల్లి-శిశు ఆరోగ్య సేవలు, గర్భిణీల నమోదు, క్రమానుసార ఎఎన్సి పరీక్షలు, హై రిస్క్ కేసుల గుర్తింపు, సాధారణ ప్రసవాల ప్రోత్సాహం, ప్రసవానంతర సేవలు, నవజాత శిశు సంరక్షణ, పూర్తి స్థాయి టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, కౌమార బాలికల ఆరోగ్య సేవలు, రక్తహీనత నివారణ, సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్, అసంక్రమిత వ్యాధుల (బిపి, మధుమేహం) స్క్రీనింగ్ వంటి సేవలను సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. కౌన్సిలింగ్ ద్వారా సబ్ సెంటర్లు కేటాయించబడిన వారు వారి విధులను సక్రమంగా నిర్వహించాలని విధులలో అలసత్వం, నిర్లక్ష్యం, వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

# ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి



- పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు

ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని, ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్లో జిల్లా అధ్యక్షుడు వంకాయల రాజు అధ్యక్షతన జరిగిన ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య క్రమంగా వ్యాపారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులను భారీగా పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని విమర్శించారు. ఒకే విద్యాసంస్థలో వివిధ పేర్లతో ట్యూషన్ ఫీజులు, బిల్డింగ్ ఫీజులు, అభివృద్ధి నిధులు, ట్రాన్స్పోర్ట్, ఇతర చార్జీల పేరుతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి, జిల్లా స్థాయిలో ఫీజు నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి, విద్యాసంస్థల ఫీజులపై పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల పెంపుపై తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులను నిర్దిష్ట దుకాణాల నుంచి మాత్రమే పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలే పాఠ్యపుస్తకాలు విక్రయించడం, అధిక ధరలకు పుస్తకాలు అమ్మడం జరుగుతోందని పేర్కొన్నారు. ఇటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు అయినప్పటికీ రాష్ట్రంలో విద్యను వస్తువుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాలో విద్యార్థుల సమస్యలపై విస్తృతంగా చర్చించి, పాఠశాలలు, కళాశాలల సందర్శనలు చేపట్టి సమస్యలను గుర్తించి ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు మూసివేయాలని, జిల్లా అధికారులు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలలో తనిఖీలు చేసి దుకాణాలు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దొంతపోయిన వెంకటేష్, రెడ్డి పోగుల. త్రినాథ్, భాను శ్రీకర్,శ్యామ్, లోహిత్ కుమార్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునికీకరణతో మారనున్న రాతిచెరువు రూపురేఖలు



రూ.2.30కోట్లతో అభివృద్ధిపనులు

## అభివృద్ధికి చిరునామాగా పాల్వంచను తీర్చిదిద్దుతాం

కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

### అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

పాల్వంచ, జూన్ 18(మనం న్యూస్): రూ.2.30కోట్ల నిధులతో చేపట్టనున్న రాతిచెరువు ఆధునికరణతో చెరువు రూపురేఖలు మారుతాయని, రాతి చెరువు పరిసరాలు ఎంతగానో ఆహ్లాదంగా మారుతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో రూ.2.30 కోట్లతో చేపట్టనున్న రాతి చెరువు అభివృద్ధి పనులకు, అలాగే రూ.76 లక్షల నిధులతో నిర్మించనున్న రెండు నూతన రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. రూ.2.30 కోట్లతో రాతి చెరువు సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్ల నిర్మాణం, ఇతర ఆధునీకరణ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. అభివృద్ధికి చిరునామాగా పాల్వంచను తీర్చిదిద్దుతామని, నియోజకవర్గంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని వివరించారు. ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా తాము నిరంతర కృషి చేస్తున్నామని, నియోజకవర్గ పరిధిలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరిన్ని నిధులు తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత కాలవ్యవధిలోగా పనులు ముగించేలా చర్యలు తీసుకుంటామని, ఆ మేరకు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భవిష్యత్తులో కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతిపల్లెకు, బస్తీకి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, తహసిల్దార్ దారా ప్రసాద్, ఇంచార్జీ కమిషనర్ విజయానంద్, ఎలక్ట్రికల్ ఏ డీ ఈ అబ్దుల్ రెహమాన్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, గొర్రె అన్నపూర్ణ, కాల్వ భాస్కర్, దున్నపోతుల మణి, దంతబోయిన నరేష్, నాయకులు పద్మజ, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శెనగారపు శ్రీనివాసరావు, ఎస్ ఏ రెహమాన్, వైఎస్ గిరి, గౌస్ పాషా, మస్తాన్, అహ్మద్ జానీ, కరీం, గొర్రె నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లు వివిధ శాఖల డి ఈ లు ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలి

## ఈహెచ్ఎస్‌కు విధి విధానాలు ఎప్పటికి?

- ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య

ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్): ఆర్థిక సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సతమతమవుతున్నారని, సత్వరమే పెన్షనర్లకు ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించాలని, నగదు రహిత వైద్యసేవలకు ఉద్దేశించిన ఈహెచ్ఎస్ విధివిధానాలు సత్వరం ప్రకటించి అమలుచేయా లని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.



గురువారం నాడు కృషిభవన్లో ఎస్జిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశానికి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. తరచూ మారుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా పెన్షనర్లు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఉద్యోగ విరమణ బకాయిలు రాకుండానే పలువురు పెన్షనర్లు తనువు చాలించారని, పెన్షనర్ల బకాయిల నిమిత్తం కోట్లాది రూపాయలు విడుదల చేసామనే హోరెత్తే ప్రచారం బదులు నిధులు విడుదల చేయాలని,వందలాది పెన్షనర్లకు జిపిఎఫ్ లోనే కోట్లాది రూపాయలు బకాయిలు ఉండగానే జిపిఎఫ్ చెల్లింపులు పూర్తి అయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం శోచనీయం అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య విమర్శిచారు. విధివిధానాలు లేకుండా, ట్రస్ట్ కమిటీ ఏర్పాటు కాకుండానే ఉద్యోగులు, పెన్షనర్ల నుండి ప్రీమియం మినహాయించిన ప్రభుత్వం తక్షణంవిదివిధానాలు ప్రకటించాలని, ఏఏ వైద్యశాలల్లో వైద్య చికిత్స ఉందో తెలపాలని, ట్రస్ట్ బోర్డు లో పెన్షనర్ల ప్రతినిధులుగా ఎస్జిపిఏటి తో పాటు సిపిఎస్ ఉద్యోగ సంఘం ప్రతినిధికి ప్రాతినిధ్యం కల్పించాలని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రాయలరవికుమార్, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, హుస్సేన్,నాగప్రసాద్, ఉషారాణి, చీదిరాల వెంకటేశ్వర్లు, భాస్కరరావు, ఆదినారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసిలో మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలి
- సమస్యలు లేకుండా ప్రభుత్వంలో విలీన ప్రక్రియ చేయాలి
- ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలో మహిళా సదస్సు



ఖమ్మం, జూన్ 18(మనం న్యూస్): తెలంగాణ ఆర్టీసీలో రీజనల్ మేనేజర్ స్థాయి అధికారి నుండి కండక్టర్ స్థాయి ఉద్యోగుల వరకు 4,500 మంది పైగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సానుభూతితో వ్యవహరించాలని ప్రభుత్వానికి, యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన ఆర్టీసీ శ్రామిక మహిళా సదస్సు అనేక తీర్మానాలను ఆమోదించింది. గురువారం ఉదయం ఖమ్మం లోని కొండబోలు వెంకయ్య చౌదరి మీటింగ్ హాల్ లో డి.సరిత అధ్యక్షతన ఏర్పాటైన రాష్ట్ర స్థాయి ఆర్టీసీ మహిళా సదస్సు లో ఎస్.రమాదేవి వక్తలను వేదిక మీదికి ఆహ్వానించారు. ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను వ్యతిరేకించే పోరాటంలో మహిళలు ముందు భాగంలో నిలవాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ జె.పద్మావతి సదస్సులో నోట్ ప్రవేశపెట్టారు. మహిళా కండక్టర్లకు ప్రతి బస్టాండ్ లో ప్రత్యేకంగా వాష్ రూమ్ లు ఏర్పాటు చేయాలని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులు వాడకుండా తగు చర్యలు తీసుకోవాలని, మహిళల కు ప్రకృతి సిద్ధమైన అవసరాలకు గాను నెలకు మూడు రోజుల ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని, మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ చార్ట్ ఏర్పాటు చేయాలని, రాత్రి 8 గంటల లోపు డ్యూటీ పూర్తయ్యే విధంగా డ్యూటీలను కేటాయించాలని, రాత్రి 8 గంటల తర్వాత బస్సు ఫెయిల్ అయితే మిగిలిన సర్వీస్ ను రద్దుచేసి మహిళా కండక్టర్ క్యాష్ రెమిట్ చేయుటకై తగు ఆదేశాలు జారీ చేయాలని, తనిఖీ అధికారుల్లో కొందరు ఉద్దేశపూర్వకంగా మహిళా కండక్టర్ పై చార్జిమెమోలు రాసి వేధింపులకు పాల్పడుతున్నారని, అటువంటి వాటిపై తగిన చర్యలు తీసుకొని మహిళా కండక్టర్లకు రక్షణ కల్పించాలని, ప్రతి డిపో, రీజియన్, జోనల్, హెడ్ ఆఫీస్ కేంద్రాలలో 'లైంగిక వేధింపుల నిరోధక కమిటీ' ఏర్పాటు చేయాలని, సర్క్యులర్ లో పేర్కొన్న విధంగా సంస్థేతర మహిళలను కమిటీలో నియమించాలని,లైంగిక వేధింపులపై ఆ కమిటీ ఇచ్చే నివేదికపై తగు చర్యలు తీసుకోవాలని ప్రవేశపెట్టారు. నోట్ పై ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు ప్రసంగిస్తూ, ఆర్టీసీలో ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు కండక్టర్లు గానే విధులు నిర్వహిస్తున్నారని కుటుంబ బాధ్యతలు ఒకవైపు, కండక్టర్ విధి నిర్వహణ మరోవైపు నిర్వహిస్తున్న వారికి వారు ఎదుర్కొనే సమస్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఖమ్మం రీజయన్ లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ గుర్తింపు సంఘం గా మహిళలకు ప్రత్యేక డ్యూటీ చార్టులు వేయించడంలోనూ, ప్రతి డిపోలోనూ మహిళా విశ్రాంతి గదుల ఏర్పాట్లలోనూ, మహిళా సమస్యల పరిష్కారం లోనూ, ప్రత్యేక కృషిచేసి రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి ప్రభుత్వం ఆమోదించినందున ఆంధ్రప్రదేశ్ లో విలీనం సందర్భంగా సమస్యలు వచ్చినట్లుగా తెలంగాణ విలీనంలో రావద్దన్నారు .అందుకనే సమస్యలు లేకుండా విలీనం కోసం, సంపూర్ణ ఉద్యోగ భద్రత కోసం కేటగిరీల వారీగా సదస్సులు నిర్వహించి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల నుండి వస్తున్న అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని వాటిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, యాజమాన్యానికి నివేదిస్తున్నామని తెలిపారు.

ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర, ఖమ్మం రీజియన్ కన్వీనింగ్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ గా జె.పద్మావతి తో పాటు పదిహేను మందితో నూతన రాష్ట్ర సమన్వయ కమిటీ ని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఖమ్మం రీజియన్ ఆర్టీసీ శ్రామిక మహిళ కన్వీనర్ గా డి.సరిత తో పాటు తొమ్మిది మందితో ఖమ్మం రీజియన్ నూతన కన్వీనింగ్ కమిటీ ని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు, పిట్టల సుధాకర్ నాయకులు హెచ్చు బసవయ్య, పగిళ్లపల్లి నరసింహారావు, తోకల బాబు, ఓరుగంటి రాంబాబు, జి.బాబు, సురేష్, మలక్ష్మి, పర్వీనా, సైదమ్మ, నూర్జహాన్, పద్మా, రమాదేవి, సుధారాణి, విజయలక్ష్మి, మల్లికాంబ, ఎం.డి.ఎం బేగం. సీతమ్మ, రమా, లక్ష్మి, భాగ్యలక్ష్మి, జ్యోతి, మంజుల, శిరీష రాణి, మల్లికాంబ, లక్ష్మీ భవాని పాల్గొన్నారు.

# జహీరాబాద్ త్రివేణివనం- ఎకో పార్కును

# వర్చువల్ గా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది




**జహీరాబాద్ జూన్ 18 మనం న్యూస్:** జహీరాబాద్ పట్టణ పరిధిలోని 65వ నెంబరు జాతీయ రహదారి పక్కన గల ముఖీంబాగ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న త్రివేణివనం- ఫారెస్టు ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి గురువారంనాడు హైద్రాబాద్ నుండి వర్చువల్గా ప్రారంభించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్గా ప్రారంభించడం సంతోషకరమని ఆయన చెప్పారు. జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామికరంగాభివృద్ధితోపాటు స్మార్ట్ సిటీగా రూపుదిద్దు కుంటోందని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు రావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో త్రివేణివనం అటవీ ఎకో పార్కును అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. హైదరాబాద్లోని కేబీఆర్ పార్కులో ఉన్న అన్ని సౌకర్యాలు త్రివేణివనంలో కల్పించినునట్లు ఆయన తెలిపారు. టీజీఐఐసీ ఛైర్పర్సన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించ వచ్చని అభిప్రాయపడ్డారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించే అలవాటు చేసుకో వాలని ఆమె కోరారు. జిల్లా కలెక్టరు ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న త్రివేణివనం- ఫారెస్టు ఎకో పార్కు ఎంతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేయబడిందని చెప్పారు. పార్కులో సైక్లింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి పార్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే స్ఫూర్తితో వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్రావు మాట్లాడుతూ త్రివేణివనం జహీరాబాద్ ప్రజలకు గొప్ప వరమని అన్నారు. మనిషి జీవితంలో చెట్లతో విడదీయరాని అనుబంధం ఉందని ఆయన చెప్పారు. చెట్లు ఉంటేనే మానవ మనుగడ సుసంపన్నంగా ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని ఆయన పునరుద్ఘాటించారు.అనంతరం కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన వారంతా అటవీ శాఖ రూపొందించిన వనమహోత్సవ పోస్టరును ఆవిష్కరించారు. పిమ్మట సఫారీ వాహనంలో ఎకో పార్కును సందర్శించి, వివిధ సౌకర్యాలను పరిశీలించదంతో పాటు వారి చేతుల మీదుగా మొక్కలు కూడా నాటడం జరిగింది. అనంతరం జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ ఛైర్మన్ మొహమ్మద్ యూనుస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టరు సిద్దం ఉజ్వల్ రెడ్డి, సీడీసీ ఛైర్మన్ మొహమ్మద్ ముబీన్,మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ అతీఖ్-ఉర్-రహమాన్, మొహమ్మద్ జహాంగీర్ ఖురేషి, మొహమ్మద్ గౌసోద్దిన్ గోరి, మొహమ్మద్ జాకీర్, మొహమ్మద్ నిజాం, నాయకులు మొహమ్మద్ జమీల్, మొహమ్మద్ అక్రం, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టరు, ఆర్డీఓ దేవుజా నాయక్, డిఎస్పీ బానోత్ సైదా నాయక్, తహసీల్దారు పి దశరథ్, అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు ఎస్ శివలింగం, లవకుమార్, రాజేందర్ రెడ్డి, మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యన్న ఇన్ఫ్రా ఎండీ శ్రీధర్ అరెస్ట్..రిమాండ్



**హైదరాబాద్,జూన్ 18(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్లోని మాదాపూర్ కాకతీయ హిల్స్ భూ వివాదం కేసులో అయ్యన్న ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పి. శ్రీధర్ను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధిత భూయజమానుల ఫిర్యాదు మేరకు ఆయనపై చీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు చేసిన పోలీసులు.. విచారణ అనంతరం రిమాండ్కు తరలించారు. వివరాల్లోకి వెళితే..కాకతీయ హిల్స్ ప్రాంతంలో ఏడుగురు భూయజమానులకు చెందిన సుమారు 3,371 గజాల స్థలాన్ని పి. శ్రీధర్ డెవలప్మెంట్ కోసం తీసుకున్నారు. భూయజమానులు, డెవలపర్ మధ్య కుదిరిన ప్రాథమిక ఒప్పందం ప్రకారం.. ఆ స్థలంలో ఎనిమిది అంతస్తుల భవనం నిర్మించేందుకు పరస్పర అంగీకారం జరిగింది. అయితే అనంతరం మరో రెండు అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు పొందేందుకు శ్రీధర్ ప్రయత్నించారు. ఈ క్రమంలో అమెరికాలో నివసిస్తున్న నలుగురు భూయజమానుల సంతకాలను నకిలీగా సృష్టించి, వారి అనుమతి లేకుండానే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నుంచి అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు పొందారు. ఈ విషయం తెలుసుకున్న భూయజమానులు వెంటనే జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో పోలీసులు భవన నిర్మాణంలో అదనపు అనుమతులకు సంబంధించిన అసలు పత్రాలను సమర్పించాలని శ్రీధర్ను కోరారు. అయితే ఆయన సంబంధిత ఒరిజినల్ డాక్యుమెంట్లను అందించకపోవడంతో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కాగా శ్రీధర్ భూ యజమానుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తేలడంతో అతనిపై చీటింగ్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరి రిమాండ్కు తరలించారు.

# అగ్నిమాపక శాఖ ఆకస్మిక తనిఖీలు





**హైదరాబాద్,జూన్ 18(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలోని పలు సంస్థలలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్సింగ్మాన్ ఆదేశాల మేరకు అధికారులు గురువారం ఆకస్మిక తనికీలు చేపట్టారు. ముఖ్యంగా అమీర్పేట్లోని కళాశాలల, వాణిజ్య భవనంలో జిల్లా అగ్నిమాపక అధికారి-2 హైదరాబాద్ తన సిబ్బందితో అగ్ని భద్రతా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ ద్వారా అగ్ని ప్రమాదాల సమయంలో సంసిద్ధతను అంచనా వేయడం, విద్యార్థులు, సిబ్బంది, సందర్శకుల భద్రతను లక్ష్యంగా పెట్టుకున్నారు. అమీర్పేట్లోని ఆదిత్య ఎన్క్లేవ్, అన్నపూర్ణ బ్లాక్-2, నీలగిరి బ్లాక్, శ్రీ చైతన్య కళాశాలలో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ సందర్భంగా అగ్ని భద్రతా ఏర్పాట్లు, అగ్నిమాపక పరికరాల లభ్యత, పనితీరు స్థితి, అత్యవసర ద్వారాలు, ఇతర భద్రతా చర్యలను సమగ్రంగా పరిశీలించారు.కాగా తనిఖీలలో ఆదిత్య ఎన్క్లేవ్ భవనంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాలు పనిచేయని స్థితిలో ఉండటంతో వారిపై తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా అగ్నిమాపక అధికారి-2, హైదరాబాద్ తెలిపారు.భవన యాజమాన్య ప్రతినిధులకు అగ్ని భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ప్రాంగణ భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమైన సరిదిద్దు చర్యలు చేపట్టాలని సూచించారు.

## 'తెలియదు, గుర్తులేదు'

- కస్టడీలో బొల్లా బ్రహ్మనాయుడు సమాధానం

**హైదరాబాద్,జూన్ 18(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** ఫేక్ జీవో కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కస్టడీ గురువారం నాటికి పూర్తయ్యింది. బ్రహ్మనాయుడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించారు. అయితే కస్టడీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఏమాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. ఏ ప్రశ్న అడిగినా 'తెలియదు, గుర్తులేదు' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రూ.1000 కోట్ల భూమిని అక్రమంగా కొట్టేయాలని బ్రహ్మనాయుడు ప్లాన్ చేసినట్టు ఈవోడబ్ల్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. ఖరీదైన భూమిని కొట్టేసేందుకు బ్రహ్మనాయుడు రూ.8 కోట్లు సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపైనే ప్రశ్నలు వేయగా.. మాజీ ఎమ్మెల్యే సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటూ తనకేం తెలియదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు నిందితులు కస్టడీలో వెల్లడించిన వివరాలను ఆధారంగా చేసుకొని బ్రహ్మనాయుడిని అధికారులు ప్రశ్నించారు. 'వారు చెప్పిన సమాధానాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని పోలీసుల ముందు బ్రహ్మనాయుడు బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. మూడురోజుల కస్టడీ ముగియడంతో బొల్లా బ్రహ్మనాయుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తరలించారు.

# రోడ్డు ప్రమాదాల పెరుగుదలలో తెలంగాణ టాప్..

- కేంద్రం నివేదికలో షాకింగ్ నిజాలు
- ప్రధాన రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాదాల పెరుగుదల
- 2024లో 13.5 శాతం పెరిగిన యాక్సిడెంట్లు.. కేంద్ర నివేదిక వెల్లడి

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** దేశ వ్యాప్తంగా ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో చోటు చేసుకున్న రహదారి ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 25,986కి చేరింది. కేవలం ఏడాది కాలంలోనే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం పెరగడం గమనార్హం. ఇది జాతీయ సగటు వృద్ధి రేటు (1.5 శాతం) కంటే చాలా రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. అయితే, ఈ ప్రమాదాల్లో కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య సైతం భారీగానే ఉంది. 2024లో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 7,900 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల వృద్ధి రేటు (3.7 శాతం) దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే అత్యధికంగా నమోదైంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మితిమీరిన వేగాన్ని అధికారులు గుర్తించారు. ఒక్క అతివేగం వల్లే 7,500 కంటే ఎక్కువ ప్రమాదాలు జరగ్గా, సుమారు 2,760 మంది మృత్యువాత పడ్డారు. వీటితో పాటు హిట్ అండ్ రన్ కేసులు, వాహనాలను వెనుక నుంచి లేదా పక్క నుంచి ఢీకొట్టడం వంటి ఘటనల కూడా వేలాది మంది మరణాలకు కారణమవుతున్నాయి.

అయితే, ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరగడంపై రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. గతంలో నమోదు కాని చిన్న చిన్న ప్రమాదాలను కూడా ప్రస్తుతం రికార్డు చేస్తుండటం వల్లే గణాంకాలలో ఈ పెరుగుదల కనిపిస్తోందని వారు చెబుతున్నారు. రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా రోడ్ల ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దడం, నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం మరియు ప్రమాద సమయాల్లో తక్షణ అత్యవసర స్పందన వంటి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# గాదె ఇన్నయ్య కేసులో ఛార్జిషీట్

**హైదరాబాద్,జూన్ 18(మనం,ప్రత్యేక ప్రతినిధి):** సామాజిక ఉద్యమకారుడు, మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య కేసులో విచారణ ముగియడంతో ఎన్ఐఏ గురువారం నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిషేధిత సీపీఐ (మావోయిస్టు) సంస్థకు మద్దతుగా ప్రచారం చేయడం ఉపా చట్టాన్ని ఉల్లంఘించిన ఆరోపణతో 2025, డిసెంబ్ 21న ఇన్నారెడ్డిని జనగామ జిల్లా జాఫర్గఢ్ మండలంలో ఆయన నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో భాగంగా మరణించిన మావోయిస్టు నేత రామచంద్రారెడ్డి అంత్యక్రియలకు హాజరుకావడం, మావోయిస్టులకు అనుకూలంగా ప్రసంగాలు చేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడటం వంటి ప్రధాన అభియోగాలను ఏన్ఐఏ ఆయనపై మోపింది. ఈ కేసులో చంచల్గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఇన్నయ్యకు.. తాజాగా నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు 2 నెలల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, కేసులో విచారణ ముగిసిన నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు పూర్తిచేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు.

# కపిలతీర్థంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు

- టిటిడి జేఈవో డా. ఎ. శరత్






**విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః** కపిలతీర్థంలోని శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి జేఈవో డా. ఎ. శరత్ గురువారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్నందున ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లను మరింత పటిష్టంగా తీర్చిదిద్దడం, డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులు చేపట్టడం, పరిశుభ్రతను మెరుగుపరచడం వంటి అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో బి. నాగరత్న, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి గిరిధర్, డీఈలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, ఈఈలు మల్లికార్జున ప్రసాద్, సుమతి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డా. సునీల్ ప్రసాద్, సూపరింటెండెంట్ కె.పి. చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రక్తమోడిన రహదారులు

- వేర్వేరు ప్రమాదాలలో 7గురి మృతి
- మరో 10 మందికి తీవ్రగాయాలు

**హైదరాబాద్,జూన్ 18(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో వేర్వేరు జిల్లాల్లో గురువారం జరిగిన మూడు ఘోర రోడ్డు ప్రమాదాలలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. మితిమీరిన వేగం, నియంత్రణ కోల్పోవడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే..మేడ్చల్ జిల్లాలోని తుర్కపల్లి వద్ద అత్యంత వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న లారీని వెనుక నుంచి అత్యంత వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం లారీ కిందకు దూసుకుపోయి నుజ్జునుజ్జయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాలను కారులో నుంచి బయటకు తీయాల్సి వచ్చింది. అలాగే జనగాం జిల్లా నెల్లుట్ల పరిధిలో జాతీయ రహదారిపై రెండో ప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ఒక ట్రక్కును వేగంగా దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ రెండు భారీ వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో లారీ క్యాబిన్ పూర్తిగా నలిగిపోవడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల ప్రాంతంలో ఒక కారు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తక్షణమే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ వరుస ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# అందని రైతు బీమా డబ్బులు?



- చేతనైతే కొత్త పథకాలు తేవాలి?
- జీవన్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలో రైతు సమస్యలను అధికార కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే... ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులనే కనుమరుగు చేస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు వివిధ కారణాలతో దాదాపు 7,600 మంది రైతులు మరణిస్తే... వారికి అందాల్సిన రైతు బీమా డబ్బులు ఇప్పటివరకు రాలేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎల్ఐసీకి ఇన్సూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఈ క్లెయిమ్స్ ఆగిపోయాయనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇది కేసీఆర్ తీసుకొచ్చిన పథకం కాబట్టే... దీనిని ఎలాగైనా మూలనపడేయాలని రేవంత్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. చేతనైతే కొత్త పథకాలు తేవాలి? తప్ప, ఉన్న పథకాలను చెడగొట్టవద్దని హితవు పలికారు. మొత్తం 33 రకాల వడ్లు ఉంటే.. ప్రభుత్వం కేవలం 7 రకాల వడ్లను మాత్రమే బోనస్కు గుర్తిస్తోందన్నారు. అయితే ఈ 7 రకాల వడ్లు సాగు చేస్తే ఎకరానికి కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని, అదే మిగతా 26 రకాల వడ్లు వేస్తే ఎకరానికి ఏకంగా 30 క్వింటాళ్ల పంట పండుతుందని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన ఆ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి నష్టపోతారని... అంటే ఒక్కో రైతు ఎకరానికి దాదాపు రూ. 24 వేల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలి

- ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ శివకుమార్



**ఖమ్మం, జూన్ 18(మనం బ్యూరో):** జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమీషనర్ కె. శివకుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై ప్రాజెక్టుల వారిగా సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమీక్ష సందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మున్నేరు-పాలేరు లింక్ కాలువతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని పరిశీలించారు. భూసే కరణ, అటవీ అనుమతులు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కోర్టు కేసులు మరియు సర్వే పనుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అవార్డుల జారీ, చెల్లింపుల ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమీషనర్ తెలిపారు. పెండింగ్ అంశాల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్రమం తప్పకుండా పురోగతిని సమీక్షించాలని కమిషనర్ అన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ జిల్లాలో పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు సంబంధించి 11 గ్రామాల్లో 193.15 ఎకరాల భూసేకరణ అవార్డ్ దశలో ఉందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించి 14వ ప్యాకేజి క్రింద 650.22 ఎకరాల భూ సేకరణ లో 623.02 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసినట్లు కలెక్టర్ అన్నారు. 15వ ప్యాకేజీకి సంబంధించి 198.13 ఎకరాల భూసేకరణ కు గాను అవార్డ్ పాస్ చేసి, భూనిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. ప్యాకేజి16 కు సంబంధించి 820.12 ఎకరాలకు గాను అవార్డ్ పాస్ చేసినట్లు, 796.13 ఎకరాలకు పరిహారం చెల్లింపులు పూర్తి చేసి స్వాధీనం చేసుకున్నట్లు, మిగతా భూమికి పరిహారం ప్రభుత్వం నుండి రావాల్సి ఉన్నట్లు తెలిపారు. ప్యాకేజి 6, 2, 1 లకు సంబంధించి భూసే కరణ పురోగతిలో ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఇరిగేషన్ సిఈ లు ఎం. వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలతో గడపిన ప్రతీ క్షణం మరుపురానిది?

- విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేసిన కేటీఆర్



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ బేగంపేట బ్రాహ్మణవాడిలో ఉన్న స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన కేటీఆర్ స్కూల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం'ను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుంది. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది అని కేటీఆర్ పేర్కొన్నారు. స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ఆయన ప్రశంసించారు.

# అయోధ్య సీసీటీవీ దృశ్యాలు తారుమారు..!



**అయోధ్య, జూన్ 18:** ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరానికి అందిన విరాళాలు, వచ్చిన కానుకల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. తాజా దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాక్ష్యాలు లేకుండా ఉండేందుకు ఆలయంలోని సీసీటీవీ కెమెరాలను ట్యాంపర్ చేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని క్లూస్ను సిట్ అధికారులు దర్యాప్తులో గుర్తించారు.

సిట్ ప్రకారం.. గత 11 నెలల్లో ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్ల కోసం దాదాపు రూ.10 కోట్లు ఖర్చు చేశారు. ఇంత ఖర్చు చేసినప్పటికీ.. విరాళాల పెట్టెల నుంచి నగదు, ఆభరణాలు చోరీకి గురవడం.. భద్రతా వ్యవస్థపై తీవ్ర ఆందోళన రేకెత్తించాయి. దర్యాప్తులోభాగంగా.. ఆలయంలోని నిఘా వ్యవస్థలు, రికార్డయిన సీసీటీవీ దృశ్యాలు, భద్రత నిర్వహణ నియమాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో సీసీటీవీ కెమెరాలను తారుమారు చేశారనే క్లూస్‌ను కనుగొన్నారు. దీంతో ఆలయ భద్రతా వ్యవస్థలోని వివిధ స్థాయిలలో ఏమైనా లోపాలు ఉన్నాయా..? వారి హస్తం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. నిఘా, భద్రతా నిర్వహణకు సంబంధించి కొంతమంది సిబ్బంది సర్వీస్ రికార్డులు.. ఇతర వివరాలను కూడా సేకరిస్తున్నారు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో బ్యాంకు పాత్రను కూడా సిట్ పరిశీలిస్తుంది. ఈ ప్రక్రియలో బ్యాంకు సిబ్బందితో పోలిస్తే.. ట్రస్ట్ ఉద్యోగుల సంఖ్య పరిమితంగా ఉన్నట్లు సమాచారం. దీంతో లెక్కింపుల సమయంలో ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. విచారణ కోసం దాదాపు 200 మందితో సిట్ జాబితాను సిద్ధం చేయగా.. ఇందులో ఇప్పటికే 125 మందికి పైగా వ్యక్తులను విచారించింది. ఇక, కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న రామశంకర్ అలియాస్ తినూ యాదవ్ అనే వ్యక్తిని పలు గంటల పాటు సిట్ అధికారులు ప్రశ్నించారు.

## భర్త మరణించినా...
# మాజీ భార్య భరణం పొందవచ్చు




- బాంబే హైకోర్టు తీర్పు

**ముంబయి, జూన్ 18:** దంపతులు విడిపోయిన కేసుల్లో.. భర్త మరణానంతరం కూడా అతని ఆస్తి నుంచి భరణం పొందే హక్కు మాజీ భార్యకు ఉంటుందని బాంబే హైకోర్టు పేర్కొంది. అయితే, జీవన వ్యయాలు, వైద్యం ఖర్చులు అధికమయ్యాయంటూ ఆ భరణం మొత్తాన్ని పెంచమని మాత్రం ఆమె కోరలేరని స్పష్టం చేసింది. భర్త జీవించి ఉన్న సమయంలో, ఆ ఆస్తులు వృద్ధి చెందిన సందర్భాల్లో భరణం పెంచాలని డిమాండ్ చేయడం సముచితమని జస్టిస్ భారతి, జస్టిస్ మంజూషా దేశ్పాండే ధర్మాసనం తీర్పు వెలువరించింది. 2012 మార్చిలో భర్త నరేన్ గోరెగావోంకర్ మరణానంతరం భరణం చెల్లింపు నిలిచిపోవడంతో 62 ఏళ్ల వర్ష కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పెండింగ్లో ఉన్న భరణం మొత్తం చెల్లించాలని నరేన్ వారసులను న్యాయస్థానం ఆదేశించింది. అయితే, భరణం మొత్తాలను పెంచాలన్న వర్ష అభ్యర్థనను తోసిపుచ్చింది. దీంతో మాజీ భార్య బాంబే హైకోర్టును ఆశ్రయించారు. మాజీ భర్త వారసులు స్వయం కృషితో వృద్ధి చేసిన ఆస్తుల ఆధారంగా భరణం పెంచడం సముచితం కాదని హైకోర్టు పేర్కొంది.

# ఇంధన ధరలు వెంటనే తగ్గించలేం

## కేంద్ర మంత్రి సురేశ్ గోపి



**ఢిల్లీ, జూన్ 18:** అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెర పడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది.

పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు.

ఇలా పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు. దీని కారణంగా కేంద్రం రూ.12వేల కోట్ల మేర ఆదాయం కోల్పోయిందన్నారు.

# ఒక్కో ఎంపీకి మరో రూ.10కోట్లు ఇచ్చారు

## శివసేన ఎంపీ సంజయ్ రౌత్



**ముంబయి, జూన్ 18::** శివసేన (యూబీటీ)లో సంక్షోభం ముదురుతున్నట్లే కనిపిస్తోంది. ఆ పార్టీ పార్లమెంటరీ సమావేశానికి ఆరుగురు ఎంపీలు డుమ్మా కొట్టడంపై పార్టీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసమ్మతి వర్గంలో ఒక్కో ఎంపీకి అదనంగా రూ.10 కోట్లు ఇచ్చి, వారిని రాజస్థాన్లోని సురక్షిత ప్రాంతానికి తరలించారని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. తిరుగుబాటు ఎంపీలకు ఏమాత్రం నైతికత ఉన్నా.. వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

దేశ రాజకీయాలను బీజేపీ కలుషితం చేసిందని, మహారాష్ట్రలో మరింత దిగజారిందని సంజయ్ రౌత్ ఆరోపించారు. ఇందుకు ఆ పార్టీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ఒక్కో అసమ్మతి ఎంపీకి ఇప్పటికే రూ.15 కోట్లు ఇవ్వగా.. తాజాగా అదనంగా ఒక్కొకరికి మరో రూ.10 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. దిల్లీ నుంచి రాజస్థాన్‌లోని సురక్షిత ప్రాంతానికి వారిని తరలించారన్నారు. ద్రోహులకు, వారి ఆస్తులకు పోలీసు భద్రత కల్పించారని.. వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. రెబల్ ఎంపీలపై తామే ఆపరేషన్ తుడ్వా (వారిని వెంటాడే కార్యక్రమం) మొదలు పెడతామని రౌత్ హెచ్చరించారు.

'లోక్‌సభ ప్రక్రియ పూర్తైన తర్వాత కార్యాచరణ చేపడతాం. దీనిపై పార్లమెంటు, న్యాయస్థానంతోపాటు వీధుల్లోనూ పోరాటం చేస్తాం. వాళ్లు తిరుపతి దర్శనం కోసం వెళ్లారు. ఇదేం సంప్రదాయం..? మొదట ద్రోహం చేసి, ఆ తర్వాత భగవంతుడి ఆశీర్వాదం పొందడమా? ఎక్కడికైనా వెళ్లనివ్వండి. భయంతో వాళ్లు తిరుగుతూనే ఉంటారు. వాళ్ల ఇళ్ల దగ్గర భద్రతను పెంచారు'' అని సంజయ్ రౌత్ పేర్కొన్నారు.

## సర్ పై జర్నలిస్టులకు
# అవగాహన

**హైదరాబాద్, మనంప్రతినిధిః** జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు మీడియా అకాడమీ ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్లో నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువు లోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుందనితెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శిఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు.

# సికింద్రాబాద్ రోడ్లకు పేర్లు మార్పు

## కంటోన్మెంట్‌లో మారిన 21 రోడ్ల పేర్లు
## కేంద్ర రక్షణ శాఖ ఆదేశాల మేరకు ఈ మార్పులు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో బ్రిటిష్ కాలం నాటి గుర్తులను తొలగిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. వలసవాద పాలనను గుర్తుచేసే 21 రోడ్లు, పలు బజార్ల పేర్లను మార్చి, వాటి స్థానంలో భారత జాతీయ నాయకులు, సైనిక అధికారులు, యుద్ధ వీరుల పేర్లను ఖరారు చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు తీసుకున్న ఈ నిర్ణయంతో ఆయా మార్గాలకు కొత్త శోభ రానుంది. జూన్ 17న బోర్డు ప్రెసిడెంట్, బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. పాత పేర్లను తొలగించి, కొత్త సైన్ బోర్డులను ఏర్పాటు చేసే ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేస్తామని ఎస్సీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అరవింద్ కుమార్ ద్వివేది తెలిపారు. ఈ మార్పు దేశ సైనిక వారసత్వాన్ని, జాతీయ ప్రతీకలను గౌరవించుకునే విస్తృత ప్రయత్నంలో భాగమని ఆయన పేర్కొన్నారు.

తాజా మార్పుల ప్రకారం, లిట్టన్ రోడ్డుకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ రోడ్డు అని, బోల్టన్ రోడ్డుకు అటల్ బిహారీ వాజ్పేయి మార్గ్ అని, నోబెల్ రోడ్డుకు ఏపీజే అబ్దుల్ కలాం మార్గ్ అని నామకరణం చేశారు. 2020 గల్వాన్ లోయ ఘర్షణలో వీరమరణం పొందిన కల్నల్ బి. సంతోష్ బాబును స్మరించుకుంటూ బర్టన్ రోడ్డుకు 'సంతోష్ బాబు మార్గ్' అని పేరు పెట్టారు. అదేవిధంగా, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పలువురు అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పించారు. పరమవీరచక్ర, ఇతర శౌర్య పురస్కార గ్రహీతలైన కెప్టెన్ విక్రమ్ బాత్రా (వెల్లింగ్టన్ రోడ్డు), మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ (రిచర్డ్సన్ రోడ్డు), లెఫ్టినెంట్ కల్నల్ ఏబీ తారాపూర్ (ప్రోట్నీ రోడ్డు), కంపెనీ క్వార్టర్ మాస్టర్ హవల్దార్ అబ్దుల్ హమీద్ (అమెహర్స్ట్ రోడ్డు) వంటి యోధుల పేర్లను కూడా పలు రోడ్లకు పెట్టారు. రోడ్లతో పాటు బేరర్స్ లైన్స్ పేరును కర్తవ్య నగర్‌గా, 108 బజార్‌ను ఇన్ఫాంట్రీ బజార్‌గా, ఆర్ఏ పెన్షనర్స్ లైన్సును ఆర్టిలరీ పెన్షనర్స్ లైన్స్‌గా మార్చారు. దేశవ్యాప్తంగా కంటోన్మెంట్ బోర్డులలో వలసవాద పేర్లను తొలగించాలని 2021లో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ మార్పులు చేపట్టారు. ఈ ఏడాది ప్రారంభంలోనే భారత సైన్యం దేశవ్యాప్తంగా 246 రోడ్లు, భవనాలు, ఇతర సౌకర్యాల పేర్లను మార్చిన విషయం తెలిసిందే.

## మూడు రోజుల్లో నీట్ పరీక్ష..
# విద్యార్థులకు ఎన్టీఏ మెసేజ్




**ఢిల్లీ, జూన్ 18:** నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

''అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చు'' అని ఎన్టీఏ సూచించింది.

''పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం'' అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్-యూజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

## చీలిక వార్తల వేళ... శివసేన (యూబీటీ) ఎంపీల భేటీ..

- ముగ్గురే హాజరు



**ముంబయి, జూన్ 18:** ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) రెండోసారి రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పార్టీ గురువారం పార్లమెంటరీ సభ్యుల సమావేశం నిర్వహించగా.. లోక్సభ నుంచి కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరవడం గమనార్హం. దీంతో చీలిక వార్తలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. సమావేశానికి రాని మిగతా ఆరుగురు ఎంపీలు ఏక్నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన వర్గంలోకి దూకడం దాదాపు ఖాయమేనని తెలుస్తోంది.

శివసేన యూబీటీకి లోక్‌సభలో 9 మంది ఎంపీలున్నారు. రాజ్యసభలో సంజయ్‌రౌత్ ఒక్కరే పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చీలిక వార్తల వేళ.. గురువారం ఢిల్లీలో శివసేన యూబీటీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించింది. దీనికి పార్టీ ఎంపీలంతా రావాలని విప్ జారీ చేశారు. అయితే, సమావేశానికి రౌత్తో పాటు పార్టీ లోక్‌సభ ఎంపీలైన అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజ్ఞావు వాజే మాత్రమే హాజరయ్యారు. దీంతో గైర్హాజరైన మిగతా ఆరుగురు ఎంపీలకు పార్టీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ''సమావేశానికి ఎందుకు రాలేదో వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఒకవేళ ఆలోగా వారు స్పందించకపోతే.. విప్‌ను ఉల్లంఘించిన ఎంపీలపై అనర్హత వేటు వేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరనున్నాం'' అని శివసేన యూబీటీ ఎంపీ అరవింద్ సావంత్ మీడియాకు వెల్లడించారు.

ఈ ఆరుగురు ఎంపీలు పార్టీని వీడనున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. తాము శిందే శివసేనలో విలీనం కావాలని నిర్ణయించినందున లోక్‌సభలో తమకు వేరుగా సీట్లు కేటాయించాలని వీరంతా స్పీకర్ కార్యాలయానికి లేఖ పంపినట్లు వార్తలు వచ్చాయి. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు. ఒకవేళ వీరంతా పార్టీని వీడితే శివసేనలో మరోసారి చీలిక ఏర్పడుతుంది. ఇప్పటికే 2022లో ఏక్నాథ్ శిందే నేతృత్వంలో తిరుగుబాటు జరిగి పార్టీ రెండుగా చీలిన సంగతి తెలిసిందే.

# చీలిక ముంగిట 'సేన', ఎస్పీ!

## పార్టీని వీడేందుకు సిద్ధమైన ఆరుగురు ఉద్ధవ్ ఎంపీలు
## సమాజ్ వాదీ నుంచి కూడా సిద్ధంగా ఉన్నారు: యూపీ మంత్రి వెల్లడి



**ఢిల్లీ, జూన్ 18:** దేశంలో తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(యూబీటీ), అఖిలేశ్ యాదవ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) రాజకీయ సంక్షోభాల ముంగిట నిలిచినట్లు స్పష్టమవుతోంది. ఈ క్రమంలో శివసేన పార్టీ రెండోసారి చీలిపోయే స్థితిలో ఉంది. లోక్సభలో ఆ పార్టీకున్న 9 మంది ఎంపీల్లో ఆరుగురు శిందే శివసేనలోకి దూకడానికి సిద్ధమయ్యారు. తాము శిందే శివసేనలో విలీనం కావాలని నిర్ణయించినందున లోక్సభలో తమకు వేరుగా సీట్లు కేటాయించాలని వారు లోక్‌సభ స్పీకర్ కార్యాలయానికి లేఖ పంపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ పార్టీ నాయకులు సంజయ్ రౌత్, అర్వింద్ సావంత్, అనిల్ దేశాయ్‌లు బుధవారం ఉదయమే స్పీకర్ ఓంబిర్లాను కలిసి తమ పార్టీ నుంచి ఎవరైనా వచ్చి ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించమని కోరితే అంగీకరించొద్దని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆ పార్టీ ముఖ్యనేత సంజయ్ రౌత్ విలేకర్లతో మాట్లాడుతూ ఒకవేళ ఎవరైనా పార్టీ మారాలనుకుంటే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ''గురువారం ఉదయం పార్లమెంటరీ పార్టీ సమావేశం పెట్టాం. దానికి అందరూ రావాలని విప్ జారీచేశాం. గైర్హాజరైనవారిపై చర్యలు తీసుకుంటాం'' అని ప్రకటించారు.

### బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఎస్పీ

లోక్‌సభలో ప్రస్తుతం సంఖ్యాపరంగా మూడోస్థానంలో ఉన్న సమాజ్‌వాదీపార్టీలోనూ త్వరలో ముసలం పుట్టుకురానున్నట్లు ఉత్తర ప్రదేశ్ మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ బుధవారం ప్రకటించడం సంచలనం రేపింది. ''ఎస్పీలో భారీ చీలిక రానుంది. ఆ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. బీజేపీలో చేరడానికి ఆ పార్టీ సిద్ధంగా ఉంది'' అని ఆయన ఎక్స్‌లో చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా కొంత ఆందోళనకరంగా స్పందించారు. ''నయానో, భయానో పార్టీలను చీల్చడానికి బీజేపీ నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. ఎవరు భయపడతారో వారు పార్టీని వదులుకున్నట్లే''అని పేర్కొన్నారు. ఎస్పీకి ప్రస్తుతం లోక్‌సభలో 37 మంది ఎంపీలున్నారు.

### ఫిరాయింపులు చట్టవిరుద్ధం: సిబల్

ఒక పార్టీ గుర్తుపై ఎన్నికై పార్లమెంటుకు వెళ్లిన ప్రజాప్రతినిధులు మరో పార్టీకి మారడం అనైతికం, చట్టవిరుద్ధం, రాజ్యాంగానికి వ్యతిరేకం అని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. ఈ అంశంపై తుది నిర్ణయం కోర్టుదే అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు టీఎంసీ ఎంపీల చీలికపై తమ వాదన వినిపించేందుకు ఈ నెల 19న తన వద్దకు రావాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మరోసారి ఆహ్వానించారు.

# అవినీతిపై ప్రశ్నిస్తే?? వ్యక్తిగత దూషణలా?

## మంత్రి అడ్లూరిపై కొప్పుల ఈశ్వర్ ఫైర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** కాంగ్రెస్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తనపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేక, లక్ష్మణ్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారంటూ ఆయన మండిపడ్డారు. దీంతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో, జగిత్యాల-ధర్మపురి పొలిటికల్ సర్కిల్స్‌లో హీట్ ఒక్కసారిగా పెరిగింది. దర్మపురి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని కొప్పుల ఈశ్వర్ నేరుగా ఆరోపించారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఇసుక రీచ్లు మాయమైపోతున్నాయన్నది పచ్చి నిజం కాదా అంటూ ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలను, ఈ అవినీతి లెక్కలను పక్కదారి పట్టించడానికి మంత్రి లక్ష్మణ్ కుల రాజకీయం చేస్తున్నారని కొప్పుల మండిపడ్డారు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావునుద్దేశించి 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం ఏ రకమైన రాజకీయ సంస్కృతి? అని కొప్పుల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగానే అవినీతిపై మాట్లాడే ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని కొప్పుల ఈశ్వర్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు.

# సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మత్తు పనులను ఇరవై రోజుల్లో పూర్తి చేయాలి

- మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా ఆదేశం



ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 18 (మనం బ్యూరో): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన సివిల్,ఎలక్ట్రికల్ మరమ్మతు పనులు 20 రోజుల్లో పూర్తి చేయాలని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. అదేవిదంగా తరగతులు ప్రారంభమైన దృష్ట్యా ఇంటర్ అడ్మిషన్ లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మరమ్మత్తు పనులు, అడ్మిషన్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టి పురోగతిలో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మత్తు పనులను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. విద్య మౌలిక సదుపాయాల కల్పన, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. అలాగే జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థుల ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు త్వరగా పూర్తి చేసేలా చూడాలని కళాశాల ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పంచాయతీ రాజ్, విద్య, మౌలిక వసతుల ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతు, రిపేర్ పనులు, ఇంటర్ అడ్మిషన్లు గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని మొత్తం 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 13 కళాశాలలకు సంబంధించిన సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మత్తు పనుల పురోగతిని కళాశాలల వారీగా సమీక్షించారు. పీఆర్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 5 కళాశాలలు, విద్య మౌలిక సదుపాయాల ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో 8 కళాశాలల్లో చేపడుతున్న మరమ్మత్తు పనుల వివరాలను కళాశాల వారీగా ప్రిన్సిపల్స్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ఇంజనీరింగ్ అధికారులతో పనులు మంజూరు, పురోగతి, పెండింగ్ పనులపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. ఒకటి, రెండు కళాశాలలు మినహా మిగతా అన్ని కళాశాలల్లో పనులు ఇంకా పెండింగ్లో ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్, వాటిని తక్షణమే ప్రారంభించి 20 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా కాంట్రాక్టర్ల సమస్యలు ఉంటే వెంటనే వారి స్థానంలో కొత్త కాంట్రాక్టర్లను నియమించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. మరమ్మత్తు పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదిక సమర్పించాలన్నారు. రాబోయే 15 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కళాశాల ప్రిన్సిపాళ్లకు ఆదేశించారు. ఏ కళాశాలలోనైనా పనులు ప్రారంభం కాకపోతే, ఆ వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ద్వారా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. పనుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని కళాశాలల్లో పనులను వేగవంతం చేసి 20 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కళాశాలల్లో అడ్మిషన్ల పురోగతిని కూడా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రవేశం కోసం వచ్చిన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించలన్నారు. ఎవరికీ నిరాకరణ లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో 4838 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు మొదటి సంవత్సరంలో 2866 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలెక్టర్కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ముందస్తుగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో లభించే సౌకర్యాలు, అవకాశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. తరగతులు ప్రారంభమైనా దృష్ట్యా విద్యార్థులు నష్ట పోకుండా అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమణి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పీఆర్ , ఈ.డబ్ల్యూ.ఐ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డు అదుపు లేకుండా కరెంటు కోతలు

## నేరేడుచర్ల ట్రాన్స్‌కో ఏఈ పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలి



నేరేడుచర్ల జూన్ 18 మనం న్యూస్: నేరేడుచర్ల పట్టణంలో అడ్డుఅదుపు లేకుండా గంటల తరబడి పూటల తరబడి కరెంటు కోతలు విధిస్తున్న నేరేడుచర్ల కరెంటు ఏఈ పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని తక్షణమే బదిలీ చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు

**గురువారం ఆయన మాట్లాడుతూ**

నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలో గల రాంపురం రోడ్డు పాత నేరేడుచర్ల సరస్వతీ శిశు మందిర్ ఏరియాలో ప్రతిరోజు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా గంటల తరబడి కరెంటు కోతలు విధిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎప్పుడు కరెంటు పోతుందో ఎవరికి అర్థం కాదని , ఉదయం 8 గంటల నుంచి పది గంటల వరకు కరెంటు కోత ఉంటుందని ముందస్తు ప్రకటనలు చేసి ఆ నియమావళి పాటించకుండా ఇష్టమొచ్చిన రీతిలో ప్రవర్తిస్తున్నారని అడిగే నాధుడే లేడని కనురెప్పపాటు కూడా కరెంటు పోకుండా చూస్తున్నామని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ నేరేడుచర్ల లో కనురెప్ప పాటు కూడా కరెంటు ఉండటం లేదని ఇందుకు ఎవరు బాధ్యత వహించాలని విపరీతంగా ఎండలు ఉంటుంటే కరెంట్ కట్ చేసి ఏసి రూముల్లో కూర్చుని ఇన్వర్టర్ కింద కూర్చొని వెకిలి ఆనందం పొందుతూ మతిభ్రమించిన వారిలా ప్రవర్తిస్తున్న కరెంటు ఏఈ ని సస్పెండ్ చేయాలని లేదా లీవ్ పై పంపించాలని ఆయన హుజూర్నగర్ డిఇ కి సంబంధిత అధికారులకి విజ్ఞప్తి చేశారు చీటికిమాటికి ఎందుకు కరెంటు పోతుందో తక్షణమే అఖిలపక్ష సమావేశం పెట్టి వివరించాలని ప్రత్యేకించి ఒక ప్రాంతానికి కరెంటు పోవడం ఏమిటని గంటకు ఐదు సార్లు కరెంటు వచ్చి పోతుందని డ్యూటీ చేసే విధానం ఇదేనా అని డ్యూటీ చేయడం చేతకాకపోతే రాజీనామా చేసి విశ్రాంతి తీసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. ఆయన వెంట మాజీ మండల సిపిఐ కార్యదర్శి రావుల సత్యం సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు పిల్లుట్ల కనకయ్య సిపిఐ నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ రాంబాబు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం



తిరుమలగిరి, జూన్ 18 (మనం న్యూస్).: తిరుమలగిరి మండలా కోక్యా నాయక్ తండ గ్రామపంచాయతీకి చెందిన గుగులోతు శిరీష ఉపేందర్ ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ ప్రారంభోత్సవాన్ని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేలు గురువారం ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ప్రారంభోత్సవానికి మండల పార్టీ అధ్యక్షులు వై.నరేష్, కందుకూరి లక్ష్మయ్య, సర్పంచ్ లు మండల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అమ్మ మాట - అంగన్వాడి బాట పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 18 (మనం బ్యూరో): మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అమ్మ మాట - అంగన్వాడి బాట' కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, కార్యక్రమ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,...జూన్ 13 నుండి జూన్ 19 వరకు జిల్లాలోని ప్రతి అంగన్వాడి కేంద్రంలో 'అమ్మ మాట - అంగన్వాడి బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం 3 నుండి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో నమోదు చేయించి, వారికి నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య, పోషకాహారం అదేవిధంగా ఆరోగ్య సేవలు అందేలా చూడడమే అని పేర్కొన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) మహిళలు, ( ఏ ఎల్ ఎం ఎస్ సి) కమిటీ సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పించి, అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎస్. జరీనా బేగం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల స్వంతింటి సాకారమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇండ్ల మంజూరు.



కామారెడ్డి, జూన్ 18 (మనం జిల్లా ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామంలో భూమి పూజ నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం అమలులో భాగంగా లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు రావుల పెద్ద ఎల్లమ్మ, భిక్షపతి, దానబోయిన జ్యోతికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం కల్పిస్తున్న గృహ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.

**గుడిసెలో నివసిస్తున్న తమకు సొంత ఇండ్లని హర్షం**

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, లబ్ధిదారులు త్వరితగతిన గృహ ప్రవేశం చేసుకునేలా అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న తమకు సొంత ఇంటి కల నెరవేరడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ హిమబిందు, డీఎల్పీఓ శ్రీనివాస్, సర్పంచ్ దివ్య, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చింతచిగురు రూ. 1000



మేళ్లచెరువు,జూన్ 18, మనం న్యూస్: వర్షాకాలంలో చింత చెట్టుకు లేత లేతగా వచ్చే చింత చిగురు ధర ఆకాశానంటింది. గ్రామాలలో చాలామంది యువత యువకులు చింత చెట్ల వద్దకు వెళ్లి చింతచిగురు తెచ్చుకొని వండుకుంటారు. పల్లెల్లో తేలిగ్గా దొరికె చింతచిగురు ధర కేజీ రూ. 1000 అయింది.దీంతో చింతచిగురుపై ఉన్న మమకారం చంపుకోలేక పట్టణాలలో చాలామంది కొని తెచ్చుకుంటున్నారు. ఈ ధర ఉంటే సామాన్యుడికి చింతచిగురు అందని ద్రాక్షల తయారవుతుంది.

# జర్నలిస్టుల పిల్లలకు ఫ్రీ ఎడ్యుకేషన్




- డీఈఓ రోహిణి

సంగారెడ్డి జూన్ 18 మనంప్రతినిధి : 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి ఆర్. రోహిణి ఆదేశాలు జారీ చేశారు.వివిధ జర్నలిస్టు సంఘాల వినతి మేరకు ఎల్ ఆర్ నెంబర్.1877/బి 1/2026, ఈనెల 16వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలకు, జర్నలిస్టు సంఘాల నాయకులకు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పంపించారు.ఈ సందర్భంగా డీఈఓ రోహిణి మాట్లాడుతూ.. 'సమాజ హితం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల సేవలు అమూల్యమైనవి. వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందాలన్నదే మా లక్ష్యం. పాఠశాలల యాజమాన్యాలు సహృదయంతో సహకరించాలి. ఉచిత విద్య కల్పనలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యాధికారులను సంప్రదించవచ్చు. ఇది జర్నలిస్టు సమాజానికి అందించే ప్రోత్సాహం' అని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా నాణ్యమైన వైద్యాన్ని అందించాలి



- సిబ్బంది ప్రతిరోజూ 10 గంటల లోపు హాజరు కావాలి
- ప్రతి వైద్యుడు బాధ్యతతో పనిచేయాలి
- కలెక్టర్ బి చంద్రశేఖర్

నల్లగొండ -జూన్ 19 (మనం ప్రతినిధి ): నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హెచ్వోడీలతో సమీక్ష నిర్వహించారు.

ప్రతి వైద్యుడు విధులకు సమయానికి హాజరుకావాలని , ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను తనకు నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు.


ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, వివిధ విభాగాల హెచ్వోడీలను ఆయా విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలు, ప్రత్యేక కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు.

ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీసిన కలెక్టర్, అవసరమైన పరికరాలను సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పీహెచ్సీలు, సబ్సెంటర్లకు అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి వైద్యుడు బాధ్యతతో పనిచేయాలని అన్నారు.

సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ , ప్రభుత్వ డాక్టర్లు, డాక్టర్ నగేష్ , వివిధ విభాగాల హెచ్వోడీలు పాల్గొన్నారు.

# శ్రమశక్తి అవార్డు అందుకున్న నాదెళ్ల బాలకృష్ణకి పౌర సన్మానం



కోదాడ, జూన్ 18(మనం న్యూస్): కోదాడ రూరల్ సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్, సత్యమేవ జయతే సేవా సమితి వ్యవస్థాపకులు నాదెళ్ల బాలకృష్ణ ప్రతిష్టాత్మక 'శ్రమశక్తి' అవార్డును అందుకున్న సందర్భంగా మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామంలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పౌర సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ ప్రజలు శాలువా బొకేతో బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఆయన విద్యుత్ శాఖలో ప ప్రజలకు అందిస్తున్న సేవలకు, అనేక సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ మంత్రి వినోద్ చేతుల మీదుగా ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మే 1 తారీఖున ఈ అవార్డును ప్రదానం చేసిందని అన్నారు. ఈ సందర్భంగా రెడ్లకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నాదెళ్ల బాలకృష్ణని ఘనంగా సన్మానించామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పోలంపల్లి కుటుంబరావు, వైస్ సర్పంచి మల్లెల ప్రసాద్ రావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగవరపు లక్ష్మణరావు, విద్యుత్ శాఖ సిబ్బంది తిరుపతిరావు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రామారావు, అంబరీష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# యోగా డేని విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్‌చంద్రశేఖర్



నల్లగొండ- జూన్ 18 (మనం ప్రతినిధి ): ఈనెల 21వ తేదీన జరిగే యోగా డేని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఔట్డోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 6 గంటలకు జరిగే యోగా డే పోస్టర్ను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ యోగా డేలో అధికారులతో పాటు యోగ క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని సామూహిక యోగా కార్యక్రమం లో పాల్గొన లని, యోగ డే ని పండుగ వాతావరణంల నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడ అధికారి అక్బర్ అలీ, ఆయుష్ డాక్టర్లు బుష్రా రుచిత, డిపిఎం కళ్యాణ్, యోగా గురువులు శ్యాంసుందర్, కరుణాకర్, రాపోలు వెంకటేశ్వర్లు, సింగం ప్రవీణ్ కుమార్, శివ, మంజునాథ్, జ్యోతి, బజరంగ్ ప్రసాద్, పాల్గొన్నారు.

# ఉద్యానవన పంటలు విస్తీర్ణం పెరగాలి

- ఆయిల్ ఫామ్ సాగు నిర్దేశించిన విస్తీర్ణం పూర్తి కావాలి
- పండ్లు, పూల తోటలు కూరగాయ పంటల సాగుపై రైతుల్లో అవగాహన పెంచాలి
- జిల్లా కలెక్టర్ కే. హైమావతి



సిద్దిపేట జూన్ 18(మనం ప్రతినిధి): పంటల సాగు పై రైతులలో పూర్తి అవగాహన పెంచే విధంగా అధికార యంత్రాంగం పనిచేయాలని జిల్లా కలెక్టర్ కే హైమావతి పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ తో పాటు వివిధ ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగడానికి చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఐడిఓసిలో గురువారం జరిగిన ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడారు. ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం ప్రభుత్వం నిర్దేశించిన మేరకు లక్ష్యం పూర్తి కావాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల్లో అవగాహన కల్పిస్తూ పంటల సాగుపై సమాచారం అందించాలన్నారు. ప్రతి వారం ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పురోగతిపై సమీక్షలు నిర్వహించాలని సూచించారు. నెలాఖరులోగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులతో సమన్వయం తో భూముల క్లీనింగ్, ఫిట్ మార్కింగ్, ఫిట్టింగ్ పనులు వేగవంతంగా పూర్తి కావాలన్నారు. ఆయిల్ ఫామ్, పండ్లు, పూలు, కూరగాయల మొక్కలు నాటడానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. ఆర్గానిక్ మరియు సీజనల్ పండ్లు ఆకుకూరల సాగు ద్వారా రైతులకు అదనపు ఆదాయం అంది వస్తుందనే అంశాన్ని రైతుల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సహజసిద్ధమైన ఆహారం కోసం మార్కెట్లో డిమాండ్ పెరుగుతుందని రైతులు సద్వినియం చేసుకోవాలని సూచించాలని అధికారులకు వివరించారు. నర్సరీల ద్వారా మొక్కల పెంపకానికి కార్యాచరణ చేపట్టాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయాలని స్థానిక అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పూలు, పండ్లు ఉత్పత్తి జరిగే దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ, వ్యవసాయ పథకాల ప్రయోజనాలను అర్హులైన రైతులకు అందే విధంగా చూడాలన్నారు. ఫార్మర్ రిజిస్టర్ లేకపోవడం వల్ల పలువురు రైతులు ఈ అవకాశాలను చేసుకోలేకపోతున్నట్లు పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ ప్రతికూల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అందుకు అనుగుణమైన పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ అంశంలో రైతుల్లో పూర్తి అవగాహన పెంచాలన్నారు. వర్షాభావ పరిస్థితిలను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం కూడా అవసరమైన ఫామ్ పాండ్లు ఇతర చర్యలను చేపట్టాలన్నారు. విత్తన పంపకం లో తగిన చర్యలు చేపట్టాలని నిలువల వివరాలను ప్రజాప్రతినిధులకు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా దూల్మిట్ట, ఆకారం, బక్రీ చెప్యాల్, నంగునూరు, చిట్టాపూర్ గ్రామాలలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ విజయవంతం చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, టీజీ ఆయిల్ పేడ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో రజకులకు ఐరన్ బాక్స్‌ల పంపిణీ

ములుగు, జూన్ 18(మనం న్యూస్): చేతివృత్తుల వారు ఆర్థిక పురోగతి సాధించేందుకు రోటరీ ఎంతగానో కృషి చేస్తున్నదని రోటరీ 3150 అసిస్టెంట్ గవర్నర్ జగదీశ్వర్, రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు. షార్ సహకారంతో క్లబ్బుకు కేటాయించిన గ్యాస్ తో పనిచేసే ఐరన్ బాక్స్ లను గురువారం రజకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాలకు ఆర్థికంగా చేదోడు అందించేందుకు రోటరీ పని చేస్తుందని చెప్పారు. ముఖ్యంగా చేతివృత్తుల వారు ఆర్థికంగా ఎదిగే దిశగా సహాయం అందించడం జరుగుతున్నదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చేతివృత్తుల వారికి సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ఆర్థిక అభ్యున్నతి సాధించలేకపోతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని రోటరీ సహాయం అందజేయడం జరుగుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు కార్యదర్శి కొక్కొండ సాయి రెడ్డి, క్లబ్ చైర్మన్ కుంట కర్ణాకర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు కడపల్ల నరసింహారెడ్డి, రోటరీ సభ్యులు శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్నల్ సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేసిన మంత్రి



మహాదేవపూర్ జూన్ 18మనం న్యూస్: మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులను మంజూరు చేసిన రాష్ట్ర ఐటి భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి గ్రామ సర్పంచి సరిత హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తూ, ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ నిధులతో గ్రామంలోని అంతర్గతరహదారులు మెరుగుపడి ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. అలాగే గ్రామ ప్రజల తరపున మంత్రి శ్రీధర్ బాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధికి ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు.

# మంత్రి శ్రీధర్ బాబును కలిసిన సర్పంచ్



మహాదేవపూర్ జూన్ 18మనం న్యూస్: మహాదేవ్‌పూర్ గ్రామపంచాయతీ అభివృద్ధికోసంఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకంకింద రూ.15 లక్షలు మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి మహాదేవ్పూర్ గ్రామ సర్పంచ్ హసీనా బాను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారుఈ నిధులతో గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేలా కృషి చేస్తామని ఆమె తెలిపారు రాష్ట్ర ఐటీ శాఖ భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎల్లప్పుడూ మంథని నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని సర్పంచ్హసీనాబానుకొనియాడారు.

# ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణకు సన్నద్ధం కావాలి

- ఎస్.ఐ.ఆర్ నిర్వహణలో బిఎల్ఓలు, బిఎల్ఏల పాత్ర కీలకం
- శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు, జూన్ 18, మనం ప్రతినిధిః ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, ఎస్.ఐ.ఆర్ నిర్వహణలో బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం ఎస్.ఐ.ఆర్ నిర్వహణ, బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏల శిక్షణ తరగతుల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని, ప్రతి ఓటరుకు సరైన నమోదు, మార్పులు, సవరణలు ఖచ్చితంగా జరిగేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా, డూప్లికేట్ నమోదులను గుర్తించి, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించేలా బి.ఎల్.ఓలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీ శుక్రవారం ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల వారికి ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల వారికి పి.ఎస్.ఆర్ గార్డెన్, గోవిందరావుపేటలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

20వ తేదీ శనివారం ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల వారికి ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో, 22వ తేదీ సోమవారం కొత్తగూడ, గంగారం మండలాల వారికి కొత్తగూడ రైతు వేదికలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు, డూప్లికేట్ నమోదుల గుర్తింపు, అభ్యంతరాల పరిశీలన, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు.మండలాల పరిధిలోని బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలకు ముందస్తు సమాచారం అందించి, శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ములుగు నియోజకవర్గ పరిధిలోని 303 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రతి కేంద్రానికి బి.ఎల్.ఓలు, సంబంధిత సూపర్వైజర్ల పేర్లు, సంప్రదింపు వివరాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, ఈ.ఆర్.ఓ కార్యాలయ నోటీస్ బోర్డుల ద్వారా, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా పోలింగ్ స్టేషన్ నంబర్, పేరు, సంబంధిత బి.ఎల్.ఓ పేరు, మొబైల్ నంబర్, బి.ఎల్.ఓ సూపర్వైజర్ పేరు, మొబైల్ నంబర్ వివరాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలన్నారు.

ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సేవలు, మార్గదర్శకత్వం అందించడంలో బి.ఎల్.ఓలు కీలకంగా వ్యవహరించాలని, పారదర్శకత, ఖచ్చితత్వం, ప్రజల భాగస్వామ్యంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి సిహెచ్ మహేందర్ జి,ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కృష్ణవేణి, అన్ని మండలాల తహసీల్దార్లు సంబంధిత అధికారులు, ఎన్నికల సూపరిండెంట్ సలీం, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నితీష్ కుమార్, పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన కలెక్టర్




ములుగు, జూన్ 18, మనం ప్రతినిధిః ఓటరు జాబితా సవరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్కును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు.

ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, నమోదు, పరిష్కార విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలను సకాలంలో అందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని, పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

హెల్ప్ డెస్కు వచ్చే ప్రజలకు మర్యాదపూర్వకంగా స్పందిస్తూ వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ చందర్ శేఖర్, డి పి ఆర్ ఓ రఫిక్,అడిషనల్ పీడీ శ్రీనివాస్, ఎన్నికల డి టీ నితీష్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బుక్ స్టాల్‌తో ప్రారంభించిన

## ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్ సుహాసిని



భీమదేవరపల్లి జూన్ 18 మనం న్యూస్: మాజీ ప్రధాని పివి స్వగ్రామంలో బుక్ స్టాల్ ను ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్ పర్సన్ కే . సుహాసిని ప్రారంభించారు. గురువారం రోజున మాజీ ప్రధాని పివి స్వగ్రామ వంగర గ్రామం లోని పివి నగర్ కాలనీలో బుక్ స్టాల్ ను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ స్వయం ఉపాధితో తక్కువ పెట్టుబడితో ప్రారంభించిన బుక్ స్టాల్ అంచలంచెలుగా ఎదిగి ఆర్థిక అభివృద్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గజ్జల సురేష్, పీవీ కాలనీ మహిళలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహామహోత్సవంలో పాల్గొన్న లావుడియా పల్లవిరాజు



భూపాలపల్లి, జూన్ 18 (మనంన్యూస్)ః ములుగు జిల్లా వెంకటాపూర్ మండల్ మల్లయ్యపల్లి గ్రామంలో ఈరోజు కళ్యాణ వేదిక కుందూరుపల్లి భూపాల్ పల్లి జయశంకర్ జిల్లా ఏ ఎస్ ఆర్ గార్డెన్ లో అంగరంగ వైభవంగా వివాహ మహోత్సవం నిర్వహిస్తున్న క్రీ. శే. వాంకుడోత్ సారయ్యా కౌసల్యా, బుజ్జి, కుమార్తె వాంకుడోత్ దీపిక, బానోత్ మోతిలాల్ సీతాబాయి, కుమారుడు ఆంజనేయులు వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్య నాయకులు బంధుమిత్రులు లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, జీవన శ్రీ, సెహ్వాగ్, శంకర్పల్లి సర్పంచ్ కిషన్ నాయక్, పోరిక సరోజన బలరాం నాయక్, కృష్ణవేణి విటల్ కుమార్, కేతావత్ కమల మధు నాయక్, అరుణతులసిరామ్, నీల అశోక్, శ్రీరామ్, వనిత రాజు నాయక్, సిద్ధూ, సహస్ర, కల్పన రాజ్ కుమార్, బాలు నాయక్, క్రీ. శే.రాజు నాయక్, కిషన్ నాయక్ , సత్తి నాయక్, రాజు నాయక్, జుమ్మూలాల్, శంకర్ నాయక్, అరుణ సమ్మయ్యానాయక్, అజంత సర్దార్ సింగ్, చిన్ని శోభన్ బాబు, వినోది బాయి, వాంకుడోత్ మమత విజయ్, స్వర్ణ వినోద్, సర్పంచ్ గణేష్ నాయక్, చిన్ని రాజు నాయక్, జగ్రామ్ నాయక్, దేవేందర్, అనిల్, భాస్కర్, జోగానంద్, వినోద్, వినోద, దేవేందర్, శివ, శ్రీను, రఘు, సవిత, శ్రావ్య, గోపాల్, శ్రీకాంత్, సమ్మయ్య, రమేష్, రవి, పులి, వినోద్, అరుణ, శ్రీనివాస్, దేవేందర్, కిషన్, కుమార్, అనిల్,మొదలైన ముఖ్య నాయకులు బంధుమిత్రులు పాల్గొని దీపిక ఆంజనేయులు నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించడం జరిగింది.

# ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై అవగాహన



మహాదేవపూర్ జూన్ 18మనం న్యూస్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై అవగాహనకల్పించేందుకునియోజకవర్గపరిధిలోనిప లుమండలాలపోలింగ్కేంద్రాలస్థాయిఅధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. మహాదేవపూర్, పలిమెల మండలాల పరిధిలోని 45 మంది బిఎల్ఓలు, 06మంది బిఎల్ఓసూపర్వైజర్‌కు ఈ శిక్షణ తరగతులు జరగనున్నాయి, ఈ శిక్షణ కార్యక్రమం తేది:19/06/2026 శుక్రవారం రోజున ఉదయం 10:00 గంటలకు మహాదేవపూర్ లోని స్థానిక మహాదేవపూర్ ఎంపీడీఓకార్యాలయంలోప్రారంభం కానుంది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆర్డీవో హాజరు అవుతారు,నైపుణ్యం కలిగిన మాస్టర్ట్రైనర్లు శిక్షకులుగా వ్యవహరించనున్నారు, ఈ సందర్భంగా వారు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలు క్షేత్ర స్థాయిలో దీనిని అమలు చేసే విధానం,ఓటర్ జాబితాల సవరణ ప్రక్రియలో అనుసరించాల్సిన నియమాలు, అధికారులబాధ్యతలు తదితర కీలక అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇవ్వనున్నారు, మహాదేవపూర్ మండలం 34 మంది బిఎల్ వోలు బి ఎల్ వోలు, 04 సూపెర్వైసోర్లు, పలిమెల మండలం 11 మంది బి ఎల్ ఓ లు, 02 మంది సూపెర్వైసోర్లు, భారత ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంయొక్కలక్ష్యాలు,విధివిధానలు,ఓటరుగాన మోదుచేసుకోవడం వల్ల కలిగే ప్రాముఖ్యతను ప్రజలోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహాదేవపూర్ తహసీల్దార్‌కు సత్యనారాయణస్వామి పేర్కొన్నారు, కావున శిక్షణకార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని ప్రకటనలో కోరారు,

# విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



భీమదేవరపల్లి, జూన్ 18 మనం న్యూస్ః కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. గురువారం రోజున కస్తూరిబా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి ఆధ్వర్యంలో ఆరవ తరగతి నుండి ఇంటర్ విద్యార్థుల వరకు పాఠ్యపుస్తకాలను ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి చేతుల మీదుగా పంపిణీ చేసి అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సదుపాయాలను వినియోగం చేసుకుని ప్రతి శాస్త్రం నుండి జ్ఞానాన్ని పొంది మార్కులు సాధించిసమాజంలో విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు సంపాదించాలని విద్యార్థి సూచించారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్న-అక్క మెంటర్‌షిప్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం



మహాదేవపూర్, జూన్ 18మనం న్యూస్ః తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్న-అక్క మెంటర్షిప్ కార్యక్రమంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత రెండు రోజులుగా అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నోడల్ అధికారులు, అధ్యాపకులు, తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ రవికుమార్ మాస్టర్ ట్రైనర్గా వ్యవహరించి డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ అందించారు. ఈసందర్భంగా డిగ్రీ విద్యార్థులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు చేపట్టనున్న బోధన కార్యక్రమాలపై ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న-అక్క మెంటర్షిప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్జన్ను విజయకుమార్ మాట్లాడుతూ, రాబోయే కాలం డిజిటల్ లెర్నింగ్మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్తో ముడిపడి ఉంటుందని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా మాస్టర్ రవికుమార్‌ను అభినందించారు.

# పేద వాడి పొదరిల్లు

- ఇందిరమ్మ ఇళ్లతో సాధ్యమైంది
- సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం అనిల్



భీమదేవరపల్లి , జూన్ 18 మనం న్యూస్: పేదవాడి సొంతింటి పొదరిల్లు కాంగ్రెస్తో సాధ్యమైందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం అనిల్ అన్నారు. గురువారం రోజున ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు అయినా బండారి లక్ష్మి రాజు, అల్లం శిరీష రాజు గృహప్రవేశాల కు ఎంపీడీవో విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రంలోని పేదవాడి సొంతింటి కల ను ఇంద్రమ్మ ఇళ్ల పథకం ద్వారా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్షణం అని పూర్తి చేశారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రవీణ్, మార్కెట్ డైరెక్టర్ గోడిశాల రాజయ్య, పాక రమేష్, గుడిషాల అర్జున్, నాగరాజు, కిరణ్, రమేష్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ పేరుతో ఫేక్ వాట్సాప్ సందేశాలు

- అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ములుగు, జూన్ 18, మనం ప్రతినిధి: ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పేరుతో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ ద్వారా ఫేక్ మెసేజ్లు పంపుతూ అధికారులను సంప్రదించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఇటువంటి నకిలీ సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ అధికారిక సమాచార వ్యవహారాలు కేవలం అధికారిక మార్గాల ద్వారానే జరుగుతాయని స్పష్టం చేశారు. తెలియని నంబర్ల నుంచి, జిల్లా కలెక్టర్ పేరు, ఫోటో, ఇతర వివరాలు ఉపయోగించి వచ్చే సందేశాలను నమ్మకుండా వెంటనే తమ దృష్టికి,స్థానిక పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి, సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# విస్తృత స్థాయిలో, బాధ్యతాయుతంగా మొక్కలు నాటాలి

- ములుగులో అటవీ సిబ్బందికి నూతన సదుపాయాలు
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు ,జూన్ 18, మనం ప్రతినిధిః రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ చేపట్టిన వన మహోత్సవం-2026 కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్క్లో మొక్క నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.35.50 కోట్ల విలువైన అటవీ, పర్యావరణ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రూ.17.84 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అదేవిధంగా ములుగు సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రూ.17.66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, వన్యప్రాణి సంరక్షణ, జూ ఆధునీకరణ, నివాస భవనాలు, పర్యావరణ మౌలిక వసతుల అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ క్రమంలో ములుగు జిల్లా జాకరం కేంద్రంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ క్వార్టర్స్తో పాటు అటవీ శాఖ ఫ్రంట్లైన్ సిబ్బందికి నూతన మౌలిక వసతులను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనాలతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది 12 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణయించామని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఈ లక్ష్యాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. విస్తృత స్థాయిలో, బాధ్యతాయుతంగా మొక్కల నాటకం చేపట్టాలని సూచించారు. అన్ని శాఖలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతాయని, ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శాఖల వారీగా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టడంతో పాటు, నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి పెంపకం, పరిరక్షణ కూడా సమానంగా ముఖ్యమని, అన్ని శాఖల సమన్వయంతో జిల్లాను మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు అటవీ శాఖ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాకారం సర్పంచ్ సర్పంచ్ సమత, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ - శుక్రవారం 19 జూన్ 2026

## 126 బంతుల్లోనే 306 రన్స్.. బిహార్ నుంచి మరో క్రికెట్ సంచలనం

వైభవ్ సూర్యవంశీ 13 ఏళ్లకే ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకుని క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశాడు. బిహార్ కు చెందిన ఈ కుర్రాడు రాజస్థాన్ రాయల్స్ తరఫున గత రెండు సీజన్లలో పరుగుల వరద పారించి ఎన్నో రికార్డులు బ్రేక్ చేశాడు. ఈ ప్రదర్శనతో భారత టీ20 జట్టులోనూ చోటు సంపాదించుకున్నాడు. ఇప్పుడు అదే రాష్ట్రం నుంచి మరో టీనేజీ సంచలనం వెలుగులోకి వచ్చింది. అక్షర గుప్తా అనే అమ్మాయి ఓ మ్యాచ్ లో 126 బంతుల్లోనే 242.86 స్ట్రైక్ రేట్ తో 306 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ, 34 బంతుల్లో సెంచరీ చేసింది. మొత్తం 55 ఫోర్లు, ఎనిమిది సిక్సర్లు బాది వార్తల్లో నిలిచింది.

బిహార్ క్రికెట్ అసోసియేషన్ మహిళల అండర్-19 వన్డే ట్రోఫీ టోర్నమెంట్ లో అక్షర గుప్తా ఈ సంచలన ఇన్నింగ్స్ నమోదు చేసింది. 15 ఏళ్ల అక్షర తూర్పు చంపారన్ జిల్లా రక్సాల్ అనే పట్టణంలో పుట్టి పెరిగింది. 14 ఏళ్ల వయసులోనే అండర్-19 మహిళల జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించింది. బిహార్ తరఫున రెండేళ్ల వ్యవధిలో వరుసగా నాలుగు బీసీసీఐ మహిళా టోర్నమెంట్లు ఆడిన తొలి మహిళా క్రికెటర్ గా నిలిచింది.

సంచలన ఇన్నింగ్స్ ఆడిన అక్షరకు బిహార్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ అభినందనలు తెలిపారు. బిహార్ మహిళా క్రికెటర్లు తమ ప్రదర్శనల ద్వారా రాష్ట్రానికి నిరంతరం కీర్తిని తెస్తున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు బీసీఏ నిరంతరం కృషి చేస్తోందని, ఇలాంటి ఇన్నింగ్సు యువ క్రికెటర్లకు స్ఫూర్తినిస్తాయన్నారు.







## 3 వారాలు.. 3 ఫార్మాట్లు.. 3 సెంచరీలు..

# దటీజ్ 'కెప్టెన్' గిల్!

**అప్పటివరకు దంచికొట్టిన టీ20లు.. వారానికే టెస్టు మ్యాచ్ లోకి ఎంట్రీ.. ఆపై మరికొద్ది రోజులకే 50 ఓవర్ల క్రికెట్... సుమారుగా ఇరవై రోజుల వ్యవధిలో కెప్టెన్ శుభ్ మన్ గిల్ మూడు ఫార్మాట్లనూ ఆడిన వైనం.. ప్రతి ఫార్మాట్ లోనూ 'కెప్టెన్' సెంచరీతో మెరవడం గమనార్హం. మూడు వారాల్లో టీ20, టెస్టు, వన్డే మ్యాచుల్లో సెంచరీ చేసి ఔరా అనిపించాడు. గిల్ ఇన్నింగ్స్ పై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా సర్ ప్రైజ్ అయ్యారంటే.. అతడి ఆటతీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.**

### ఎప్పుడెప్పుడు కొట్టాడంటే..

మే 29న ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ రెండో క్వాలిఫయర్ మ్యాచ్ ను ఆడింది. జీటీ కెప్టెన్ అయిన శుభ్ మన్ గిల్ అద్భుత శతక ఇన్నింగ్స్ తో ఆకట్టుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ పై గిల్ 104 పరుగులు చేశాడు.

అఫ్గానిస్థాన్ తో జూన్ 6న భారత్ ఏకైక టెస్టు మ్యాచ్ ఆడింది. తొలుత టీమ్ఇండియా 564 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ గిల్ (126)తోపాటు కేఎల్ రాహుల్ (100) సెంచరీలతో మెరిశారు. మూడు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించింది.

అఫ్గానిస్థాన్ తో రెండో వన్డేలో కెప్టెన్ శుభ్ మన్ గిల్ (154) సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. గిల్తో పాటు ఇషాన్ కిషన్ (125) కూడా సెంచరీ బాదాడు. దీంతో భారత్ 402 పరుగుల భారీస్కోరు చేసింది. అనంతరం అఫ్గాన్ 232 పరుగులకే ఆలౌటైంది.

మూడు మ్యాచుల్లోనూ ఆయా జట్లకు శుభ్ మన్ గిల్ కెప్టెన్ కావడం విశేషం.

### ఇలా మారడం చాలా కష్టమే..

దాదాపు రెండు నెలలపాటు టీ20 క్రికెట్ ఆడిన తర్వాత టెస్టులను ఎదుర్కోవడం ఎంతటి క్రికెటర్ కైనా కష్టమే. అఫ్గాన్ మనకంటే కాస్త చిన్న జట్టు అయినా సరే.. తక్కువగా అంచనా వేయడానికి వీల్లేని పరిస్థితి. కానీ, శుభ్ మన్ గిల్ మాత్రం అలవోకగా ట్రాన్స్ ఫామ్ అయిపోయాడు. టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత.. వారం రోజులకే వన్డే సిరీస్ లో భారత్ తలపడుతోంది. ఇక్కడ టెస్టుల్లో ఆడినట్లు నెమ్మదిగా ఉండటం కుదరదు. అలాగని టీ20ల్లో మాదిరిగా దూకుడుగా ఆడలేం. రెండింటినీ మేళవించి మంచి ఇన్నింగ్స్ ఆడాలి. రెండో వన్డేలో గిల్ అదే చేసి చూపించాడు. మొన్నటి వరకూ అతడి ఫామ్, ఆటతీరుపై కాస్త సందేహపడిన వారికి ఇప్పుడీ ప్రదర్శనతో సమాధానం ఇచ్చినట్లైంది. అఫ్గాన్ తో వన్డే సిరీస్ అనంతరం టీమ్ఇండియా ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లనుంది. ఆ రెండు సిరీస్ లకూ గిల్ ఎంపిక కాలేదు. ప్రస్తుత ఆటతీరుతో అతడికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు వచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు.

> కెప్టెన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. బ్యాటర్ గా అద్భుత ప్రదర్శన చేయడం బాగుంది. ఒక జట్టుకు నాయకత్వం వహించడమనేది ఒక ఆటగాడిలోని సత్తాను బయటకు తీసుకొస్తుంది. అదృష్టవశాత్తూ గిల్ లోని అత్యుత్తమ ప్రతిభను వెలికితీసింది. బాగా పరుగులు చేయలేనప్పుడు కెప్టెన్ గా మంచి నిర్ణయాలు తీసుకోవడమూ కష్టంగా మారుతుంది. అప్పుడు ఇటు ఆటగాడిగా.. అటు సారథిగా విమర్శలు తప్పవు. అదే, వ్యక్తిగతంగా మంచి ఆటతీరు ప్రదర్శిస్తే.. నిర్భయంగా నిర్ణయం తీసుకోగలరు
> **- సునీల్ గావస్కర్**

# 'దురంధర్ స్క్రిప్ట్ అక్కడి నుంచే'.. రాకేశ్ బేడీ స్ట్రాంగ్ కౌంటర్..!

రణ్ వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ దురంధర్. గతేడాది డిసెంబర్ లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ ను షేక్ చేసింది. పాకిస్తాన్ నేపథ్యంలో వచ్చిన ఈ మూవీకి ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పార్ట్-1 బ్లాక్ బస్టర్ కావడంతో మేకర్స్ మూడు నెలల గ్యాప్ లోనే సీక్వెల్ కూడా రిలీజ్ చేశారు. ఈ రెండు పార్టులు కలిసి బాక్సాఫీస్ వద్ద రూ.3 వేల కోట్ల మార్క్ దాటేశాయి. ఈ వసూళ్లతో ఇండియన్ సినిమా చరిత్రలోనే సరికొత్త రికార్డ్ సృష్టించాయి.

అయితే ఈ మూవీపై మొదటి నుంచే విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఇదొక ప్రాపగండ ఫిల్మ్ అనే ముద్ర వేశారు. అయినప్పటికీ వసూళ్ల పరంగా ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. అంతేకాకుండా పార్ట్-1 రిలీజ్ తర్వాత ప్రాపగండ ముద్రవేసిన కొందరు.. ఈ మూవీకి స్క్రిప్ట్ పీఎంవో ఆఫీస్ నుంచి వచ్చిందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా



దురంధర్ నటుడు రాకేశ్ బేడీ స్పందించారు. అలాంటిదేం లేదని ఆయన ఖండించారు. దిల్లీలో జరిగిన అమృత్ రత్న 2026 సదస్సులో పాల్గొన్న రాకేశ్ బేడీ విమర్శించేవారికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

రాకేశ్ బేడీ మాట్లాడుతూ..'ఈ సినిమా హిట్టయ్యాక ధురందర్ స్క్రిప్ట్ నేరుగా ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి రాశారని కొందరు అన్నారు. అలాంటి స్టోరీ రాయగల వ్యక్తి పీఎంఓలో ఎవరున్నారో చెప్పండని నేను అడిగా. అలాంటి ఆలోచన కూడా ఎవరికీ రాదు. ఈ సినిమాలో నేను చెప్పిన డైలాగులు ఎవరైనా రాయగలరా? అసలు అక్కడ ఉన్నవాళ్లు ఇలాంటి డైలాగుల గురించి ఆలోచన చేయగలరా? అని వాళ్లను ప్రశ్నించా' అని తెలిపారు.

కాగా.. ఈ స్పై యాక్షన్ మూవీలో రాకేశ్ బేడీ కీలక పాత్రలో మెప్పించారు. జమీల్ జమాలీగా పాకిస్థాన్ రాజకీయ నాయకుడి పాత్రలో అదరగొట్టేశారు. ఈ చిత్రాలకు ఆదిత్య ధర్ దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సారా అర్జున్ హీరోయిన్ గా కనిపించింది. ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, గౌరవ్ గెరా, ష్ పాండోర్ కీలక పాత్రల్లో నటించారు.





# 'భోగి'లో శర్వా పర్ఫార్మెన్స్.. నెక్స్ట్ లెవెల్ అంటున్న సంపత్ నంది..!

చార్మింగ్ స్టార్ శర్వానంద్, దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్ లో వస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'భోగి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. పూర్తి యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కాగా ఈ చిత్ర సెట్స్ నుండి ఒక ఆసక్తికరమైన అప్ డేట్ వచ్చింది. షూటింగ్ లో శర్వానంద్ పండించిన ఒక ఎమోషనల్ సీన్ చూసి తాను కట్ చెప్పడం కూడా మర్చిపోయానని దర్శకుడు సంపత్ నంది సోషల్ మీడియా వేదికగా తెలిపాడు.

గత దశాబ్ద కాలంలో శర్వానంద్ ఇచ్చిన బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇదేనని ఆయన కొనియాడాడు. ఆ సీన్ ముగియగానే సెట్స్లో ఉన్న 200 మందికి పైగా యూనిట్ సభ్యులు చప్పట్లు కొడుతూ, కళ్ల నీళ్లు తుడుచుకున్నారని సంపత్ నంది పేర్కొన్నాడు. తన కెరీర్ లో ఇలాంటి అనుభూతి కలగడం ఇదే మొదటిసారని తెలిపాడు.

ఇప్పుడు తాను చెప్పిన మాటలు గుర్తుపెట్టుకోవాలని.. థియేటర్లలో 'భోగి' చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా కచ్చితంగా ఇదే ఎమోషన్ కు గురవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. ఇక ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.



# ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేసే ఫన్నీ అలవాటు..

**'మా ఇంటి బంగారం' ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని అంటున్నారు సమంత. ఆమె కథానాయికగా నందినీరెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా సామ్ అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.**

**ఈ మూవీ ఎందుకు చూడాలి? కారణం చెబితే టికెట్ బుక్ చేసుకుంటా!**

సమంత: ఎంతో నిజాతీయగా ఈ మూవీ తీశాం. మీకు కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నా. ప్రతి ఒక్కరూ ప్రేమించే చిత్రమవుతుంది.

**ఈ మూవీ మీకు వ్యక్తిగతంగా ఎందుకంత ప్రత్యేకమైంది?**

ఎందుకంటే.. ఇది నా నిజమైన వ్యక్తిత్వానికి దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలన్నింటిలోకి ఇందులో చేసిన స్వర్ణ పాత్ర అంటే ఎంతో ఇష్టం.

**ఏ భారతీయ నటిని మీరు ఆదర్శంగా తీసుకుంటారు? ఆమె నుంచి పొందే స్ఫూర్తి ఏంటి?**

ఉన్న చోటే ఆగిపోకుండా వృత్తి, వ్యక్తిగత అభివృద్ధి చెందుతున్న ప్రతి ఒక్కరూ నాకు స్ఫూర్తే.

**ఇన్నేళ్ల సినీ కెరీర్ తర్వాత కూడా కొత్త సినిమా విడుదలప్పుడు ఆందోళన పడుతున్నారా? లేదా మారిపోయారా?**

ఒకప్పటితో పోలిస్తే, ఇప్పుడు నేను కొంత ప్రశాంతంగా ఉంటున్నా.

**షూటింగ్ పూర్తయిన తర్వాత కూడా మీరు మర్చిపోలేని సంభాషణలు, డైలాగ్స్ ఏమైనా ఉన్నాయా?**

క్లైమాక్స్ లో వచ్చే సంభాషణలన్నీ అవే. ఈ మూవీ కాన్సెప్ట్ విన్న వెంటనే కచ్చితంగా చేయాలనిపించింది. షూటింగ్ పూర్తయిన తర్వాత నా మదిలో మెదిలిన మొదటి ఆలోచన ఏంటో తెలుసా? ఎప్పుడెప్పుడు ఈ మూవీ మీకు చూపిస్తానా? అని అనుకుంటూ ఉన్నా.

**మళ్లీ మిమ్మల్ని ఒక మంచి లవ్ స్టోరీలో చూడాలని ఉంది!**

అది జరగవచ్చు. జరగకపోనూ వచ్చు.

**ప్రతి సినిమాకు ఒక హృదయం లేదా ఆత్మ ఉంటుంది. ఈ సినిమాకు అదేంటి?**

కుటుంబం

**అభిమానులను సైతం షాక్ కు గురిచేసే మీ ఫన్నీ అలవాటు ఏంటో చెప్పండి?**

ఎందుకో తెలియదు.. నా మొబైల్ లోని యాప్స్ను పదే పదే ఓపెన్ చేసి క్లోజ్ చేస్తుంటా.

**ఇటీవల కాలంలో మీరు చూసి, మీకు నచ్చిన చిత్రం?**


అబ్సెషన్

# వెంకటేశ్ - అనిల్ సినిమా మొదలు

- రాఘవేంద్రరావు దర్శకత్వంలో తొలి షాట్..

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు అనిల్ రావిపూడి మరోసారి సంక్రాంతి బరిలో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. అనిల్ దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో ఓ సినిమా రానుంది. 'ఘ్నుజుడఖుజీజూ5' అనే వర్కింగ్ టైటిల్ తో ఇది ప్రచారంలో ఉంది. ఈ చిత్రం షూటింగ్ నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. రాఘవేంద్రరావు, దిల్ రాజు, సురేశ్ బాబు, అల్లు అరవింద్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో తొలి షాట్ చిత్రీకరణ జరగ్గా.. ఈ సినిమా రూ.200 కోట్లు వసూళ్లు సాధించాలని కోరుకుంటూ అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దిల్రాజు స్క్రిప్ట్ అందించి టీమ్ కు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ఇందులో వెంకటేశ్ కు జోడీగా కీర్తి సురేశ్, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తున్నారు. వెంకటేశ్ - అనిల్ రావిపూడి కాంబినేషన్ లో గతేడాది పండక్కి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే జోష్ తో మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 2027 సంక్రాంతి లక్ష్యంగా శరవేగంగా షూటింగ్ జరగనుంది. ఇక వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం:47' అనే సినిమా చేస్తున్నారు.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.